దేశం... అత్యధికంగా చదవబడుతున్న ఏకైక తెలుగు మాసపత్రిక



సంస్థాపకులు
కీ॥ శే॥ వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి లీలావతి
రాఘవయ్య

నవంబర్ 1980

సంపుటి 8 సంచిక 10

విషయసూచిక

ఈ నెల నవలానుబంధం

మబ్బు వీడిన సూర్యుడు

రచన : వాకాటి పాండురంగారావు

జ్యోతి, 1-8-4/1/1, చిక్కడపల్లి, హైదరాబాదు-500020
సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) 50 రూపాయలు

దీపావళి ప్రత్యేక సంచిక

ఎప్పటివలెనే ఈ సంవత్సరంకూడా 'జ్యోతి' దీపావళి ప్రత్యేక సంచిక సర్వాంగ సుందరంగా ముస్తాబై మీ చేతుల్లో వాలబోతోంది. ప్రఖ్యాత రచయితల కథలు, ప్రముఖ వ్యంగ్య చిత్రకారుల కార్టూన్లు మీ అభిమాన కవుల కవితలు, నిరుపమాన చిత్రకారుడు బాపు గారు చిత్రించిన అనేకవర్ణ ముఖచిత్రంతో 'జ్యోతి' దీపావళి సంచిక 200 పై చిలుకు పేజీలతో ప్రతి పేజీ, ఒక మతాబాలా వెలిగిపోతూ వెలువడనుంది

జ్యోతి దీపావళి ప్రత్యేక సంచికలో కొన్ని ప్రత్యేక ఆకర్షణలు :

× యండమూరి వీరేంద్రనాథ్ పూర్తినవల, రాధ-కుంతి

× జయదేవ్, ఎల్యూ నారాయణరావు, నాథ్‌ధనుస్ ముప్పేట మురిపెంగా రూపొందించిన ప్రత్యేక ఫోటోల కథ

× చంద్ర, రాజేంద్రల విశేష వర్ణచిత్రాలు.

× ప్రముఖ కవుల కవితలకు జయదేవ్ అంటించిన చీమటపాకాయలు

× ఇంకా అనేక యితర ప్రత్యేక రచనలతో దీపావళికి పదిరోజులు ముందే మీ ముందు కొస్తోంది.

జ్యోతి ప్రత్యేక సంచిక కొనడం

దీపావళికి ముందే పండగ జరుపు కొనడం.

వెల, ఎంతో లేదు - ఎనిమిది రూపాయలే!

ధర హెచ్చుట

హెచ్చు కొరకె....



తొలిమాట


"పెరుగుట విరుగుట కొరకే, ధర హెచ్చుట తగ్గు కొరకె" అని సుమతీ శతక కారుడు ప్రకటించిన ఆశాభావం పద్యాల వరకే పరిమితమై పోయిందేమోనని పిస్తోంది పెరుగుతున్న ధరలని బట్టి చూస్తుంటే. అన్ని నిత్యావసర వస్తువులతో పాటు, పత్రికకి నిత్యావసరాలైన పేపరు, ప్రింటింగు ధరలు కూడా ఇటీవల బాగా పెరిగాయి. సరసమైనవెలకే "జ్యోతి" ని పాఠకులకు అందించడం మా పాలసీ అయినా, తప్పనిసరి పరిస్థితుల్లో "జ్యోతి" వెలని స్వల్పంగా— రు, 3-00 నుంచి రు 3-60 కి పెంచక తప్పడం లేదు. విజ్ఞులైన మా పాఠకులు "కని కల్ల నిజము దెలిసే మనుజులు" కనుక ఈ ధర పెరుగుదలను సహృదయంతో స్వీకరించ గలరని మా విశ్వాసం.

○ ○ ○ ○ ○

"జ్యోతి" కార్యస్థానం హైదరాబాదుకు మారడంవల్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తూ అనేక మంది పాఠకులు, శ్రేయోభిలాషులు మాకు ఉత్తరాలు రాస్తున్నారు. వారికి "జ్యోతి" పై గల అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేసుకొంటూ, తెలుగు రాజధాని నుంచి "జ్యోతి" ని మరిన్ని వెలుగులతో వెలువరించడానికి ప్రయత్నిస్తామని మనవి జేసుకొంటున్నాము.

○ ○ ○ ○ ○

"జ్యోతి" ప్రకటించిన కథల పోటీలో ఈసారి రచయితలు అమితోత్సాహంతో పాల్గొన్నారని మాకు చేరిన కథల సంఖ్యని బట్టి తెలుస్తోంది. కథల పోటీ ఫలితాలు వచ్చే సంచికలో ప్రచురిస్తాము.



ఉత్తరాలు

హృదయస్పందనం !

శ్రీదేవి ముఖ చిత్రంతో వెలువడిన అక్టోబర్ 1980 - "జ్యోతి" లో "అగ్గిపుల్ల" కథ హృదయ స్పందనం వలె వుంది. "కోడెగాడు" వచన రూపకం బాగుంది, "పీడకల" - నవల మమ్మల్నెంతో ఆకట్టుకుంది. మధ్య తరగతి కుటుంబాలలో జరిగే వాస్తవాల గూర్చి బాగా రాశారు.

వి. దయానంద్
హైదరాబాద్ — 500098.

అక్టోబర్ నెల "జ్యోతి" శ్రీదేవి ముఖ చిత్రంతో వెలువడి అత్యంత ఆకర్షణీయంగా ఉంది. "ప్రేమసింహాసనం" సీరియల్ చాలా ఉత్సాహంగా సాగుతోంది "మీరా" సీరియల్, చక్కగా ఉంది "భూమి గుండ్రంగా ఉంది" సీరియల్ బాగుంది. ఈ నెల నవలానుబంధం "పీడకల" హృదయానికి హత్తుకొనేలా ఉంది యర్రంశెట్టిశాయి గారికి నా అభినందనలు "అగ్గిపుల్ల", "కోడెగాడిగోడు", కథలు చాలా బాగున్నాయి

గామిని సత్తిరాజు, సత్తిబాబు, అత్తిలి

జ్యోతి అక్టోబరు సంచిక ముఖచిత్రం ("శ్రీదేవి") బాగులేదని చెప్పడానికి విచారిస్తున్నాము. పర్వతనేని గంగాధరరావుగారికథ "బ్రహ్మయ్యగారు" ఆకర్షణీయంగా ఉంది. లక్ష్మిగారి సీరియల్ "మీరా" బాగుంది. చివరికి శేఖర్, మీరాలు కలుసుకుంటారని తెలిసినా కథ అంగుళం కూడా జరగటంలేదనిపిస్తోంది. యద్దనపూడి సులోచనారాణీగారి సీరియల్ "ప్రేమసింహాసనం" అద్భుతంగా ఉంది. ఆవిడ కథని సుఖాంతం చేస్తారని తెలిసినప్పటికీ యింకా కథలో ఏ యే మలుపులు తిప్పుతారో అని ఆత్రుతగా ఉంది! "మళ్ళీ నెల జ్యోతి ఎప్పుడొస్తుందా" అని ఎదురు చూడాల్సి వస్తోంది. యర్రంశెట్టిశాయి గారి నవల "పీడకల" ఆసక్తికరంగా ఉంది, పద్మావతి గంగాధర్‌గారి కథ "మనసు" పరిష్కరించినతీరు బాగుంది, కాని ఎవరో తెలియని ఒక ఆరేళ్ళ అబ్బాయి ముఖంలో ప్రశాంతత, కళ్ళల్లో ఆకర్షణ ఉన్నప్పటికీ అతన్ని యింట్లోకి తీసుకువెళ్ళి అన్నం పెట్టడం అతిశయోక్తి అనిపించింది.

లంక లక్ష్మీనారాయణ,
కర్నూలు

రవికిరణంలా కవి హృదయాలను సైతం దోచుకునే శ్రీదేవి "జ్యోతి" ని ఆక్రమించుకున్న తీరు ఆకర్షణీయంగా వుంది. "మనసు" ను అర్థం చేసుకోవడం కొంచెం కష్టం.... అయినా డా॥ జయానాగరాజ్ గారు బాగా వివరిస్తున్నారు. మనసు చేయని తప్పును "పీడకల" గా భావించి.... భార్యను ఆదరించి జీవితాన్ని నందనవనం గావించిన శ్రీపతి నిజంగా.... ఆదర్శప్రాయుడైన పతి.

కమలా రామ్,
వినుకొండ

అక్టోబరు సంచిక "జ్యోతి" ముఖచిత్రం ఏమంత బాగాలేదు, లోపలి పేజీల్లో

ప్రింటింగ్ కూడా బాగులేదు. కథలన్నీ బాగున్నాయి. "మనసు", "ఏ దేశ చరిత్ర చూసినా" కథలు నా మనసుకి నచ్చాయి. మొదట్లోనే కొడవగంటి కుటుంబరావుగారి స్మృతికి శ్రీ శ్రీ గారి అక్షరాంజలిని ప్రచురించినందుకు సంతోషించాను. కార్టూన్‌లన్నీ బాగున్నాయి. వాకాటిగారి "చేత వెన్నముద్ద" వెరైటీగా ఉంది.

యు. యు. ఉరుకుందు
ఎమ్మిగనూరు

అక్టోబర్ నెల జ్యోతిలో పద్మావతీ గంగాధర్‌గారి "మనసు" కథ హృదయాన్ని కదిలించింది. తల్లి మనసును, పసివాడి మనసునూ చక్కగా చిత్రీకరించిన రచయిత్రికి నా ధన్యవాదాలు. మధుర గాయకుడు మహమ్మద్‌రఫీ పాటలను జ్ఞాపకం చేసి మరోసారి హృదయాన్ని బరువెక్కించారు. "జ్యోతి" మద్రాసు నుంచి ఆంధ్రదేశపు రాజధానికి తరలి రావటం సంతోషకరమైన విషయమే.

డి. మహబూబ్‌బాషా,
ఆదోని

"జ్యోతి" లో ప్రచురించిన నవల "పీడకల" చాలా బావుంది. సహజంగా చక్కగా వుంది.

"ప్రేమసింహాసనం" చదువుతుంటే ఇంట్లో వుండి సినిమా చూస్తున్న అనుభూతి కలుగుతోంది. సహజత్వం తక్కువగా వున్నా చదవడానికి బావుంది.

శ్రీమతి అల్లంరాజు లక్ష్మీనారాయణ,
శ్రీ అల్లంరాజు సత్యనారాయణ,
మాధవి, గీత, విశ్వనాథ్, శ్రీకాంత్.
బొంబాయి

సాంస్కృతిక విశేషాలు

బందరులో "వేసవి" గ్రంథావిష్కరణ

మచిలీపట్నం 'స్పందన సాహితీ సమాఖ్య' ఆధ్వర్యంలో యిటీవల జరిగిన ఒక సభలో వర్తమాన రచయిత శ్రీ కిరణ్ కవితలసంపుటి 'వేసవి' ని కృష్ణా జిల్లా కలెక్టర్ శ్రీ ఎ. వి. యస్. రెడ్డి, ఐ. ఎ. యస్., ఆవిష్కరించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత్వానికి సామాజిక స్పృహ ప్రాణం వంటిదని చెప్పారు. తమ 26 వ ప్రచురణగా వేసవిని వెలువరించిన స్పందన సాహితీ సమాఖ్య సాహిత్య వ్యాసంగాన్ని ఆయన ఘనంగా కొనియాడారు. 'విశాలాంధ్ర' దినపత్రిక సంపాదకులు శ్రీ సి. రాఘవాచారి సభకు అధ్యక్షత వహించారు. సుప్రసిద్ధ సాహితీ విమర్శకులు శ్రీ కె. రామమోహనరాయ్ గ్రంథావిష్కరణ చేశారు.

సోమసుందర్‌కి రాజాలక్ష్మి ఫౌండేషన్ వారి సాహిత్య విమర్శ బహుమతి

దేవులపల్లి కృష్ణశాస్త్రి కవిత్వంపై విపుల విమర్శకు రాజాలక్ష్మి ఫౌండేషన్ ప్రకటించిన రు. 3000 ల నగదు బహుమతి ప్రముఖ కవి శ్రీ సోమసుందర్‌కి లభించింది. ముగ్గురు సభ్యులు గల ఒక న్యాయ నిర్ణేతల సంఘం శ్రీ సోమసుందర్‌ను యీ బహుమతికి ఎన్నిక చేసినట్లు రాజాలక్ష్మి ఫౌండేషన్ వారు విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

నవంబర్ 19, 1980 న మద్రాసులో జరిగే రాజాలక్ష్మి ఫౌండేషన్ వారి ద్వితీయ వార్షికోత్సవ సభలో యీ బహుమతిని విజేతకి సమర్పిసారు. 1980 సంవత్సరపు రాజాలక్ష్మి అవార్డు ప్రఖ్యాత గాయకుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణకి లభించిన విషయం పాఠకులకు తెలుసు.

కళా భారతి

మద్రాసులోని సాంస్కృతిక సంస్థ కళా భారతి ఆధ్వర్యంలో యిటీవల మద్రాసు రాణీ సీతా హాలులో కుమారి రాధా ప్రసాదరావు (హైదరాబాద్) నాట్య ప్రదర్శన జరిగింది. ఆకర్షణీయమైన ఆహార్యం, అందమైన అంగ విన్యాసం, తాళబద్ధమైన పద చాలనం, భావ యుక్తమయిన అభినయం కుమారి రాధ నాట్య ప్రదర్శనను త్యుత్తమంగా తీర్చిదిద్దాయి. ఆ నాటి కార్యక్రమానికి నగరంలోని ప్రముఖ పారిశ్రామిక వేత్త శ్రీ బి. వి. ఎన్. ఎన్. మణి అధ్యక్షత వహించారు. ఆయన కళాకారిణికి పట్టుశాలువ, రజిత వెంకటేశ్వర ప్రతిమా బహూకరించారు. శ్రీ ఆర్. ఆర్. నాథం గారు లక్ష్మీదేవిషీల్డుతో సత్కరించారు. ప్రముఖ చిత్ర నిర్మాత శ్రీ వై. వి. రావ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు కళాభారతి ఉపాధ్యక్షులు శ్రీ డి. వి. కృష్ణారావు గారు వందన సమర్పణ చేశారు.

పత్రికల ఏజెంట్ల సంఘం

ఆంధ్రప్రదేశ్‌లోని వార్తా పత్రికల ఏజంట్ల సమావేశం సెప్టెంబరు 28న మంగళగిరి (గుంటూరు జిల్లా)లో జరిగింది. రాష్ట్రం నలుమూలలనుండి వివిధ పత్రికల ఏజంట్లు హాజరై రాష్ట్రస్థాయిలో ఒక అసోసియేషన్ స్థాపించారు. రిజిస్ట్రేషన్ చేయించడానికి అనువైన ఏర్పాట్లు చేశారు. శ్రీ ఎన్. నాగేశ్వరరావు, రాయల్ గ్యాన్ కంపెనీ, మంగళగిరి—522503, కార్యదర్శిగా ఎన్నికైనారు. హాజరు కానివారు, ఆసక్తిగల న్యూస్ ఏజంట్లు కింది అడ్రసును సంప్రదించవచ్చు.

శ్రీ వాసవ్య
జర్నలిస్టు
నూజివీడు—521201

కథా వేదిక

ఆగస్ట్‌లో మాకు నచ్చిన కథలు

1 ది టాక్సీ డెర్మిస్టు-కావూరి—
ఆంధ్రజ్యోతి 1/8
2 విముక్తి నెల్లూరి కేశవస్వామి-స్వాతి
3 బ్రతుకు చీకట్లో-అనుగీత-
ఆంధ్రభూమి 7/8
4 ఏకాకి ఆకాశం-ఎమ్ మనోహరరెడ్డి
ఆంధ్రప్రభ 20/8
5 తేడా-చాగంటి శంకర్-ఆంధ్రపత్రిక 22/8
6 ఊహా చిత్రం-జె సుబ్బలక్ష్మి-
ఆంధ్రభూమి 31/8

ఇందులో ఎంచిన కథ-బ్రతుకు చీకట్లో
సెప్టెంబరులో మాకు నచ్చిన కథలు లేవు

— కథా వేదిక 5/37 సిరిపురం, ఆంధ్రా యూనివర్శిటీ విశాఖపట్నం-530003

ఉత్తరాలు

'జ్యోతి' ఉత్తరాలు శీర్షికకి లేఖలు రాసేవారు క్లుప్తతనీ, స్పష్టతనీ దృష్టిలో వుంచుకోవలసిందిగా కోరుతున్నాము. దస్తూరీ స్పష్టంగా లేని, లేఖకుల పూర్తి చిరునామా లేని ఉత్తరాలు ప్రచురించడం సాధ్యపడదని గమనించవలసిందిగాకూడాపాఠకులను కోరుతున్నాము.

—ఎడిటర్

చందాదారులకు మనవి

"జ్యోతి" సంచికలు సక్రమంగా అందడం లేదని మా చందాదారులలో కొందరి నుంచి తరచు ఫిర్యాదులందుతున్నాయి. చందాదారులందరికీ "జ్యోతి" సంచికల్ని సర్టిఫికెట్ ఆఫ్ పోస్టింగులో పంపుతున్నాము. అయినా కాపీలు అందడం లేదనే ఆరోపణలు అందుకొనక తప్పడం లేదు మాకు. పోస్టులో తప్పిపోయిన కాపీలకి మేము బాధ్యత వహించలేమని మా చందాదారులకు సవినయంగా మనవిచేసుకొంటున్నాము. ఈవిషయంలో ఇటు మాకు, అటు మీకూ సాయపడగలవారు తపాలా శాఖవారే. వారికి చేతులెత్తి నమస్కరించి వేడుకోవడం తప్ప మేము ఈ విషయంలో చేయగలిగిందేమీలేదని మా చందాదారులు గ్రహించగలరని ఆశిస్తున్నాము. ఇక ముందు చందాలు చెల్లించే వారు కూడా ఈ అంశాన్ని గమనించి తమ చందాలు పంపవలసిందిగా కోరుతున్నాము. అందని కాపీలకు పరిహారం చెల్లించడం కూడా సాధ్యపడదని మనవి చేసుకొంటున్నాము.

—మేనేజర్

జ్యోతి కొత్త చిరునామా

ఆగస్టు 15, 1980 నుండి "జ్యోతి" కార్యాలయం హైదరాబాద్‌లో పని చేయడం ప్రారంభించింది. జ్యోతితో అన్ని ఉత్తరప్రత్యుత్తరాలూ కింది చిరునామాతో జరుపవలసిందిగా కోరుతున్నాము,

—ఎడిటర్

జ్యోతి
సచిత్ర మాస పత్రిక
1-8-4/1/1, చిక్కడపల్లి
హైదరాబాదు—500020

ముఖ్య గమనిక : ఏజంట్లు డ్రాఫ్టులు, మనియార్డర్లుకూడా ఈ కొత్త చిరునామాకే పంపాలి.

నాలుగు కందాలు

మదరాసొస్తే ఈశ్వర్
మదినైనా దిగులు పడకు, మందుకు కరువా!
పది నోటు విసిరికొడితే
నదియై ప్రవహించు బీరు నాయరు రోడ్లో!

చైనా బజారు ఛాయల
కైనా పోబోకు, అక్కడ తా కత్తి,
కొనబోకు కొత్త బ్లేడని,
నీనా భేదం యెరుగదు, నిండా మోసం!

పలనాటి వాణ్ణి నేనే
నిలబడలేకున్న చండ్రనిప్పుల జడిలో
తలిరాకు తమిళ కాంతలు
కలవర పడినట్టు కూడ కనరారీశ్వర్!

కరువట కరెంటు, ఆయిలు
కరువేనట పంచదార కరువట కిరోసిన్,
కరువట నీతి న్యాయం
కరువే ఈ దేశ భాష కచ్చిత మీశ్వర్!

(మద్రాసులో సరదాగా చెప్పిన చాటువుల నుంచి)

- దేవిప్రియ



ముళ్ళపూడి వెంకటరమణ

లెటరేచర్

జనవరి 26, 1968

ఆంధ్రప్రదేశ్ ముఖ్యామాత్యులు
గౌ. శ్రీ నీలం సంజీవరెడ్డిగారికి,

ఆర్యా,


గింజ చింతపండు	వీసె 1 కి	1-75
కల్తీ నూనె	,,	3-50
కొవ్వు నెయ్యి	,,	8-00
బెల్లం	,,	1-38
పిండి పంచదార	,,	1-62
రాళ్ళ కందిపప్పు	శేరు 1 కి	1-00
నీళ్ళ పాలు	,,	0-75
బెడ్డల బియ్యం	,,	0-62
ధర్మాసుపత్రి మందులు	....	నే చెప్పను
చింత పిక్కల కాఫీ	....	0-15
సిగరెట్లు	....	హా
బైస్కోపు	....	హా! హా!
అన్నట్టు ఇంటద్దె	....	అయ్య బాబోయ్
నా జీతం	....	మీకు తెలుసు

లంచం .... ఇది లేకుండా మనుషులు బతకడం అసాధ్యం కనక, నేను బతికే వున్నానని ఒప్పుకుంటున్నాను కనక, లంచం తీసుకుంటూనే వుండి వుంటానని పెద్దల ధైర్యం. అందువల్ల అది ఎంత వుంటుందో మీరే ఆలోచించండి.

ఇట్లు, చిత్తగించవలెను,
సకుటుంబరావు.

1968, జనవరి 26 'జ్యోతి' మాసపత్రికలో శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ అప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వున్న శ్రీ నీలం సంజీవరెడ్డిగారికి రాసిన లేఖ ఇది. (అన్నట్టు అప్పుడు జ్యోతి 60 పైసలు. ఇప్పుడు మూడొంతల యాభై పైసలు!)

ఆగష్టు 15, 1980



భారత రాష్ట్రపతి
గౌ. శ్రీ నీలం సంజీవరెడ్డిగారికి,

ఆర్యా,

గింజ చింతపండు	వీసె 1 టికి	12-60
కల్తీ నూనె	,,	16-10
కొవ్వు నెయ్యి	,,	33-60
బెల్లం	,,	7-28
పిండి పంచదార	,,	11-20
రాళ్ళ కందిపప్పు	శేరు 1 కి	6-44
నీళ్ళ పాలు	,,	3-[illegible]0
బెడ్డల బియ్యం	,,	2-80
ధర్మాసుపత్రి మందులు	....	నే చెప్పను
చింత పిక్కల కాఫీ	....	0-50
సిగరెట్లు	....	హా
బైస్కోపు	....	హా! హా!
అన్నట్టు ఇంటద్దె	....	అయ్య బాబోయ్
నా జీతం	....	మీకు తెలుసు

లంచం .... ఇది లేకుండా మనుషులు బతకడం అసాధ్యం కనక, నేను బతికే వున్నానని ఒప్పుకుంటున్నాను కనక, లంచం తీసుకుంటూనే వుండి వుంటానని పెద్దల ధైర్యం. అందువల్ల అది ఎంత వుంటుందో మీరే ఆలోచించండి.

ఇట్లు,
చిత్తగించవలెను,
సకుటుంబరావు.

ఆ లేఖ విషయం మారిన ధరలతో మరోసారి జ్ఞాపకం చేస్తున్నారు—

ముళ్ళపూడి వెంకటరమణ.

పాస్

మినీ కథ

రేపు పొద్దున 10 గంటల కల్లా కొత్త వుద్యోగంలో జాయిన్ అవ్వాలి! మా ఆఫీసర్ ఎలావుంటాడో ఏమిటో... లోపల భయంగా వుంది. నా పక్కన ఎవరో ముసలాయన కూర్చున్నారు. సిటీ బస్సు జోరుగా పోతోంది. మాటలు కలిపారాయన. మాటల్లో టైం గురించి ప్రస్తావన వచ్చింది." ఈ సిటీ బస్సుల్లో గమ్యస్థానం చేరుకోవడం చాల కష్టం. అందుకని నేనెప్పుడూ అరగంట పాస్ పెట్టుకుంటాను. నా 30 ఏళ్ళ సర్వీసులో సిన్సియర్‌గా వుంటున్నానంటే యిలా టైం అరగంట పాస్ పెట్టుకోవడం వల్లనే" అని చెప్పారాయన.

అయనమాట వేదవాక్కుగా అనిపించింది. అయన అభిమానాన్ని సంపాదించుకోవడానికి అప్పటికప్పుడే అరగంట టైం పాస్‌గా పెట్టాను. ఆయన మెచ్చుకుంటూ "భేష్, నాకు నచ్చావు కుర్రాడా! నీ సిన్సియారిటీ యికనుండి పదిమంది మన్ననలనూ పొందుతుంది" అని దీవించి తన స్టాప్ రాగానే దిగిపోయారు

మరునాడు తెల్లవారే లేచి గబగబ స్నానం చేసి, యింట్లోవాళ్ళని కంగారుపెట్టి నేను కంగారుపడిపోయి 8.30 కల్లా బస్‌స్టాపుకి చేరుకొని సరిగ్గా 9-35 కల్లా ఆఫీసుకి చేరుకున్నాను పురుకులు పరుగులతో.

ఆఫీసులోకి యెంటరవ్వగానే ఆఫీసర్‌గారనుకుంటాను, నిప్పులు రువ్వుతున్నారు. ఆయన నన్ను చూడగానే మండిపడుతూ, "బుద్ధిలేదా నీకు? నీకిచ్చిన అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లోని టైమ్‌ని ఖచ్చితంగా పాటించాలనే జ్ఞానం లేదా? మొదటి రోజునే అయిదు నిముషాలు లేటయితే ముందుముందు యింకేం పనిచేస్తావు? హుఁ, యింకెప్పుడూ యిలా రామాక. వస్తే మెమో పుచ్చుకుంటావు జాగ్రత్త! యింక నడు, అదుగో అమూల చీపురూ, చేటా వున్నాయి. మొత్తం ఆఫీసు రూములన్నీ అరగంటలో తుడిచి నారూంలోకి వచ్చి నిలబడు" అని ఆర్డర్ జారీచేసి తన రూమ్‌లోకి వెళ్ళిపోయారు.

ఆఫీసు డ్యూటీ 9 గంటలకని నాకు తెలీయదు. నిర్ఘాంతపోయాను. యేడుపు వచ్చింది చండశాసనుడిలా వున్నాడీ ఆఫీసరు. నేనేమో గుమాస్తాగా చేరడానికి వచ్చాను. కాస్తంత ఆలస్యంగావస్తేనే యీయన రూములు తుడవమంటున్నాడు. యింకా ఆలస్యంగా వస్తే బాత్రూములు కూడా తుడవమంటాడు కాబోలు అనుకుని వెళ్ళగా ఆఫీసు రూములు తుడవడం మొదలు పెట్టాను కాసేపున్నాకవో అతను కంగారుగా వచ్చి నా చేతిలో చీపురు, చేటా లాక్కొని నన్ను బలవంతంగా పక్కకునెట్టి తను వూడ్చటం మొదలుపెట్టాడు. అతనితో మాట్లాడగా తేలిందేమిటంటే అతనికీ ఈ రోజే సరిగ్గా తొమ్మిది గంటలకు తోటీగా వుద్యోగంలో చేరడానికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ యిచ్చారని

ఆఫీసరుగారు నన్నే తోటీ అనుకుని ఆఫీసు రూములు తుడవమన్నట్టు తెలిసింది. వెంటనే వాటి అరగంటకు తిప్పేశాను."మిమ్మల్ని పిలుస్తున్నా"రని తోటీ చెప్పగానే తొందరగా ఆఫీసర్‌గారి రూమ్‌లోకి వెళ్ళాను

"యేమయ్యా, నేను గుమస్తాగా చేరడానికి వచ్చానని చెప్పడానికి నోరుపెగల్లేదా నీకు? యింత నోరులేని మూగజీవానివి గుమస్తాగా నువ్వేం పనికొస్తావ్! హు వెళ్ళు యీ పక్కనే సిరూమ్. వెళ్ళి ఎకౌంట్ ఫైల్ తీసుకురా? యిహనుండీ నోట్లోమాట నోట్లో వుంచుకుని గొర్రెలా తలూపావంటే వూరుకొనేది లేదు మెమో యివ్వగలను జాగ్రత్త........"

— రాజ్

FREE ! ! ఉచితం ! !

పరీక్ష

క్రీస్తు ప్రభువునుగూర్చి తెలుసుకొని తన మనసు మార్చుకున్నాడు కమ్మరి కాంతయ్య. ఎంతో మంచివాడుగ ఎనిమిది సంవత్సరములనుండి జీవిస్తున్న కాంతయ్య బ్రతుకును చూస్తున్న పాపయ్య అనే నా స్నేహితుడు కాంతయ్యను ప్రశ్నించాడు—"కాంతయ్యా నీవు క్రీస్తునందు విశ్వాసముంచిన దగ్గరనుండి నిన్ను ఒక కంట కనిపెట్టుచున్నాను. నీవు నిజంగా సత్యమార్గంలోనే నడుస్తున్నావు. అందరినీ ప్రేమించి, వారి కష్టాల్లో ధనమో, పణమో ఇచ్చి తోడ్పడుతున్నావు. అయితే మునుపటికన్నా కష్టాలు, ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. అంధనిఆనందాన్ని అన్వేషిస్తూ అర్థంలేని ఆదర్శంకోసం నీ జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నావేమో! దేవునికి మన జీవితాలను అప్పగించినవెంటనే మన కష్టాలు అంతమవ్వాలిగాని, నీకేమో అవి ఎక్కువవుతున్నాయి." కాంతయ్య కళ్ళు కొంతసేపు మెరుపులు చిమ్మాయి. మరుక్షణం ఆముఖం ఆలోచనలతో నిండిపోయింది. "చూడు పాపయ్యా! నా చేతిలోనున్న ఈ ఇనుప ముక్క బండికి అమర్చవలసిన ఒక స్ప్రింగు. దీనిని ఎర్రని అగ్నిలో కాల్చి చల్లనినీటిలోముంచి అటుపిమ్మట సుత్తితో సాగదీసి, నడుమకి వంచి స్వరూపం మార్చి పదును చెయ్యాలి. అప్పుడే అదిపనికివస్తుంది. దీనిని సాగదీసే ప్రయత్నంలో ఇది పెళుసుగానుండి విరిగిపోతే దీనిని పాతఇనుములో పడవేస్తాం. పాతఇనుము ఖరీదు కిలో రూపాయి అయితే ఈస్ప్రింగు ఎంతో విలువైనది. దీనిమీద పందలాది రూపాయలు సంపాదించవచ్చు. అలాగే దేవుడుకూడా మనలను క్రీస్తు స్వరూపములో మలచుటకు ఈ కష్టాలను, కన్నీళ్ళను పంపుతుంటాడు. ఆ దేవుడు మనమీద అగ్నిలాంటి శ్రమలను పంపి మనలను సాగదీసినప్పుడు మన స్వరూపములను మార్చుకొనక పెళుసుగా వున్నట్లయితే పాతఇనుమువలె పారవేస్తాడు. ఇంక దానికి అట్టే విలువ ఉండదు. అయనచేతిలో మన స్వరూపం మార్చుకొనగలిగితే తన విలువైన సేవలో మనల్ని వాడుకుంటాడు. పాలరాయిలో ఇమిడియున్న శిల్పసుందరిని శిల్పిమలచినప్పుడు దాని విలువ పెరుగుతుందిగాని వట్టిముడిరాయికి ఏమంత విలువ ఉంటుంది? కష్టాలు, కన్నీళ్లు, బాధలు దేవుడు మనల్ని దైవస్వరూపములో తీర్చిదిద్దుటకు ఇచ్చే వ్యాయామం."

"అయన నన్ను శోధించిన తరువాత నేను సువర్ణమువలె కనబడుదును" అని దైవాజ్ఞాను సారముగా శోధింపబడిన భక్తుడొకడు పలుకుతున్నాడు. శోధనలో, బాధలలో పడిపోకుండ స్థిరంగా నిలిచే దైవశక్తికోసం ఈనాడే క్రీస్తు ప్రభువును గూర్చి తెలుసుకొనుడి.


—చదలవాద చంద్రమతీదేవి

ఉచితం ! ఉచితం :

మీకు బైబిల్‌కుసంబంధించిన ఉచితంగా లభించే అందమైన పుస్తకాలు కావాలనుకుంటే, ఒకపోస్టు కార్డుమీద మీ అడ్రసను స్పష్టంగా వ్రాసి మాకు పంపండి. పోస్టుఖర్చులుకూడా మేమే భరించి మీకు ఉచితంగా పుస్తకం పంపుతాము.

డా॥ ఎస్. జాన్ డేవిడ్, డి డి, D.D,
ఫార్ కార్నర్స్
పోస్టుబాక్సు 14, చిలకలూరిపేట
గుంటూరు జిల్లా.

GOSPEL MESSAGE INSERTED BY FAR CORNERS




గోపీ వ్యాఖ్యతో వేమన్న వాదం

వేమన్న వాదం
సంకలనం, వ్యాఖ్యానం: డా. ఎన్. గోపి. ప్రచురణ :- హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 10-1-17/2 ఫస్ట్‌ఫ్లోర్, శ్యామ్ నగర్, హైదరాబాదు-500 004.

వేమన పద్యం కనీసం ఒకటయినానోటికి రానివాణ్ని తెలుగువాడిగా పరిగణించ క్కర లేదనే వాదనని మనం బలపరిచినా అలాటి తెలుగువాడు ఈనాడు ఒక్కడూ కనిపించడు. అప్పుడప్పుడేమాటలునేర్చు కుంటున్న పసి పిల్లల నాలుకలమీదకూడా "అప్పుదెప్పుడుఅల్కూఆదంబదముగాను" అనే ముద్దు మాటలు రాసి మనంమురిసి పోతూ వున్నా మిప్పుడు. అ ఆలురాని వారికీ, ఎన్నడూ పాఠశాల ముఖమైనా చూడనోచుకోని వారికి కూడా వేమన పద్యాలు ఒకటి రెండు తప్పకుండా నోటికి వచ్చి వుంటాయి. ఎందుకంటే, ఆ మహా నుభావుడు తన పద్యాలు రాసింది పది మంది "నోళ్ళలో నానడానికే".

వేమన మీద - ఆ మహోన్నత కవిని మహాకవి అనడానికి మనసొప్పడం లేదు! చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 1829లో తొలి సారి వేమన పద్యాలను అచ్చువేసి(అధు నిక?) సాహిత్య రంగంలో పునః ప్రవేశ పెట్టినతరువాతకానీ మన పండితులెవరూ వేమనని పట్టించుకున్నట్టు కనిపించదు. తరువా తరువాతకొమర్రాజులక్ష్మణ రావు, కట్టమంచి రామలింగారెడ్డి, వంగూరు సుబ్బారావు, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ ఆరుద్ర, నార్ల, బంగోరే వంటి ద్దలు వేమనవెలుగులోకి తెలుగుదేశాన్ని రనడిపించే ప్రయత్నం చేశారు.

అయితే, ఎన్. గోపీ అనే ముప్ఫై య్యేళ్ళ సాహితీ వరుడు నడుంబిగించి కలం విదిల్చి వేమన పరిశోధనా రంగం లోకి దిగేవరకు, చెదురుమదురుగా, ఉప న్యాసాలలో, వ్యాసాలలో వీస్తున్న వేమనగాలి ప్రభంజనంగా మారలేదు, తనకు ముందు వేమన గురించి ఆసక్తి కనబరిచిన పెద్దలు వేసిన మెట్లకి, తానుగా కొన్ని సరికొత్త సోపానాలు చేర్చి వేమన పరిశోధనా రంగంలో



గాలిగోపురంవలె నిలుచున్నాడు గోపి. వేమన మీద గోపీ సమర్పించిన పరిశో ధనా వ్యాసానికి ఉస్మానియా విశ్వవిద్యా లయం వారు డాక్టరేటు యిచ్చినందు వల్లనే అది గొప్ప పరిశోధన కాలేదు. అది గొప్ప పరిశోధన కనుకనే, దానికి ఈ గుర్తింపు లభించింది

"వేమన్న వాదం" (పేరులో వున్న పోర్సు గమనించండి) డాక్టర్ ఎన్. గోపీ వ్యాఖ్యానంతో వెలువడిన, ఎన్నికచేయ బడిన వేమన పద్యాల సంకలనం. గోపీ ఈ పుస్తకానికి రాసిన విపులమైన పీఠిక చదివితే ఆయన వేమన తపస్సులో ఎంత పండిపోయాడో, ఆయనలో వేమన ఎంతగా నిండిపోయాడో తెలుస్తుంది. రాచరికాలు, ఆర్థిక భావాలు, మతభావాలు, సాంఘిక భావాలు, వివిధ విషయాలు అని అయిదు విభాగాలుగా పద్యాలను విభజించి సవివరమైన వ్యాఖ్యాన సహితంగా సమ ర్పించారీ పుస్తకాన్ని.

ఇంతవరకూ, వేమనమీద వెలువడిన విమర్శ వెయ్యి పేజీలుంటుందట అచ్చులో. ఆరు దశాబ్దాలక్రితం మొద లైన వేమనని గురించిన వెతుకులాట యిప్పుడు "వేమన స్పృహ"గా మారింది. సాహితీవరులూ, కళాకారులే కాక, సామాన్య పాఠకులలో సైతం వేమన కాన్షస్‌నెస్ చోటుచేసుకుంటోంది. ఈ దారిలో "వేమన్న వాదం" ఒక ముంద డుగే. "వేమన్న వాదం" చిన్న పుస్తకమే కానీ (1/8 డెమీ సైజులో - అంటే "జ్యోతి" సైజులో-156 పేజీలు) విష

యం పుష్కలంగా వున్న పుస్తకం.

వేమన కాలం (17వ శతాబ్ది) నాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితుల నేపధ్యంలో వేమన పద్యాలకు వ్యాఖ్యానం రాయడం ఈ పుస్తకంలోని విశిష్ట లక్షణం. ఇది ఎంతో పరిశోధనతో, చారిత్రిక అవగాహనతో కూడుకున్న విషయం.

"ప్రజాకవి వేమన" అనే పేరుతో గోపి రచించిన సిద్ధాంత వ్యాసం వెలుగు లోకి వచ్చినరోజున వేమన కాలాన్ని గురించి, వేమన పద్యాల సామాజిక నేపధ్యంగురించి కొన్ని కొత్త విషయాలు తెలిసే అవకాశం వుంది. "సాధనమున పనులు సమకూరు ధరలోన" కనుక ఇటువంటి అమితోత్సాహవంతులు (ఉత్సాహవంతులు చాలామందివున్నారు) పూనుకొని ఇటువంటి పుస్తకాలద్వారా వేమనని ఆధునిక తెలుగు మానవుడికి తెలియజెప్పే ఉద్యమాన్ని ప్రారంభిస్తే బావుంటుంది. శాస్త్రీయమైన అవగాహన, సంయమనదృష్టి, పరిశోధనా పరిశ్రమని జీవిత ధ్యేయంగా భావించే గుణం వున్న గోపీవంటి శక్తిపరులైన యువ సాహిత్తివేత్త వేమనని వేమనగా (బంకమట్టిని బంగారం చేసే "మాయావి"గా కాదు) చూపే ఉద్యమాన్ని రూపొందించి నాయకత్వం వహించవలసిన అవసరంకూడా వుంది.



"వేమన్న వాదం" వంటి పుస్తకాల ద్వారా వేమన మనకి మరింత చేరువవుతాడనడంలో సందేహమేమీ లేదు. ఏ నౌబత్‌పహాడ్ మీదో, ప్రభుత్వంవారు వేమనకి కట్టిస్తామంటున్న మందిరాన్ని "వేమన గుడి"గా మార్చే ప్రమాదం జరగనంతవరకు ఇటువంటి చిన్న పుస్తకాలవల్ల దేశానికి మహోపకారమే జరుగుతుంది.

అభ్యుదయ శీలం, శాస్త్రీయ దృక్పధం వున్న ప్రభుత్వంగా తనని తాను వర్ణించుకొంటూన్న ప్రభుత్వం వేమన పరిశోధన విషయంలో తగు శ్రద్ధ వహించి, అందుకు తగినవారిని భుజం తట్టి ప్రోత్సహించడం అవసరం.

"ఆకటికి తొలంగు ఆచార విధులెల్ల
చీకటికి తొలంగు చిత్తశుద్ధి"

అన్న వేమని చీకటిలోనే మిగల్చకుండా మన అభ్యుదయ వాదుల చిత్తశుద్ధి సదా మండుతూనే వుండాలి మరి.

వేమన పద్యాలుగా చలామణి అవుతున్న వేలాది పద్యాలలో, వేమన పద్యాలని వేరు చేసి, ప్రత్యేకంగా గోపీ వంటి విషయజ్ఞుని చేత పీఠిక వ్రాయించి, ప్రచురిస్తే ప్రభుత్వం ఒక మంచి పని చేసిన దవుతుంది. ఈ "వడబోత" అంత సులువైన పని కాదు గానీ, మళ్ళీ వేమన దగ్గరికే వెళ్లి ఆత్మ స్థైర్యం పుంజుకోవాలి — "సాధనమున పనులు సమకూరు ధరలోన"!



సరైన వ్యాఖ్యాతని యెంచుకొని, సరైనపద్ధతిలో, సరసమైనధరకి 'వేమన్న వాదాన్ని' "అచ్చుగుద్ది" మరీ చెప్పినందుకు హైదరాబాద్ బుక్ ట్రస్ట్ వారిని అభినందించక తప్పదు. —డి. పి.

ప్రశ్న

మల్లిక్

వీధిలో కుక్క ఒకటే మొరుగుతూంది. రఘురాం గారు కళ్ళు చిట్లించారు. "ఇదో హంటి.... ఇంటిముందు నుండి ఎవరైనా వెళ్ళేదాకా చెవులు పోయేలా మొరుగుతుంది...." అనుకుంటూ విసుగ్గా చేతిలోని పేపరు సోఫాలో పడేసి హాల్లోంచి వరండాలోకి వచ్చారు.

కాంపౌండులో ఎవరో ఒక అపరిచిత వ్యక్తి టైగర్ మీది మీదికి వస్తూ అరుస్తుంటే వెనక్కి అడుగులు వేస్తూ "ష్... ఛ.... ఛ...." అంటూ దానిని చేతితో అదిలిస్తున్నాడు. అతనికి ఇరవై ఎనిమిదేళ్ళుంటాయి. అతను తొడుక్కున్న కాటన్ బట్టలు నలిగి కాస్త మాసిపోయి ఉన్నాయి. క్రాపు చెరిగిపోయి ఉంది.

"ఏయ్ టైగర్....ఇలారా...."రఘురాం గారు గట్టిగా పిలిచారు.

టైగర్ తోకాడిస్తూ రఘురాం గారి దగ్గరికి పరుగెత్తి ఆయన చుట్టూ రెండు మూడు చుట్లు తిరిగి మళ్ళీ మొరుగుతూ ఆ వ్యక్తి వైపు వెళ్ళబోయింది.

"ఏయ్ టైగర్....కమ్ హియర్" అంటూ రఘురాం గారు పిలిచి దానిని గొలుసుతో వరండాలోని స్తంభానికి కట్టేశారు.

ఆ అపరిచిత వ్యక్తి "థాంక్సండీ.... నాకు కుక్కలంటే చాలభయం"అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

"ఇంతకీ మీరు...."అంటూ అతని వైపు చూశారు రఘురాం గారు.

"సూర్య నారాయణగారి ఇల్లు ఇదేనాండీ?...."అంటూ అడిగాడు అతను.

"ఏ సూర్యనారాయణ?"

"అడ్వకేటు సూర్య నారాయణ గారండీ...."


"ఈయిల్లుకాదు....అసలు ఆపేరున్న వ్యక్తి ఈ ప్రాంతాల ఉన్నట్లు నాకు గుర్తులేదు. ఇంతకీ ఇంటి నెంబరు మీకు తెలుసా?...."

"తెలీదండీ....ఇక్కడే ఎక్కడో ఉంటారు...." అన్నాడు నసుగుతున్నట్లుగా

అప్పుడే రుక్మిణమ్మ చీర చెంగు చేతులకు తుడుచుకుంటూ ఇంట్లోంచి బయటకు వచ్చింది.

"ఏమిటండీ?...." అంటూ భర్తని అడిగింది.

"ఎవరో సూర్యనారాయణగారట.... ఆయన ఇంటి కోసం వెతుకుతున్నారు...." అన్నారు రఘురాంగారు.



"ఇక్కడ ఆ పేరు గలాయనెవరూ లేరు నాయనా...."అంటూ రుక్మిణమ్మ అతనితో అన్నది.

వాళ్ళు మాట్లాడుతున్నంత సేపూ టైగర్ మొరుగుతూనే ఉంది.

"వెధవ కుక్క....ఒకటే గోల.... రాత్రి కూడా నిద్రపోనీయకుండా ఒకటే మొరుగుతుంది, కుక్కలూ పందులూ మనకెందుకే అంటే వినవు...." అంటూ విసుక్కున్నారు రఘురాంగారు.

"బాగానే ఉంది....మన ఇల్లు అసలే ఊరికి దూరంగా ఉంది. ఈ మూల మనిల్లు తప్ప ముందూ వెనకా వేరే ఇల్లు లేదు....అసలే దొంగల భయం కూడా ఎక్కువగా ఉంది....మరి కుక్క లేకపోతే ఎలా?...."అన్నదావిడ దీర్ఘాలు తీస్తూ.

"నేనిక వస్తానండీ...." అన్నాడు ఆ అపరిచిత వ్యక్తి రఘురాం, రుక్మిణిల వైపు చూస్తూ.

"మంచిది నాయనా...." అన్నారు ఇద్దరూ.

అతను గేటువైపు వెళ్ళబోతూ చటుక్కున ఆగిపోయి వెనక్కి తిరిగాడు. అతని కనుబొమలు ముడిపడి ఉన్నాయి. ముఖంలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తూంది. ఏదో ఆలోచిస్తూ తన కుడిచేతి వేళ్ళ వైపు చూసుకుంటున్నాడు.

"ఏమైంది?...." అంటూ అడిగారు రఘురాం గారు.

"నా ఉంగరం అండీ.... నా ఉంగరం పోయింది...." అన్నాడతను కంగారుగా.

"ఉంగరమా? .... ఎలా పోయింది? ఎక్కడ పోయింది?...." రఘురాంగారు ముందుకు అడుగులు వేస్తూ ప్రశ్నించారు.

"కొత్త ఉంగరం అండీ.... మొన్నీ మధ్యనే కొన్నాను.... వేలికి కాస్త వదులుగా ఉంటుంది. జారి పడిపోయి ఉంటుంది...."

"అయ్యయ్యో.... ఎక్కడ పడిపోయిందో ఏమిటో?...." రుక్మిణమ్మ బుగ్గలు నొక్కుకుంటూ అంది.

"ఇక్కడే.... మీ యింట్లోనే పడిపోయి ఉండాలండీ.... నేను మీ ఇంటి గేటు తెరుస్తున్నప్పుడు కూడా నా వేలికి ఉన్నట్టు గుర్తు— బహుశా "మీ టైగర్‌ని చేతితో అదిలిస్తుండగా అది జారి ఇక్కడెక్కడో పడిపోయి ఉండాలి" అన్నాడతను కిందికి ఒంగి చూస్తూ.

"అరెరె.... అయితే వెతుకుదాం పట్టండి.... దొరక్కేం చేస్తుంది. ఇంతకీ ఆ ఉంగరం ఎలా ఉంటుంది? ఏ రంగు రాయి ఉంది...." అడిగారు రఘురాం గారు. అతను అది తెల్లరాయి ఉంగరమని చెప్పాడు.

ముగ్గురూ వెతకడం మొదలుపెట్టారు. కొంచెం సేపటికి ఉంగరం దొరకడం అంత సులువైన పని కాదనిపించింది ముగ్గురికీ. ఎందుకంటే ఆ యింటి కాంపౌండ్ మొత్తం మొక్కలున్నాయి. అంతా గడ్డిమయం పిచ్చి మొక్కలు కూడా దుబ్బులు దుబ్బులుగా మొలిచాయి. ఆ గడ్డి మధ్య, తుప్పల మధ్య ఎక్కడో పడి వుంటుంది. దొరకటం కష్టమే....

కాసేపయిన తరువాత స్నేహితుడి యింటికి వెళ్ళిన రఘురాంగారి అబ్బాయి శేఖర్, బజారుకు వెళ్ళిన నౌకరు కుర్రాడు రంగడూ ఇద్దరూ వచ్చారు. వాళ్ళిద్దరూ కూడా ఉంగరం వెతకడంలో నిమగ్నమైనారు. రంగడు వచ్చి రాగానే రుక్మిణమ్మ వాడిమీద విరుచుకుపడింది.

"తోటని ఇలానేనా ఉంచుకోవడం?.... ఈ గడ్డంతా చూడు.... ఎలా అడవిలా పెరిగిపోయిందో?.... పారతో గడ్డి చెక్కెయ్యరా అని నీకు వారం రోజులనుండీ చెప్తున్నాను.... వింటేనా?.... ఇక్కడ పాములు తిరిగినా తెలీదు...." అన్నారు. వాడు ఆ మాటలు తనని అంటున్నట్లుగా లెక్క చెయ్యకుండా ఉంగరం వెతకడంలో నిమగ్నమైనాడు. మాటల సందర్భంలో తనపేరు రవి అనీ, ఏదో ఆఫీసులో క్లర్కుగా పని చేస్తున్నట్లు చెప్పాడు ఉంగరం పోగొట్టుకున్న ఆ అపరిచిత వ్యక్తి.

అయిదుగురూ ఒక గంటపైనే వెతికారు. కానీ ఉంగరం కనిపించలేదు. రుక్మిణమ్మ తన భారీ శరీరంతో అలా వంగి వెతకలేక వరండాలో కుర్చీలో కూర్చుంది. రంగడు ఒక పార తెచ్చి ఆ ప్రాంతం అంతా గడ్డి చెక్కెయ్యసాగాడు. రఘురాంగారు శేఖర్ ఇద్దరూ చిన్న చిన్న పిచ్చి మొక్కలు చేతితో పీకసాగారు. రుక్మిణమ్మగారు కుర్చీలో కూర్చునే, రఘురాంగారు అజాగ్రత్తతో లోగడ ఏయే వస్తువులను ఎలా పారేసుకున్నారో వివరించి చెప్తూంది. రవి దిగులుగా గడ్డివంక చూస్తూ ఆవిడ చెప్పే మాటలను వింటున్నాడు. మధ్య మధ్య గడ్డి చెక్కడంలో రంగడికి సాయం చేస్తున్నాడు మరో గంట గడిచిపోయింది. ఉంగరం దొరుకుతుందన్న ఆశ కూడా పోయింది అందరికీ.

"అసలు నిజంగానే ఇక్కడే పడిపోయిందా?" రఘురాంగారు సందేహిస్తూ అడిగారు రవిని.

"అవునండీ.... మీ యింటి గేటు తెరుస్తున్నప్పుడు నా వేలికి ఉన్నట్లు నాకు బాగా గుర్తు"

"మరెలా?.. దొరకలేదే.... ఈ గడ్డి పూర్తిగా చెక్కించేస్తాను అప్పుడు దొరుకుతుందేమో...."

"అమ్మో.... ఇంక నావల్ల కాదయ్యో.... అలిసిపోనాను...." ముఖాన పట్టిన చెమటను చొక్కా పైకెత్తి తుడుచుకుంటూ నేలపైన చతికిలబడ్డాడు రంగడు.

"పాపం.... ఇంక వాడు మాత్రం ఎంతసేపని గడ్డి చెక్కుతాడు. అసలే మిట్టమధ్యాహ్నం అయింది. తరువాతే నెమ్మదిగా చెక్కిసీయండి...." అన్నాడు రవి రంగడి వంక జాలిగా చూస్తూ,

"మరి మీకు ఆలశ్యం...."

"నేనిప్పుడు ఇంటికి వెళ్ళిపోతాను. ఎందుకైనా మంచిది యింట్లోనే ఉందేమో చూస్తాను. మళ్ళీ రేపు సాయంత్రం వస్తాను. మీకు ఉంగరం దొరికితే ఇచ్చేద్దురు గాని" అన్నాడు.

"ఉంగరం దొరికినా దొరకలేదని అంటామని మీకు అనుమానంలేదా?...."

"అబ్బే..., మీ మీద నాకు ఆ మాత్రం నమ్మకం ఉంది" అని మర్నాడు

సాయంత్రం వస్తాను అని మరోసారి చెప్పి రవి వెళ్ళిపోయాడు. రవి వెళ్ళిన తరవాత రంగడికి మళ్ళీ చీవాట్లు పడ్డాయి తోటను సరిగా చూడడం లేదని.

"అమ్మా.... ఇంక ఈ వెధవ గోల చాలే.... నేనూ, మా స్నేహితుడూ కలిసి మేట్నీ సినిమాకు వెళుతున్నాం.... లైమౌతుంది అన్నం పెట్టేయ్...." అన్నాడు శేఖర్ చేతివాచీ వంక చూస్తూ.

"మీరు కూడా లేవండి.... కాళ్ళు కడుక్కొందురు గాని" అని రుక్మిణమ్మ లేచింది.

లోపలికి వెళ్ళిన ముగ్గురికీ ఆ దృశ్యం చూసి కాసేపు మాట రాలేదు. చివరికి "అమ్మో...." అంటూ గట్టిగా అరిచింది రుక్మిణమ్మ.

ఆ యింటి దొడ్డి తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. వంటగదిలోని గిన్నెలు అటూ ఇటూ పడేసి ఉన్నాయి. వంటి గది నానుకొని ఉన్న గదిలోని బీరువా తెరిచి ఉంది. బీరువాలోని చీరలన్నీ గదిమధ్యకు విసిరివేయబడి ఉన్నాయి.

రఘురాం గారు గబగబ టేబులు సొరుగు లాగి చూశారు. అందులో తను పెట్టిన పది వంద రూపాయల నోట్లు, తన వాచీ కనబడలేదు. రుక్మిణమ్మకు బీరువాలోని తన నగలపెట్టి కనిపించలేదు.

వాళ్ళింట్లో దొంగలుపడ్డారు. అందరూ రెండు గంటలపైగా వీధిలో ఉంగరం వెతకడంలో నిమగ్నమై ఉన్నప్పుడు ఈ దొంగతనం జరిగింది. శేఖర్ వెంటనే పోలీసు స్టేషనుకు వెళ్ళి రిపోర్టు ఇచ్చాడు. పోలీసులు ఇంటికి వచ్చి మొత్తం పరిశీలించి వేలిముద్రల కోసం వెతికి అందర్నీ నానా రకాల ప్రశ్నలూ వేసి, హంగామా చేసి "మరేం పరవా లేదు....మేమున్నాంగా" అని చెప్పి వెళ్ళిపోయారు.

"పోవాల్సింది మీరు కాదు .. నా డబ్బు....నగలు...." అంటూ గొణుక్కున్నారు రఘురాంగారు. పోయిన ఆ వెయ్యి రూపాయలూ అప్పుడే ఒకవ్యక్తి కవరులో పెట్టి ఇంటికి వచ్చి ఇచ్చాడు. అతనికి ఆఫీసులో తనవల్ల కావలసిన పని ఒకటి ఉంది. ఆదివారం ఇంటికి వచ్చి వెయ్యి రూపాయలు ఇవ్వమని చెప్పాడు. అతను తెచ్చి ఇచ్చిన వెంటనే టేబుల్ సొరుగులో పెట్టాడు. అంతే....వెంటనే దొంగలు పడి వాటిని కొట్టేశారు. ఆ నగలు కూడా ఆయన నానా గడ్డితిని భార్యకోసం సంపాదించినవి. అవీ పోయాయి. మళ్ళీ అవన్నీ సంపాదించా లంటే ఎన్నాళ్ళు పడుతుంది?... ఎంత గడ్డి తినాలి?....

ఆ మర్నాడు సాయంత్రం పోయిన తన ఉంగరం గురించి అడగడం కోసం రవి రాలేదు.

"ఉంగరం పోయిందంటూ అందర్నీ వెతికించే పనిలోపెట్టి ఇంటి వెనకనుండి వేరే మనిషిని పంపి.... .... రవికి ఈ దొంగతనంతో సంబంధం లేదు కదా?...."

ఇది రఘురాంగారి మనసులో తలెత్తిన ప్రశ్న. *

ప్రేమసింహాసనం

యద్దనపూడి సులోచనారాణి



30 సీరియల్

రైలు వెళుతున్న శబ్దం, లయబద్ధంగా విన్పిస్తోంది. స్వప్న తల వెనక్కి ఆనించి కిటికీలోనుంచి, రెప్పవాల్చనట్టుగా, తదేకంగా చూస్తోంది. బైట చెట్లు, చేనలు పరుగులు తీస్తూ, మనిషి జీవితంలో, క్షణాల్లా అతివేగంగా కదిలి పోతున్నాయి. స్త్రీలకు మాత్రమే ప్రత్యేకించిన బోగి అది. ఆ పెట్టెనిండా ఆడవాళ్ళు కిక్కిరిసి వున్నారు. కొంతమంది నిద్రకి తూగుతుంటే, మరికొంతమంది కబుర్లాడుతున్నారు. కొంతమంది మారాం చేస్తున్న పిల్లల్ని సముదాయిస్తున్నారు. స్వప్న వారెవరి పట్లా ఆసక్తి లేనిదానిలా కూర్చునివుంది. ఆకళ్ళలో విషాదం వుంది. ఒంటరి తనంవుంది. ఏదీపట్టని వైరాగ్యంవుంది. సర్వసామ్రాజ్యాన్ని వదిలేసి సుదూర తీరాలకి వెళ్ళిపోతున్న మహారాజ్ఞి తాలూకు, నిర్వేదంవుంది. వచ్చేసింది తను సుధీర్‌ని వదిలేసి ఒంటరిగా సుదూరంగా వెళ్ళిపోతోంది. స్వప్న మనసంతా దిగులుగా వుంది.

పక్కనున్న ఆడ చెయిపట్టి కదుపుతూ అంది.

'ఏమండీ, కాస్త మా పిల్లది మిమ్మల్ని అనుకుని పడుకుంటుంది. మీరేమీ అనుకోరుగా: మిమ్మల్నే.'

'ఆఁ' స్వప్న ఈలోకంలోకి వచ్చినట్టుగా అంది.

,చాలా సేపటినుండి కాలుమీద పడుకుంది. కాలుచాలా తిమ్మిరిగా వుంది. ఒక్క నిముషం లేవదీస్తాను. అర్థిస్తున్నట్టుగా అంది, స్వప్న తల తిప్పి మొదటిసారిగా ఆ యువతిని చూసింది. ఆమెకి సుమారుగా 35 సంవత్సరాలు వుంటాయేమో! ముఖంనిండా; దట్టంగా, స్ఫోటకం మచ్చలు వున్నాయి. కాస్త పెద్ద ముక్కు, లోతయిన కళ్ళు, ముఖంలో యవ్వనపుటిగీ చెదరకపోయినా, చెంపల దగ్గర జుట్టు నెరసింది. ఆమె ఒడిలో ఇద్దరు పిల్లలు వున్నారు. కుడిచేతిమీదకి వరిగి నాలుగేళ్ళ కుర్రాడు నిద్రపోతున్నాడు. ఎడమచేతిమీద రెండు జడలు పిలకలుగా వేసుకున్న ఒక ఆడపిల్ల నిద్రపోతూంది. స్వప్నకి ఆ క్షణంలో ఆమెని చూస్తే జాలివేసింది. తను జరిగి కూర్చుని, ఆమె ఒడిలో పడివున్న కుర్రాడిని తీసుకుని, తన తొడమీద ఆనించుకుంది. స్వప్న చేసిన సహాయానికి ఆ యువతి ముఖం వికసించింది. ఇంకొక కుర్రాడిని లేపి వీపుకి ఆనించుకొని కాలు రుద్దుకుంటూ అమ్మయ్య అంది. కొంచెం సేపయిన తర్వాత స్వప్న ఒడిలో నిద్రపోతున్న కుర్రాడిని తీసుకోబోయింది. 'ఫర్వాలేదు వుండనీయండి,' అంది స్వప్న. ఆ యువతి ముఖం వికసించింది. 'మీరు చాలా మంచివారులా వున్నారే. ఇందాక యీ ప్రక్క లావాటి ఆవిడమీద మా అమ్మాయి పడింది ఆవిడ గయ్యిమంది అయ్యో మీకు యిబ్బందేమో.'

"ఫర్వాలేదులెండి" అంది స్వప్న.

రైలు వెళుతోంది. స్వప్న కళ్ళు తన, ఒడిలో వున్న పసిపిల్లాడి మీద నిలిచాయి! క్షణం సేపు స్వప్న మనసు మత్తుగా. మధురంగా అయింది. తన కడుపులో రూపు దిద్దుకోబోతున్న ప్రాణం పాపా, బాబా! ఎవరు అయితేనేం; తమ ఇద్దరి కలల పంట! తనకిప్పుడు జీవన కేంద్రం అదేగా: స్వప్న అప్రయత్నంగా ఆ కుర్రాడి ముఖంమీద పడుతున్న జుట్టు పైకి తీసింది: ఆ పిల్లల బట్టల్లో, దరిద్రం తొంగి చూస్తున్నా, శరీరాలలో ఆరోగ్యం బాగా కన్పిస్తోంది! బుగ్గలు నిండుగా వున్నాయి;

మీ పేరేమిటి? ప్రక్కనున్న ఆమె అడిగింది.

'స్వప్న'

'ఎంత అందమైన పేరు!', ముచ్చటగా చూసింది.


'మీ పేరు!'

"మీ పేరులా అందమైంది కాదు"

"ఏం పేరు!"

"అసలు పేరు నాగ సత్యవతి, కానీ అందరూ నాగమ్మా" అంటారు." నిట్టూరుస్తూ అంది. 'ఏమిటో పేరులో ఏముంది. ముఖమే మొద్దు అయినప్పుడు,' అంది

'ఏమైంది:'



ముఖం చూపిస్తూ అంది. 'నేను పుట్టినప్పటి నుంచి యిలా వున్నాననుకున్నారా ఏమిటి: నా ముఖం ఎంతో చక్కగా వుండేది. ఇదిగో ఈ చంటివాడు పుట్టిన ఏడాదిలో మశూచికం వచ్చింది. అప్పుడిలా దెయ్యంలా అయిపోయాను. స్వప్న ఒడిలో నిద్ర పోతున్న కొడుకు మీద ఒక్కటి చరుస్తూ అంది. పిల్లాడు చుర్రుమన్న చోట గోక్కుని, మళ్ళీ నిద్రలో మునిగాడు.

అప్పటివరకూ నా మొగుడు, నేనెంత చెపితే అంత అన్నట్టు వుండేవాడు. ఆ తర్వాత మారిపోయాడు. చెబుతూవుంటేనే నాగమ్మ కళ్ళలో నీళ్ళు వచ్చేసినాయి. స్వప్న నాగమ్మ ముఖం చూసింది. ముఖాన బొట్టులేదు. మెడలో సిగా పుస్తెలతాడు లేకుండా వుంది.

'ఇప్పుడు బాగా చూడడా నిన్ను?'

"అయ్యో! చూడడానికి యిప్పుడెక్కడున్నాడు. రెండేళ్ళక్రితం, వాతం వచ్చి పోయాడు. అప్పటినుంచి నాకు కష్టాలు మొదలయినాయి."

'ఏవూరు!'

'రాయపురం.' మీది ఏవూరు.

"హైదరాబాద్"

"ఎక్కడికి వెళ్తున్నారు."

"అదే తెలియటం లేదు" శూన్యంలోకి చూస్తోంది.

నాగమ్మ నివ్వెరపోయినట్టు చూసింది. "తెలియడంలేదా" అదేమిటి కాస్త ఆగి అనుమానంగా అడిగింది. ఇంట్లోంచి చెప్పకుండా వచ్చేశారా ఏమిటి?

స్వప్న అవునన్నట్టు తల వూపింది.

"ఎందుకని"

స్వప్న మాట్లాడ లేదు.

"యింకెవ్వరూ లేరా?"

"వున్నారు. కానీ వాళ్ళ యింటికి వెళ్ళటం యిష్టం లేదు,"

నాగమ్మకి చెప్పలేనంత వుత్సాహం వచ్చింది. చెప్పకుండా ఎందుకు వచ్చావు.

స్వప్న జవాబు చెప్పలేదు.

నాగమ్మ కుతూహలంగా చూస్తోంది. మధ్యమధ్యలో ప్రశ్నార్థకంగా కను బొమలు ముడుచుకుంటున్నాయి. స్వప్నని చూస్తే కలవారింటి బిడ్డలా వుంది. ఆ కట్టు, బొట్టు, మాట, చదువుకున్న అమ్మాయిలానే వుంది. ఇంట్లోంచి ఎందుకు వచ్చేసింది,

"ఇష్టం లేని పెళ్ళా" అని అడిగింది.

స్వప్న కాదన్నట్టు చూసింది.

"మరి."

"ప్రేమించిన మనిషికి దూరం అయ్యాను!" భారంగా అంది స్వప్న.

"అదీ సంగతి. ఇక అర్థమయిందిలే" అన్నట్టు చూసింది నాగమ్మ. నాగమ్మ ఆ తర్వాత చాలా వుత్సాహంగా కబుర్లు మొదలు పెట్టింది.

తన మగడు వుండగా, అత్తకీ తనకీ క్షణం పడేది కాదుట! మొగుడు పోయిన తర్వాత యిద్దరూ కలిసే వున్నారుట! నాగమ్మకి గేదెలు, ఆవులూ వున్నాయట! డైరీ ఫారమ్‌కి పాలు పోస్తుంది. పిల్లల్ని చదివించాలని వుబలాటం. కానీ డబ్బు సరిపోదుట!

"నీ కభ్యంతరం లేకపోతే రా! మా వూళ్ళో స్కూలు వుంది. అక్కడ ఏద యినా వుద్యోగం చేసుకోవచ్చు," అంది. మా యింటో నీకేం భయం లేదమ్మోయ్! నేను, మా అత్త తప్ప మగపురుగు లేదు. నా మొగుడు బతికి వుండగా, వూరికో గౌరవంగా వుండే వాడు. అందుకని అందరూ మమ్మల్ని బాగానే చూస్తారు. నువ్వు మా పిన్ని కూతురువని చెప్తాను. నాకేం అక్కర్లేదు. నీకు రెండు పూటలా సుష్టుగా అన్నం పెడతాము. నా పిల్లలకి చదువు చెపితే చాలు" అంది.

"ఏమిటి వస్తావా? రావా" అంది

స్వప్న మాట్లాడ లేదు.

రైలు ఆగింది. రాయపురం స్టేషన్ వచ్చింది. నాగమ్మ పిల్లలందరినీ బాది లేపింది, 'సన్నాసుల్లారా లేవండి! మనవూరు వచ్చింది ఈ సంచీ, బుట్టా పట్టుకోండి' అంది.

"ఏమిటి వస్తావా"! అంది,

స్వప్న అలాగే కూర్చుంది,

"సరే మీ యిష్టం," అని నాగమ్మ దిగేసింది.

రైలు కూత వేసింది.

స్వప్న చేయి మెల్లగా పెట్టెని అందుకుంది. స్వప్న లేచింది, కమ్మీ పట్టుకుని దిగింది,

స్వప్న రైలులో నుంచి దిగగానే, నాగమ్మ ముఖం వికసించింది!

అదదీ! మనిషి మీద నమ్మకం అంటే అలా వుండాలి. చూడు, అదిగో అదే మా వూరు, ఆ వూరిలో అడుగు పెట్టగానే ఎదురైన కొంపలోకి తొంగిచూసి, నాగమ్మ ఎట్లాంటిది! అని అడుగు. ఆ ఖార్సయిన మనిషి అని వాళ్ళు నీకు జవాబు చెప్పకపోతే నా చెవి తెగ్గోయించుకుంటాను" అంది. స్వప్న నాగమ్మ వెంట నడవసాగింది.

"అమ్మా! ఎవరేయీమె" ! అంది పిల్ల.

"ఈమె! అత్త! నీక అత్త అవుతుంది! అంది నాగమ్మ.

(సశేషం)





మా కుటుంబానికి,
ఎన్నో కప్పుల కమ్మని
చిక్కని టీ--రుచికి
మా కృతజ్ఞతలు !





లిప్టన్
రుబీ
డస్ట్

80/2/1810/TL

మినీకథ

కస్టమర్

మల్లాది వెంకటకృష్ణమూర్తి

"అదికాదు ఆ పక్కది చూపించండి."

సేల్స్‌కౌంటర్ ముందున్న చిన్న స్టూల్‌మీద కూర్చున్న నలభైఏళ్ళావిడ ఎదురుగా వున్న బట్టలని చూపించింది.

సేల్స్‌గర్ల్ ప్రభావతికి విసుగ్గా వుంది. కాని తప్పదు. అప్పటికే దాదాపు నలభై రకాల చీరలు తీసి ఆవిడకి చూపించింది. ఒక్కటీ నచ్చలేదు ఆవిడకి.

ఆవిడ చూపించిన చీర తీసి, కౌంటర్ మీద మిగతా చీరలని పరిచింది. చేత్తో దాని నాణ్యాన్ని పరిశీలించింది ఆవిడ. పెదవి విరిచింది. అంచు చూసి చెప్పింది.

"ఆకుపచ్చ రంగు అంచుండే చీర దొరకుతుందా ఇదే రంగుతో?"

తల అడ్డంగా వూపింది ప్రభావతి. ఆవిడ కళ్ళు మళ్ళీ చీరల మీదకి వెళ్ళాయి. కొన్ని నిముషాలు పరీక్షగా చూసి చెప్పింది.

"ఆ వూదా రంగు చీర చూపించండి.


ప్రభావతి విసుగుని ప్రదర్శించకుండా దాన్ని బయటికి తీయడానికి వెనక్కి తిరిగింది. ఆవిడ కూతురి మాటలు వినబడ్డాయి.

"వర్షం తగ్గిందే అమ్మా. తగ్గాక చెప్పమన్నావుగా."

ఆవిడ మాటలు వినబడ్డాయి వెంటనే.

"వద్దులెండి. తీయకండి... థాంక్స్."

వెనక్కి తిరిగేసరికి ఆవిడ తన ఆరేళ్ళ కూతురి చేతిని పట్టుకుని బయటకి వెళ్ళటం ప్రభావతి కంటపడింది.



26

ఇల్లు అలగ్గానే పండగ కాదు
సున్నం వెయ్యగానే పెళ్ళికాదు అంటారు.
యింటి సున్నం పని పూర్తి అయింది.
దూరాన్నుంచి చూస్తే "యీ యిల్లు కట్టిన తరవాత సున్నం మొహం

ఎరగదేమో" అన్నట్టున్నా, దగ్గర కొచ్చి గోడవానకునిల్చుంటే అంటుకున్న సున్నం యీ మధ్యనే వేశేరు అన్న నిజం చెప్తుంది.

"అమ్మయ్య" తేలిగ్గా నిట్టూర్చింది జానకి

మొత్తానికి అనుకున్నది సాధించగలిగేను అని చిన్న పిసరు గర్వంకూడా కలిగింది. నిజానికి బాత్రూములు మినహా పని అంతా అయిపోయినట్టే. అవి కూడా మహా అయితే మరో మూడు....తప్పితే నాలుగు రోజులు పట్టవచ్చును.

ఏముంది? తనింక జెండా ఎత్తెయ్యడమే.

కాని....కాని....ఎక్కడో ఏదో అపశృతి....

ఔను. ప్రకాశరావు వాళ్ళు యిల్లు ఖాళీ చెయ్యకపోతే యిల్లు ఎంతబాగుచేసి ఏంలాభం? యిన్నివేలు, యింత శ్రమ ఖర్చుపెట్టింది ఆఖర్నవాళ్ళ మొహానకొట్టడానికా?

వాళ్ళు ఖాళీ చెయ్యనంత వరకు పనిపూర్తి అయినా సరే తను కదలడానికి వీలేదు.

మొండివాడు రాజుకంటె బలవంతుడు

ప్రకాశరావులాంటివాడు భగవంతుడికంటె బలవంతుడు

"బాబ్బాబు; మా ఇల్లు మాకు యివ్వండి" అని బతిమాలే యివ్వలేదు.

"ఖాళీ చేస్తారా? తన్నమన్నారా?" అని బెదిరిస్తే బెదరలేదు.

ఎప్పుడు ఖాళీచేస్తారో?

"మాకు సరిపోయేయిల్లు దొరికితే పోక యింతోటి భవనంలోనూ ఉంటావా? యీపాటి కొంప దొరక్కపోదు. మంచీ, చెడ్డా వుండొద్దు? పిల్లున్న పళాన పొమ్మంటే ఎక్కడికి పోతాం? వెళ్ళేవరకు ఆగకుండా ఒకటే ఊదర గొడ్తెస్తున్నారేమిటమ్మా? అంటూ సాగదీసింది ప్రకాశ రావు భార్య


ఆవిడకంటె ఘనుడు ఆవిడ మొగుడు.

పో, పో. అడవేం గాని నాకివ్వాల్సిన డబ్బు గురించి మాట్లాడరేం? నా డబ్బు నాకు పారేస్తే, వాళ్ళ ఇల్లు వాళ్ళకి పారేస్తాను. నేను గాని గుమ్మం దిగేనంటే మరింక నా డబ్బుకి చెమ్మాడు నవ్వలే గతి. ఒకటా? రెండా? మూడొందలు. అతనేమో రాడు. యీడేమో నాకు తెలీదంటుంది. యీ ముష్టిమూడొందల కోసం నేను నాలుగు వందలు ఖర్చుపెట్టుకొని వెళ్ళి రావాలా? ఏం మనుష్యులా నాయనా?" అన్నాడు ప్రకాశరావు.

అంటే?

డబ్బు యిచ్చేవరకు కదలడా?

కదలడు.



పోనీ డబ్బు పారేస్తే

"డబ్బు ఒక్కటేనా? వెండి చెంబు, పట్టు బట్టలు కూడా కావాలా? ఏమనుకుంటున్నాడు యిడియట్? చస్తే ఒప్పుకోను" అన్నాడు రాజేశ్వరరావు.

మరెలా?

వావుఁలు కొట్టుకు పోతుంటే గడ్డిపరక కోసం ఏడిచేరట అలా వుంది.

యిన్నివేలు తగలెయ్యగాలేనిది యింకా మూడొందల కోసం కక్కుర్తిపడితే తను యిక్కడ ఏళ్ళతరబడి వుండాల్సిందే

"కక్కుర్తి కాదు ఎకొశ్చన్ ఆఫ్ ప్రిన్సిపల్. అంతే" అంటాడు రాజేశ్వరరావు

"నేనూ అంతే" అన్నాడు ప్రకాశరావు.

కరవమంటే కప్పకి కోపం

విడవమంటే పాముకి కోపం!

"ఏదీ గతి నాకు? అని అరవ లేదు జానకి.

గప్ చుప్‌గా ప్రకాశరావు భార్యకి డబ్బు పంపించేసింది, మా యందు దయుంచి వెంటనే మా యిల్లు మా కివ్వవల్సింది అన్న అభ్యర్థనతో సహా.

రశీదు జానకి అడగ లేదు.

ప్రకాశరావు యివ్వలేదు.

కాకపోతే ఆ మర్నాడు మాత్రం యిల్లు ఖాళీ చేశారు.

ఇప్పటికైనా ఖాళీచేసినందుకు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది జానకి.

"దొంగరాస్కెల్ ఎవడి కోసం ఖాళీ చేస్తాడు? మరో రెండ్రోజులుంటే పోలీసుల్ని పెట్టి గెంటించే వాణ్ని. ఒంటరి ఆడది కదా జులుం చేదామనుకున్నాడు. యూస్‌లెస్ ఫెలో" అంటూ నవ్వేడు రాజేశ్వర్రావు గర్వంగా.

కాని ప్రకాశరావు ఖాళీ చెయ్యడానిక్కారణం పోలీసు భయం కాదనీ, జానకి పంపిన డబ్బనీ అతనికి తెలీదు.

"పోన్లెండి ఇప్పటికైనా పోయారు అంతే చాలు" అంది జానకి తనకేం తెలీనట్టు.

అప్పటికి బాత్రూము గోడలు పూర్తి అయేయి. అప్పుడొచ్చింది భ్రమరాంబ తమ్ముడి పెళ్ళానికి గాజులు పెట్టిస్తున్నారంటూ:

"మొత్తానికి సాధించేవు సుమా జానకీ. నేను మొదటి నుంచీ మొత్తుకుంటూనే వున్నాను మొగాణ్ణి నమ్ముకొని లాభంలేదూ. ఏదో ఆడవాళ్ళం మనమే, అన్నీ చక్కదిద్దుకోవాలి అని. పోన్లే ఇప్పటికైనా విన్నావు" అంటూ బొట్టుపెట్టి, రేపు మధ్యాహ్నం భోజనానికి అక్కడికే వచ్చి పనవలేంటూ కూర్చోక" అంది

అన్నాక అక్కడున్న స్టూలు మీద కూర్చుంది.

కూర్చున్నాక యిల్లంతా ఓసారి కలయ చూసింది.

చూసేక మెచ్చికోలుగా ఓ చిరునవ్వు నవ్వింది.

నవ్వేక సందేహంగా మొహంపెట్టి "షుమారు ఎంతయిందనడిగింది.

ఆరాలు తియ్యడం భ్రమరాంబ అలవాటు; అయితే, జవాబు సూటిగా చెప్పకపోవటం జానక్కి అలవాటు.


"చాలా వదిలిందిలెండి" సందేహనివృత్తి చెయ్యలేదు జానకి.

"ఎంత అయితేనేం యిల్లంటూ ఓరూపు కొచ్చింది. అంతేచాలు." సంతోషించింది భ్రమరాంబ. అప్పటి వరకు ఏదో యదాలాపంగా మాట్లాడుతున్న జానక్కి అకస్మాత్తుగా జ్ఞాపకం వచ్చింది భ్రమరాంబ తనవూరి నుంచే వచ్చిందని.

"మా వాళ్ళంతా బావున్నారా!"

భారంగా నిట్టూర్చింది భ్రమరాంబ.

"ఏం బాగులే. ఆడదిక్కులేని కొంప. మీ పిల్లకి వారంనుంచి జ్వరంట. పాపం అలాగే తంటాలు పడతోంది. అప్పటికీ చెప్పేను మీ అమ్మకి రాయి ఓసారి వచ్చి వెళ్తుంది అని. నువ్వేమైనా అనుకో గాని జానకీ జగన్నాథం వట్టి మొండి మనిషి సుమా. అన్నట్లు నేను చెప్పేనని చెప్పకు సుమా. ఏదో ఆడ ప్రాణం కనక వుండబట్టక చెప్పేను, అంతా అయిపోయినట్టేకదా ఆకాస్త ఎవరికైనా అప్పచెప్పి



వెళ్ళిపో." అని సలహా కూడా యిచ్చింది

అప్పటి వరకు తను సాధించిన విజయం అంతా నీరుగారిపోయినట్లైంది జానక్కి.

కూతుర్ని తల్చుకున్న జానక్కి కడుపులో పండిపోతోంది, ఏ అవస్థలు పడుతున్నారో ఏమిటో? అందులో ఏ ఒక్కరికి మంచినీళ్ళు ముంచుకొని తాగడం చేతకాదు, వెధవయిల్లు ఉంటే ఉంటుంది, పోతే పోతుంది భ్రమరాంబ చెప్పినట్టు ఏరాజేశ్వర్రావుకో అప్పచెప్పేస్తేసరి.

కాని అప్పగించుకొనడానికి రాజేశ్వర్రావు ఒప్పుకోలేదు.

"చూడండి, మరీ అంత భయపడతారెందుకు? జ్వరం వస్తే మాత్రం జగన్నాధం డాక్టర్ కాడా? అవసరమనుకుంటే వాడే రాసేవాడు, నాకు చెయ్యడం యిష్టంలేదని మాత్రం అనుకోకండి, నా యిష్టాయిష్టాలతో సంబంధంలేదు. పైవాళ్ళకి వదలకున్న బాధ్యత ఏందుకుంటుంది? యిన్నాళ్ళు ఓర్చుకున్నారు. మరో రెండ్రోజులు. అంతగాకావాలంటే ఫోను చేద్దాం అన్నాడు రాజేశ్వరరావు.

మనసు ఎంత పీకుతున్నా ప్రయాణం వాయిదా వేసుకోక తప్పలేదు జానక్కి.

(సశేషం)

సాకీ

పాలకోడేటి సత్యనారాయణరావు

స్ప్రింగ్ డోర్ తోసుకొని లోపలకు వచ్చిన కుముదకు అక్కడ ప్రపంచం అంతా కొత్తగా వింతగా తోచింది. దాదాపు ఓ ఇరవై టేబిళ్ళు, టేబిల్ చుట్టూ మనుషులు, టేబిల్ మధ్యలో రంగురంగుల సీసాల్లో రంగురంగుల ద్రవాలు, ప్లేట్లలో ఏవేవో తినుబండారాలు—ఇదంతా కనీకనిపించని విధంగా ఉండే చీకటి వెలుగుల కలయిక. దూరంగా పెద్ద అలమారు. అలమారు నిండా సీసాలు. సీసాలకు ముందు, ముందు టేబిల్‌కు వెనుక మధ్య ఖాళీ స్థలంలో పని చేసుకొంటున్న ఓ ఇద్దరు మనుషులు. ఉన్న గోలకు తోడుగా కొంచెం హెచ్చు స్వరంలోనే ఏదో ఇంగ్లీషు ట్యూన్ వినిపిస్తున్న స్టీరియో సిస్టమ్.

కుముదకు అక్కడ అందర్నీ చూస్తోంటే తమాషాగా అనిపించింది—ఇందరు... ఇందరు తాగుబోతులా దేశంలో అనుకొంది క్షణంపాటు. వెంటనే తన అంచనా తప్పు అని తెలుసుకొంది. ఇది కేవలం ఈ ఒక్క బార్‌లోనే! ఇలాటి బార్‌లు వీధికి ఎన్నో—అలాటి వీధులు ఊరికెన్నో ... లెక్క పెట్టుకోవటం కష్టం. ఊహించుకోవటం తెలివి తక్కువ.

కుముద అక్కడే నిలబడి ఆలోచనల్లో పడటం గమనించాడు సుందరరావు.

"రా, లోపలికి!" అన్నాడు సుందరరావు ఎవరికీ వినిపించనంత నెమ్మదిగా.

కుముద ముందుకు నడిచింది—ఆమె ఆలోచనలు మాత్రం వెనుకటి సంగతుల్ని తోడుతున్నాయి—...ఇందరు తాగుబోతుల్నీ తలో భార్య భరిస్తోందన్న మాటే గదా! అంటే... భర్త అంటున్నట్లు ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకో నక్కర్లేదన్నమాట!!

కానీ—అలా అనుకోగలిగే సంగతి కాదు. తాగుడువల్ల ఎన్ని కష్టాలున్నాయో, నష్టాలున్నాయో తనకు ఎవరూ చెప్పనక్కర్లేదు. భర్త సంగతీ అంతే - ఆయనకు తెలీని సంగతా అది? జేబులో పక్క ఖాళీ అవుతున్న సంగతి ఎప్పటికప్పుడు పర్సు చెబుతున్నా పట్టించుకోవటం లేదంటే ... అది తెలిసి చేస్తున్న సంగతే అనేది స్పష్టం. పోనీ జేబుమీద ధ్యాస ఉండకపోవచ్చు కానీ ఆరోగ్యం సంగతేమిటి? అప్పుడప్పుడు కడుపునొప్పి అనుకోవటం, ఒక్కోరోజు తెల్లవారగానే హేంగోవర్‌తో తలనొప్పి రావటం—వీటి సంగతి ఎలా మర్చిపోవటం??

—తెలియదనుకోవటం ఆత్మ వంచన.

పట్టించుకోకపోవటం దౌర్భాగ్యం.

"కుముదా....!" అన్నాడు సుందరరావు నెమ్మదిగా.

ఆలోచనల్లోంచి తేరుకొంటూ భర్తకేసి



చూసింది.

"చెప్పు. ఏం తీసుకొంటావో?" అన్నాడు భర్త.

కుముదకు నవ్వొచ్చింది చిన్నగా నవ్వుతూ అంది—"నేను తీసుకోవటం ఏమిటి, ఏం తీసుకొంటారో మీరు నిర్ణయించుకోవాలి!"

సుందరరావు నవ్వాడు — "బార్‌కు వస్తానని ఊ సంబరపడ్డావు కదా! ఏదైనా తాగుతావేమోనని అడుగుతున్నా!"

కుముద నెమ్మదిగా అంది—"బార్‌కు వస్తానన్నది తాగటానికి కాదు. మిమ్మల్నిక్కడ అంతగా కట్టి పడేస్తున్నదేమిటో తెలుసుకొందామనే కాంక్షతో—తెలిసిందా?"

"చెప్తున్నావుగా, తెలీకుండా ఎలా ఉంటుందిలే!" అన్నాడు సుందరరావు.

"నాకు ఇక్కడ ఏమీ కనపట్టంలేదు—ఎందుకింతగా దీనికోసం పడి చచ్చిపోవటమో అర్థం కావటంలేదు. తెగతాగి ఒళ్ళంతా గుల్ల చేసుకోవటం తప్పిస్తే....!"

"కుముదా — ఇదిగో, ఈ న్యూసెన్స్ ఇక్కడా మొదలెట్టకు. బార్‌కు వచ్చి, హితోపదేశాలు చేసేటట్టయితే కుదరదని ముందే చెప్పాను!" అన్నాడు సుందరరావు.

—నిజమే, సుందరరావు ఇంటి దగ్గరే ఎన్నో చెప్పాడు. బార్‌కు రావద్దని మొదట నచ్చచెప్పబోయాడు. 'అక్కడ అందరూ

వెథవలుంటారు, నువ్వు రావద్దు' అన్నాడు. 'మరి అందరూ వెధవలుండేచోటికి మీరెందుకు?' అనడిగింది తను. సుందరరావుదగ్గర ఆ ప్రశ్నకు జవాబు లేకపోయింది. క్షణం ఊరుకొన్నాడు. అయినా ఆపే ప్రయత్నాలు మాత్రం మానుకో లేదు. 'అక్కడింకా మాంసం, అదీ తింటారు' అన్నాడు. 'సర్లెండి, మద్యం విషయంలోనే నాకు పట్టింపు లేదంటే ఇక మాంసం విషయంలో ఉంటుందా?' అనేసింది తను. 'మరి, నేను తింటూంటే పెద్దగా పట్టించుకోకూడదు - అది తింటారా? ఇది తింటారా మీరు అని ఆశ్చర్యపోకూడదు!'—'సరే, మీరెలా అంటే అలాగే!' ఒప్పుకొంది. 'చివర్న యింకో షరతు. అక్కడకొచ్చి హితోపదేశం చెయ్య కూడదు. తాగి ఆరోగ్యం పాడు చేసుకోవద్దు. డబ్బులు ఖర్చు పెట్టొద్దు అంటూ యిలాటి నీతివాక్యాలు చెప్పి నా మూడ్ పాడు చెయ్య కూడదు. సరేనా?'—దానికీ ఒప్పుకొంది.

అప్పుడు సుందరరావుకు యిక తప్పింది కాదు. ఈ వేళ అనీ, రేపనీ ఓ వారం పది రోజులు వాయిదా వేశాడు. అయినా కుముద పట్టు పట్టేసరికి ముహూర్తం ఈవేళ్టికి ఫిక్సయింది.

బేరర్ వచ్చాడు. కుముదకు సుందరరావు ఏం ఆర్డరిచ్చాడో అర్థం కాలేదు. కానీ తన కోసం టిప్స్ వస్తున్నాయని తెలిసింది. బేరర్ అటు వెళ్ళగానే మళ్ళీ సుందరరావే అడిగాడు - "పోనీ ఏదైనా సాఫ్ట్ డ్రింక్స్ తీసుకొంటావా?"

"మీ యిష్టం—" అంది కుముద.

"గుడ్—అలా అయితే కోక్ ఒకటి 'రా' గానే కొట్టేసెయ్!" అన్నాడు సుందరరావు.

"రాగానే కొడతాను. అందులో చెప్పే దేముంది!" అంది కుముద.

సుందరరావు నవ్వాడు—"రాణీ—'రా' గానే అంటే కోక్ బాటిల్ తేగానే అని కాదు. నీళ్ళు కలపకుండానే తాగేసెయ్! అని అర్థం!"

ఈసారి జోక్‌కు కుముదా నవ్వింది—అంటే భర్త తనను వేళాకోళం ఆడుతున్నా డన్నమాట! అయినా నిజంగా తానూ ఏ బ్రాందీయో, బీరో, రమ్మో తాగటానికి సిద్ధపడితే సహించగలరా వీళ్ళు? అనుకొంది కుముద.

మగవాళ్ళది మరీ చిత్రమైన మన స్తత్వం. కొన్నికొన్ని అనుభవాలు కేవలం తమకు మాత్రమే ఉండాలని పట్టుపడతారు. తాగటం, పొగ తాగటం, పరస్త్రీ అనుభవం...ఇవన్నీ పురుషులుగా వాళ్ళ ప్రత్యేక హక్కులు అని వాళ్ళ అభిప్రాయం. మగాణ్ణి దెబ్బకొట్టాలంటే యిలాటి హక్కు ఏ ఒక్కటి కోరినా చాలు—చిత్తయిపోతాడు అనుకొంది కుముద.

అయినా కుముద ఈరోజు భర్తను దెబ్బ కొట్టటానికి రాలేదు. ఆమెకు బార్ అంటే ఉండే ప్రత్యేకమైన ఆసక్తి ఆ రోజు ఆమెను అక్కడికి లాక్కొచ్చింది. తాగాలని, తినాలని కోరిక కాదది. ఆ వాతావరణాన్ని పరిశీలించా లని, ఆ వాతావరణంలో ఉండే మత్తు ఏమిటో అర్థం చేసుకోవాలని ఆమె తాపత్రయం.


తను ఆ వాతావరణాన్ని పరిశీలించాలని వచ్చింది కానీ ఆ వాతావరణమే తన్ను పరిశీలిస్తోందన్న సంగతి కుముదకు తెలీని సంగతి కాదు—గ్లాసెత్తినప్పుడు కొందరు ఓరకంట చూస్తున్నారు. చూస్తే బాగుండదేమోనన్న సంశయంతో బాధపడుతున్నారు కొందరు. మరికొందరు అలా ఏమీ కాక - ధైర్యంగా తన్నే చూస్తున్నారు, కుముదకు ఆ చూపులన్నీ తన ఒంటిని తడిమి చూస్తున్నట్లుగా తోచింది. అయినా - ఇలాటిచోట తను మరీ ముడుచుకొని కూర్చున్నా బాగుండదు అనుకొంది.

బేరర్ వచ్చి ప్లేట్లు, గ్లాసులు అవీ సర్ది సీసాలోంచి ద్రవాన్ని గ్లాసులో పోశాడు. కుముద ముందు పెట్టిన గ్లాసులో కోక్ పోశాడు.

సుందరరావు గ్లాసెత్తి 'ఛీర్స్' అన్నాడు.

కుముద నవ్వింది - 'ఛీర్స్, ఛీర్స్ కావ్వండి!' అంది.

అర్థండీ చేరండీ - గంజికొస్తా ఎక్కువైనట్టుందంతే - అర్జా



సుందరరావు చిన్నగా నవ్వి ద్రవాన్ని నోటిలోకి జార్చుకొన్నాడు. కుముదకు బాధ కలగింది. పెళ్ళయిన కొత్తరోజుల్లోనే కుముదకు భర్త తాగుతాడని తెలిసింది. తాగటం పెద్ద తప్పేమీ కాదు. మద్యమాంసాలు ఈ రోజుల్లో ఫ్యాషన్‌గానూ, స్టాటస్ సింబల్స్‌గానూ మారిపోయాయి. 'ఫ్రెండ్స్ అంతా తాగుతోంటే వద్దనటానికి వీల్లేకపోయింది' అనే వంకతోటే భర్తల తాగుడు కథలు ఆరంభమవుతాయి. సుందరరావు సంగతీ అంతే! - తనూ పెద్దగా పట్టించుకోలేదు. 'తాగదు' అని చెప్పినా పెద్ద ఫలితం ఉండదని తెలిసినపుడు ఇక ఆ పయాసా అనవసరం.

బార్ అంతా కోలాహలంగా వుంది.

—గ్లాసుల గలగలలు.

మనుషుల పతనాలు.

స్ప్రింగ్ డోర్ తెరుచుకొంది మళ్ళీ - తనకు తోడుగా ఈ బార్‌లోకి మరో స్త్రీ కూడా వచ్చింది. కుముదకు ఆశ్చర్యం కలిగింది.

"ఇంకొకళ్ళు ఎవరో వస్తున్నారండీ!" అంది కుముద, సుందరరావుతో.

సుందరరావు కళ్ల చికిలించుకొని చూశాడు - ఎవరో ఓ జంట.

"బార్ అంటే లక్షరకాల జనం వస్తుంటారు. తాగు - మన పని మనం చేసుకొనిపోవటం మంచిది" అన్నాడు సుందరరావు.

కుముద మనసులో ఎన్నో ప్రశ్నలున్నాయ్ - బార్‌కు వచ్చేవాళ్ళు సాధారణంగా అలవాటు పడ్డవాళ్ళే అయిఉంటారా? లేకపోతే అప్పుడప్పుడువచ్చేవారే ఎక్కువా? రోజూ వచ్చి ఇలా డబ్బును నీళ్ళ పాలనో, సోడా పాలనో ఖర్చుచేసి పోయేంత స్తోమత ఇక్కడ అందరికీ ఉంటుందా? - ఇలా రోజూ ఖర్చు పెట్టేస్తోంటే ఇంట్లోవాళ్ళ సంగతి ఏమిటి??—తనలాగ ఇలా వాతావరణ పరిశీలనకు అందరూ రావటానికి ఉత్సాహపడతారా?

—ఏమో!

అన్నీ ప్రశ్నలే!

తను ఈ ప్రశ్నల్లో కొన్నిటికి జవాబు ఊహించుకోగలదు. మరికొన్నిటికి జవాబు తనకే తెలుసు. ఇక కొన్నిటికి — సుందరరావుకు తెలిసినా - చెప్పడు.

అందుకే కుముద ఊర్కొంది. కానీ బార్‌లోకి వచ్చిన అమ్మాయిని కుతూహలంతో పరిశీ

త్రిస్లోనే వుంది — ఆ అమ్మాయికి ఇరవై నుంచి ముప్ఫైలోపు ఎంతైనా ఉండొచ్చు వయస్సు. మనిషి అందంగా ఉన్నట్లే లెక్క. ఎక్కడి వంపులు అక్కడ ఖచ్చితంగా వంపు తిరిగి ఉన్నాయి. ఒక్కసారి చూస్తే మరోసారి చూడాలనే కోరిక కలిగిస్తోంది. కుముదకు ఆ అమ్మాయి అంటే ఈర్ష్య కలిగింది - బాధ కలిగింది.

ఈర్ష్య - ఆ అమ్మాయి తనకన్నా 'అందం'గా ఉన్నందుకు !!

బాధ - ఆ అమ్మాయీ తనలాటి బాధనే అనుభవిస్తున్నందుకు !!—

ఉండబట్టలేక అనేసింది కుముద పైకి - "అంత మంచి అమ్మాయి ఉండగాకూడా ఇంకా ఈ వెధవ వేషాలు ఎందుకూ?"

సుందరరావు నవ్వాడు - "అంటే, తాగటం నీ లెక్కలో వెధవ్వేషం అయిందన్నమాట !!"

"ప్రపంచంలోకెల్లా బాగా మత్తెక్కించేది ఆడదే కదా! అందులోనూ అందమైన ఆడదే భార్యగా వుండగా ఇంకా ఈ బార్లూ, బీర్లూ ఎందుకు?"

సుందరరావు ఇంకొంచెం గట్టిగా నవ్వాడు - "ఆ అమ్మాయి అతని భార్య కాదు!" అన్నాడు.

కుముద, సుందరరావుకేసి జుగుప్సగా చూసి అంది, "మీకు తెలుసా? ... అయినా అందమైన ఆడదాన్ని ఏ పరాయివాడి భార్యగానో మీరెందుకు ఒప్పుకొంటారు లెండి!"

"కుముదా! - ఆ అమ్మాయి అతని భార్య కాదు. ఆ అమ్మాయి ఇక్కడ టాక్సీ!"

"టాక్సీయా? అంటే? — " అనడిగింది కుముద.

"నీకు తెలీనివి ప్రపంచంలో లక్ష ఉన్నాయి. బార్‌లోకి ఎవరైనా ఎప్పుడొస్తారు?"

"కారణాలా? బోలెడు చెప్తాను. అన్నీ మీరు చెప్పేవే - ఒకరోజు మూడ్ బాగుండక. ఇంకోరోజు జలుబుచేసి. ఇంకోరోజు ఎరియర్స్ బిల్ పాసయి. మరో రోజు ఏమీ తోచక. తర్వాతరోజు బిల్ పాసయి ..., ఒక్కోసారి తాగాలనిపించి, ఒక్కోసారి ఇకపై తాగకూడదని నిర్ణయించుకొనే ముందు సెలబ్రేట్ చేసుకొంటూ..." సుందర్రావు కుముద కాలిని నొక్కాడు, నోరు మూస్తావా అన్నట్లు.

"అవి కాదు. ఏదో మనశ్శాంతి వెతుక్కొంటూ వస్తారు."

"మనశ్శాంతి సీసాల్లో దొరకుతుందా? పాపం, మన పూర్వీకులంతా హిమాలయాల్లో పడి ముక్కుమూసుకొని కళ్ళు తెరుచుకొని క్రిందామీదా పడి దానికోసం తెగ వెతికారు. వాళ్ళకాసంగతి తెలీలేదు కాబోలు!"

"కుముదా - క్షణం వుంటే నీ జోక్కు నవ్వుతా కానీ, ఆవిడమాత్రం ఇక్కడ టాక్సీ. తాగటానికి వచ్చినపుడు కూడా కంపెనీ ఎవరైనా ఉంటేనే బాగుంటుంది ఎవరూ లేకనుకో, అపుడు మనం టాక్సీలను వెతుక్కోవచ్చు!"

"అంటే? - నాకు అర్థం కావటంలేదు!"

"పిల్ల - అమ్మాయిలు - అద్దెకు దొరుకుతారు. కేవలం కంపెనీవరకే సుమా! వీళ్ల ఒంటరిపక్షులకు తాగేందుకు తోడుంటారు. వాళ్ళ తాగుడు ఖర్చు అంతా భరిస్తే చాలు. తాగినంతసేపు కూడావుంటారు. వాళ్ళతోబాటు మనం జోక్స్ వేసుకోవచ్చు. సరదాగా మాట్లాడుకోవచ్చు. ఎటొచ్చీ అసభ్యంగా ప్రవర్తించే వీలులేదు."

"బాగుంది జోకు! - అద్దెకొచ్చే అమ్మాయితో అసభ్యప్రవర్తన పనికిరాదట! మంచి జోకే!!" అంది కుముద నవ్వేస్తూ.

"నమ్ము, నమ్మకపో - నీ ఇష్టం. కానీ నిజం అది! అయితే ఆ అమ్మాయితో మాట్లాడుకొనేటపుడు మిగతావాటికి కూడా ఒప్పందం కుదిరితే వేరు. కానీ సాధారణంగా వీళ్లు అలాటి వాటికి ఒప్పుకోరు. తాగేంతవరకే కంపెనీ - ఆ తర్వాత — ఎవరికివారే యమునాతీరే అన్నట్లు...!"

"అవును కానీ - ఇలాటి వివరాలన్నీ మీకెలా తెలుస్తాయండీ? కొంపదీసి మీరెప్పుడైనా కంపెనీతోబాటు దుకాణం పెట్టారా ఏమిటి

వాళ్లల్లోళ్ల - రావుగారా - షికారుకా - హావ్వా - ఐతే మీమూ నాలానే - ఒంటరిగా షికారు కెళ్లరన్నమాట !!



ఒప్పందం కుదుర్చుకొని?"

"ఛా, ఛా. అలాటిదేమీలేదు! - "

"నిజం?"

"నిజమే! — నీమీద ఒట్టు! - "

"సర్లెండి, ఒట్టుకూడా నామీద! అదీ తాగినపుడు! మద్యం, మాంసం - పనికి వచ్చినపుడు మూడో 'మ' - అదే మగువ ఎందుకు పనికి రాదు అని!"

సుందరరావు నవ్వాడు - "ఎందుకు పనికి రాదు అని అడక్కు! పనికివస్తుంది. కానీ కుముద వుంది కదా ఇంకెందుకా గొడవలన్నీ అని!"

కుముద నవ్వేసింది - "తాగినపుడు ఎన్ని అబద్ధాలైనా ఆడతారన్నమాట మీరు!"

"ప్రేమ్‌నగర్‌లో నాగేశ్వరరావు ఏమన్నాడో తెలుసా? - తాగినవాడు నేలమీద నిలబడడు, మాటమీదే నిలబడతాడు అని!"

"కానీండి. అన్ని అబద్ధాలలో ఇదొకటి!-"

—కుముద మనసంతా ఆ అమ్మాయిమీదే వుంది. భర్త చెప్పింది నిజమవునా కాదా అనే ఆలోచిస్తోంది. పరీక్షిస్తోంది. కానీ ఆ అమ్మాయి ప్రవర్తనలో ఎబ్బెట్టుగా ఏదీ కనపడ్డంలేదు. ఆ అమ్మాయిని టాక్సీలాగ ఊహించుకోవటానికి కుముద మనసు అంగీకరించలేదు.

"అవునూ - మీరు చెప్పారు కదా - ఇలాటి వాళ్ళని టాక్సీలంటారు అని! మరి జనం ఎక్కకూడని టాక్సీలు ఏమిటండీ బాబూ?"

సుందరరావుకు నవ్వొచ్చింది — "నిజమే సుమా! ఎక్కకూడని టాక్సీ ఏమిటి? ప్రైవేట్ కార్ అనాలి కానీ - అదీ తప్పే ... పబ్లిక్ ప్రైవేట్ కార్ ... ఉహూ - సరైన పేరు టాక్సీయే లెద్దూ! - అవునూ - తాగింది నేను కదా, నిషా నీకు ఎక్కుతోందేం?"

"నేను మీ అర్ధాంగిని కదా! అందుకేమో!" - అంది కుముద.

---సుందరావు పర్సులోంచి డబ్బు తీసి ప్లేట్‌లో పడేసి, లేచాడు.

"అమ్మయ్య, ఈ రోజుతో నీ కోరిక తీరినట్లే కదా!"

కుముద నెమ్మదిగా అంది — "బాగుంది, రామాయణం అంతా విని రాముడికి సీత ఏమవుతుందన్నట్లుగా వుంది. నా కోరిక నేను బార్‌కు

రావటం కాదు, మీరు రాకుండా వుండటం?"

"ఆ కోరిక తీరదు కుముదా!" - అన్నాడు సుందరరావు కుముదతో!

భర్తకు నిషా పూర్తిగా ఎక్కింది అనుకొంది కుముద

* * *

కుముద ఆ బార్‌కు వచ్చివెళ్ళిన వారం రోజుల తర్వాత -

- ఆ రోజే మళ్ళీ సుందరరావు ఆ బార్‌కు రావటం!

అలవాటైన ప్రాణం, అలవాటైన బార్ - అలవాటుకొద్దీ సుందరరావు తను కూర్చునే టేబుల్ దగ్గర కూర్చున్నాడు.

బేరర్ వచ్చి ఆర్డర్ తీసుకెళ్ళాడు?

అపుడే ఒక కుర్రాడు - మహా ఉంటే పాతికేళ్ళ వుంటాయేమో - వచ్చి సుందరరావు ఎదురుగా కూర్చుంటూ - "ఎక్స్యూజ్ మీ, కూర్చోవచ్చా ఇక్కడ!" అనడిగాడు.

"కూర్చోండి, నాకేం అభ్యంతరం లేదు!" అన్నాడు సుందరరావు.

అతను సెటిలవుతూ అన్నాడు: "నా పేరు వేణుగోపాల్! రైల్వే ఆడిట్‌లో పనిచేస్తున్నాను!"

"ఐసీ-" అన్నాడు సుందరరావు! తర్వాత తన వివరాలూ చెప్పాడు.

"మీరెప్పుడొస్తారా అని వారంరోజులనుంచీ చూస్తున్నాను!"

"అదేం? ఏమైనా పని వుందా?" ఆశ్చర్యంగా అడిగాడు సుందరరావు.

"పనా? .... పని అంటే పనికాదు అనుకోండి. అలా అని పనికాదు అనీ చెప్పలేం!"

సుందరరావు నవ్వాడు - అతని పద్ధతికి, ఆ తడబాటుకీ.

"ఇంతకీ అసలు సంగతి - వారం రోజుల క్రిందట మీతో ఎవరో టాక్సీ వచ్చింది కదా! ఆమె అడ్రసు కనుక్కుందామని!"

—సుందరరావు షాక్ తిన్నాడు. వారం రోజుల క్రిందట .... కుముద! - తన భార్య!!

"నాకు అలాటి ఫామిలీ టైప్స్ అంటేచాల ఇష్టం సార్! కంపెనీకి కంపెనీ బాగుంటుంది. మనకూ బాగానే వుంటుంది. పైగా ఆ పిల్ల మంచి సెక్సీగానూ వుంది - మీరు కొంచెం అడ్రస్ చెబితే....!—

సుందరరావుకు మతిపోయింది - ఎదురుగా ఎవడో తెలేని వెధవ. 'నీ భార్య మంచి సెక్సీగా వుంటుంది' అంటున్నాడు, చాచిలెంపకాయ కొట్టాలనుకున్నాడు,

కానీ - కొట్టలేదు,

తప్పతనిది కాదు - అతను తాగి వున్నాడు

తాగటమూ తప్పుకాదు, అది మనశ్శాంతిని కలిగిస్తోంది. మరి—

తప్పు ఆడదాన్ని కొనుక్కోగలమనే ధీమా అందరిలోనూ కలిగిస్తున్న వ్యవస్థది!

—సుందరరావు లేచాడు, బేరర్ యింకా ఓపెన్ చెయ్యని బాటిల్స్ టేబిల్‌మీద పెడుతోంటగానే వద్దంటూ జేబులోంచి పర్సు తీసి డబ్బు అందించాడు - "బిల్లు కట్టేసి, మిగిలింది నువ్వు ఉంచుకో!

బేరర్ వెళ్ళిపోయాక సుందరరావు వేణుగోపాల్‌కేసి చూస్తూ అన్నాడు: "మొన్న వారంరోజుల క్రిందట ఇక్కడకు వచ్చింది - నా భార్య! టాక్సీ కాదు!"


వేణుగోపాల్ ఉలిక్కిపడ్డాడు, ఏదో చెప్పాలని లేచాడు.

కానీ—

అప్పటికే సుందరరావు స్ప్రింగ్ డోర్ తీసుకొని వెళ్ళిపోయాడు బయటికి,

—వేణుగోపాల్ తర్వాత 'సారీ' చెప్పటానికి సుందరరావుకోసం ప్రతి బార్‌లోనూ వెతుకుతూనే ఉన్నాడు. కానీ వేణుగోపాల్‌కు సుందరరావు ఆ తర్వాత యెక్కడా కనపడలేదు.

—తన భర్త అంత హఠాత్తుగా తాగటం ఎందుకు మానేశాడో మాత్రం కుముదకు అంతుపట్టలేదు. తెలివైన ఆడది కాబట్టే కారణం అడిగే ప్రయత్నం చెయ్యలేదు.



దడిగా డువానగిడిఅ

బాబ్జీ

"తాజ్‌మహల్‌ను ఎవరు కట్టించారు?"
"అశోకుడు."
"మన రాష్ట్రపతి ఎవరు?"
"సంజయ్‌గాంధీ."
"చార్మినార్ ఎక్కడుంది?"
"లండన్‌లో."
"సర్వేపల్లి రాధాక్రిష్ణ ఎవరు?"
"క్రికెట్ ప్లేయరనుకుంటా?"
"మన జాతీయగీతాన్ని ఎవరు రాశారు?"
"కాళిదాసు."
"పన్నెండు పన్నెండ్లెంత?"
"నూటముప్పైరెండు."
"మనకు స్వాతంత్ర్యం ఎప్పుడొచ్చింది?"
"పందొమ్మిది వందల నలభైలో."
"మన మొదటి ప్రధాని ఎవరు?"
"గాంధీజీ."
"దిగోగార్షియా ఎక్కడుంది?"
"లింగంబోయినచర్ల దగ్గర."

"కిరణజన్య సంయోగక్రియ అంటే ఏమిటి?"
"సూర్యరశ్మితో పప్పు వండుకోవడం."
"సైకాలజీ స్పెల్లింగ్ తెలుసా?"
"ఎస్ ఐ కె ఏ ఎల్ ఏ జి ఐ."
"షేక్‌స్పియర్ నాటకం పేరొకటి చెప్పు."
"వార్ అండ్ పీస్."
"బాబీలో హీరోయిన్ ఎవరు?"
"జయమాలిని."
"ఇందిరాగాంధీ ఎవరు?"
"గాంధీ తాత మనవడు."
"నీకు కపిల్‌దేవ్ తెలుసా?"
"హిందీ సినిమా హీరో అనుకొంటా?"
"మదర్ తెరెసా ఎవరు?"
"ఇంగ్లీష్ రచయిత."
"నీలాంటి వాడికి ఉద్యోగమిస్తే దేశం బాగుపడినట్టే."
"అన్నీ కరెక్టుగా చెప్పి చంకలు కొట్టుకొన్నప్పుడు ఉద్యోగం ఇచ్చి చచ్చారుగనకనా?"
" ? ? ? "

జ్యోతి.

కావ్యానికి కవరు పేజీలు

ఎక్కడో 'దియాత్స్ఫింక్స్' పొత్తిళ్ళలో
నిద్రిస్తున్న నీవు గుర్తుకి వస్తేచాలు—
'ప్రష్యన్ బ్లూ'లో తడిసిన
కొండ శిఖరాలమీద నక్షత్రాల చమ్కీ
చల్లుకుంటూ నడిచి పోతూవుంటాను
పొగమంచులో—
శతాబ్దాలుగా నిన్ను నాలో దర్శిస్తున్నా—
నీకొక సంపూర్ణ అక్షయాకృతి ఇవ్వలేని
అసమర్థ శిల్పిని నేను.
నన్ను విడిచి నా రసాత్మ ఎవరికోసం పోయిందో
ఉత్తర, దక్షిణ ధృవాలమధ్య చలించే
నీ కళ్ళకి తెలుసు।
శిఖరాల తీరాలవైపు ఈదుకుంటూ పోయే
పక్షుల గుంపులకి తెలుసు।
ప్రతిరాత్రీ నన్ను మోసే నా రస్తాలకి తెలుసు।
తప్పిపోయిన నా ఆత్మని
ఏ గాలి తునకో తెచ్చి నాలో బిగించినపుడు
నా కలలు రంగుల కలంకారీలవుతాయి
నీ కోసం నేను లిఖించే కావ్యానికి కవరు పేజీలుగా.

—శ్రీభాష్యం శేష్‌కుమార్

అసమర్థుడి ప్రేమలేఖ

మామిళ్ళపల్లి వేణుగోపాలశర్మ

"సుమిత్రా!

నీవు ఇవ్వని చనువు తీసుకొని, 'ప్రియమైన' అనో, 'డార్లింగ్' అనో నిన్ను సంబోధించలేను. అలాగని నా మనసు కించపరచుకొనేంత గౌరవం అంటగట్టి నన్ను నేను చిన్నబుచ్చుకోలేను. అందుకే నిన్ను నిన్నుగా 'సుమిత్రా!' అనే పిలుస్తున్నాను. నిన్ను నేను ప్రేమిస్తున్నాను. కావాలనుకుంటున్నాను. ఒక యువకుడు నిన్ను ప్రేమించి కావాలనుకోవడం, ఇలా ప్రేమలేఖ వ్రాయడం నీవొక నేరంగా భావిస్తే అందుకు తగిన శిక్ష విధించు! చెయ్యి గలిగినంతా చేసేయ్!

అలా కాని పక్షంలో వచ్చే ఆదివారం సాయంత్రం ఆరుగంటలకు నౌబత్‌పహాడ్ పైకి రా! ఎడారిలాంటి నా జీవితాన్ని నందనవనం చేస్తావో లేక నన్ను పిచ్చివాడిని చేస్తావో నీ యిష్టానికే వదలుతున్నాను. నన్ను అనుగ్రహించు సుమిత్రా!

—నీ వాడు కావాలనుకునే చంద్రలాల్.

○ ○ ○

ఆదివారం సాయంత్రం - ఆరుగంటల సమయం. సాధారణంగా ఆ సమయంలో నౌబత్ పహాడ్ రకరకాల జంటలతో కన్నులపండువుగా వుంటుంది. అంత ఎత్తునుంచి చూస్తే కనిపించే నగరదృశ్యం అపూర్వం.

ఆనాడు ఆదివారమే అయినా అంత సందడి లేదు. వాతావరణంలో చలి అధికమే కాకుండా మబ్బు కూడా పట్టివుంది. నాలుగ్గంటల ప్రాంతంలో చిన్న జల్లుకూడా పడడంతో మనుషులు పది పదిహేనుమంది కంటే ఎక్కువ లేరు.

ఒక యువతి బెంచిపై కూర్చొని ఎదురుగా కనిపించే పబ్లిక్ గార్డెన్స్ చూస్తోంది. ఆకుపచ్చని చెట్లమధ్య తెల్లగా అందంగా వుంది అసెంబ్లీ హాలు. మనుషులూ, వాహనాల తాలూకు హడావుడి పైనుంచి చూస్తే అతి ప్రశాంతంగా వున్నట్లనిపిస్తోంది.

"సుమిత్రా!"

ఆమె తనను పిలిచిన వ్యక్తివైపు చూసి, "రండి! కూర్చోండి! మీ కోసమే ఎదురుచూస్తున్నాను!" అంది చిన్నగా నవ్వుతూ. "చూశారా! మీరే ఆలస్యం చేశారు!"

"నువ్వు .... రావనుకున్నాను" అంటూ ఆమెకు కాస్త ఎడంగా కూర్చున్నాడు.

"ఏం! ఎందుకలా అనుకున్నారు!"

అతను క్షణంసేపు మాట్లాడలేదు. "నువ్వు అందమైనదానివి! మంచి ఉద్యోగంలో ఉన్నావు. నువ్వు పెళ్ళాడాలనుకుంటే నన్ను మించినవారెందరో వున్నారు" నసుగుతూ నిదానంగా అన్నాడు.

"మరి ఆ ఉత్తరమెందుకు వ్రాశారు? ఈ మాట చెప్పడానికేనా?"


"కాదు సుమిత్రా! ఎంత అభాగ్యుడైనా ఒక లాటరీ టికెట్టు కొని తన అదృష్టం పరీక్షించుకోవా లనుకుంటాడు. నేను కూడా...."

అతని మాటలు పూర్తికాకుండానే ఆమె కిలకిలా నవ్వింది.

"నేను లాటరీ టికెట్టునా? అయితే నా విలువ వేలా? లక్షలా? చెప్పండి!"

అతనుకూడా నవ్వాడు. బెరుకు వదలి సర్దుకుని కూర్చున్నాడు. తడబడకుండా మాట్లాడగల ధైర్యం వచ్చినట్లుంది.

"నిజం చెప్పనా! మన సాహచర్యం ఒక్కనెల్లోనిది కాదనిపించింది. ఆత్మీయులమైన మన మధ్య అడ్డు వున్నట్లనిపించింది. అది భేదించాలని విలవిలలాడిపోయాను. ధైర్యంచేసి ఉత్తరం వ్రాసాను. తీరా నీ ఎదట పడేసరికి సూటిగా మాట్లాడలేకపోయాను. ఏమ్మి



కారణం?"

"నన్నే అడుగుతున్నారూ! బావుంది! బహుశా తొలి ప్రేమయ్యుంటుంది."

"తొలి ప్రేమా? ఒక్కొక్కళ్లు ఎన్నిమార్లు ఎందరిని ప్రేమిస్తారేమిటి?"

"ఈ రోజుల్లో కొందరికి ఇదొక హాబీ అయ్యింది. తమ కందనివాళ్ళను ప్రేమించా ననడం. బెడిసికొడితే జూనియర్ దేవదాసుల పోజు కొట్టడం—"

"సుమిత్రా! నువ్వు నాకు బుద్ధి చెప్పడానికి రాలేదు కద....?"

"ఎందుకలా ఉలిక్కిపడతారు? ఇష్టం లేక పోతే రావద్దని వ్రాశారుగా!"

"అయితే మరి...."

"నమ్మలేకపోతున్నారా?"

"అవును! నిజంగా నా అదృష్టాన్ని నమ్మలేకపోతున్నాను!"

"అది నాపై మీరేర్పరచుకొన్న అభిమానపు విలువ."

"ఎంత చక్కగా మాట్లాడతావు సుమిత్రా! నీవు నా కందడం జీవితాని కొక వరం. మనసులోని పారవశ్యం గిలిగింతలు పెడుతూంటే కవిత్వం పొంగుతూంది."

"అబ్బ! సుకర్బ! ఎవరైనా వినడంలేదు గదా! ఔట్ డోర్ షూటింగనుకొనేరు!"

"నీ ముందు తారలుకూడా..."

"చాలు మహాశయా! ఆపండి! అసలు విషయానికి వద్దామిక! మీరు నా వ్యక్తిత్వాన్ని మన్నించి, నా ఆలోచనలను గౌరవించగలరా? ఇద్దరికీ సంబంధించిన ఇంటి విషయాలతో నేను సూచించిన ప్లాను ప్రకారం నడువగలరా?"

"నిరభ్యంతరంగా. నన్ను బాగా పరిశీలించు సుమిత్రా! తొందరేమీలేదు. బాగా అర్థం చేసుకున్నాకే పెండ్లాడుదాం."

"మీకు తొందరలేకున్నా నాకుంది సార్! పరిశీలనలూ - అర్థం చేసుకోడం అంటూ కొన్నాళ్ళపాటు మీతో విహరించలేను. అంత ఓపికా-తీరికా లేవు. నేను స్ట్రెయిట్ ఫార్వర్డ్! టూ ఫ్రాంక్. ఆఫీసులో చూస్తున్నారుగా! ఇప్పుడిక్కడ ఆఫీసువ్యక్తు లెవరు చూసినా నేనొక ప్రేమ వ్యవహారం నడుపుతున్నా ననుకోరు. మీరు చెప్పినా నమ్మరు. అందుక్కారణం నా సిన్సియారిటీ! నాకు గల ఆత్మవిశ్వాసం. అవతలివారికి నాపై గల నమ్మకం. నేనేది చేసినా తెలితక్కువగా చేయననే నమ్మకం నాపై నాకుండాలి. అప్పుడే తలెత్తుకు తిరగగలను. ఏమంటారు?"

"నీ సాహచర్యంలో నా విలువా - గౌరవం పెరుగుతాయంటాను. నిన్ను నే నెప్పుడూ గౌరవిస్తాను. అది నన్ను నేను గౌరవించుకున్నట్లుగా భావిస్తాను."

"గుడ్! మీరు నాకు నచ్చారు! కానీ...ఇది ప్రేమ-నిషా కాదు గదా?"

"అబ్బ! సుమిత్రా! నిన్నెలా నమ్మించను?"

"నమ్మించింది చాలు! నాపై మీకేర్పడిన ప్రేమనూ, నమ్మకాన్నీ సడలకుండా చూసుకోండి! నేను మిమ్మల్ని నడిపిస్తాను, సుఖపెడతాను..."

"సుమిత్రా!!" ఆనందంతో తల మునకలయ్యాడతను.

○ ○ ○

సరిగ్గా తొమ్మిది గంటలకు వచ్చిన జగన్నాథం, ఆఫీసుకి తనకన్నా ముందు వచ్చి కూర్చున్నవారందరివంకా ఒక్కసారి చూశాడు. అందరిలోనూ ఓ మాదిరి కుతూహలం పెరిగింది. అందరూ అతనివేపు మ్యాజిక్ చేసే మెస్మరిస్టును చూసినట్లు చూడసాగారు.


"మీ కందరికీ ఓ శుభవార్త!" అన్నాడతను.

"ఏమిటది?" కొన్ని కంఠాల ఆర్తనాదం!

"ఊరికే చెప్పదలచుకోలేదు. తలకొక పాతిక పైసల రుసుం మాత్రమే!"

"అయితే దాచుకో." రత్నం విసురుగా అనేశాడు.

"ఓ యస్! దాచుకుంటాను. కానీ విషయం సుమిత్రా స్వయంవరాన్ని గురించి! నిమిషానికో పైస చొప్పున రేటు పెరుగుతుంది. ఆ తర్వాత



మీ యిష్టం!"

క్షణాల్లో అందరిలోనూ 'థ్రిల్' పెరిగింది. అందరికన్న ముందు రత్నం వెళ్ళి జగన్నాథం టేబుల్‌మీద పావలాబిళ్ళ పడేసి తిరిగి అందరికేసీ చూశాడు. జగన్నాథం టేబుల్‌పై మూడు రూపాయల చిల్లర పేరుకుంది. అవి తాపీగా జేబులో వేసుకుని జగన్నాథం అందరివంక సమదృష్టితో చూస్తూ అన్నాడు.

"సుమిత్ర వివాహం నిశ్చయమైంది;"

"ఆ!" "వరుడెవరు?" "పెళ్లెప్పుడు?" "ఇది నిజమై వుండదు!" ఒక్కొక్క పావలా తాలూకు ఒక్కొక్క ఆక్రోశం.

"వివరాలకు మరో పాతిక పైసలు!"

"బాబ్బాబు! జగన్నాథం! టిఫిన్‌కోసం తెచ్చుకొన్నది మొత్తం వసూలుచేసి మా కడుపు కొట్టకు నాయనా!" అన్నాడు భాస్కర్రావు.

"డియర్ భాస్కర్రావ్! కాఫీ టిఫిన్ కావాలంటే అరువైనా దొరుకుతుంది. కానీ విషయంలో 'సస్పెన్సు' చస్తే మళ్లీ దొరకదు. పోనీ పావలా వద్దు. పదిపైసలు చాలు. అన్ని వివరాలూ చెబుతాను. బాస్ వచ్చాడంటే ఫినిష్. సుమిత్రగానీ వస్తే నేను నోరుతెరిచే వీలుండదు" అన్నాడు జగన్నాథం 'త్వరగా తేల్చుకోమన్నట్లు' చూస్తూ! తప్పదన్నట్లుగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ తలా పది పైసలు యిచ్చుకున్నారు.

"ఇదిగో చూదండి! ఈ ఉత్తరం నాకు సుమిత్ర టేబుల్ క్రింద దొరికింది. ఏమిటోనని తీసి చూద్దును గద! ప్రేమలేఖ! అయినా నమ్మలేక చంద్రరావు సుమిత్రను రమ్మని వ్రాసిన చోటికి వెళ్లాను. ఇద్దరూ కలుసుకున్నారు. కబుర్లాడుకున్నారు. మీకు ఈ మసాలా అందించాలన్న కుతూహలంతో నేను జేమ్సుబాండ్ 007 కన్నా కష్టపడ్డాను." అంటూ వివరంగా చెప్పేశాడు జగన్నాథం.

"సుమిత్ర చంద్రరావుని పెళ్ళాడుతుందా?"

"రామచంద్రా!"

"జగన్నాథం! నీవు వేళాకోళమాడడంలేదు కదా!" ఇంకా ఆశ చావలేదు.

"అక్షరాలా నిజం! కొద్దిరోజుల్లోనే వాళ్ళు తమ వివాహానికి మనల్ని ఆహ్వానిస్తారు. ఇది అబద్ధమైతే ఇంతకు రెట్టింపు యిచ్చుకుంటాను. నిన్న రామకృష్ణా థియేటర్లో వాళ్ళిద్దర్నీ యీ కళ్ళతో చూశాను" అన్నాడు జగన్నాథం.

"కోతి మొహం వెధవ! వాడెక్కడ దొరి కాడు అన్నాడు, తను హీరో కావలసినవాడిననీ, అదృష్టం వక్రించి ఈ ఆఫీసులో పడ్డాననీ, ఏనాటికైనా తను జీవితంలో వెలిగిపోతాననీ ఆశలు పెంచుకుంటున్న భాస్కర్రావ్.

"ఆ ఉసూరుమియ్యా ఏ ధైర్యంతో వప్పుకున్నా డసలు" రత్నం ఉవాచ.. అతను స్పోర్ట్స్‌మన్. కండబలం వున్న తమిళ సోదరుడు. అతని ప్రక్కన నిలబెడితే దిష్టి బొమ్మలా వుంటాడు చంద్రలావు.

మొత్తంమీద అందరి హృదయాలూ బరువెక్కాయి. ఎవరికి వాళ్ళు తమ స్వంత ఆస్తి ఏదో నష్టమైపోయిన ఫీలింగు పెట్టారు.

మరో పావుగంటలో వచ్చింది సుమిత్ర. అందర్నీ పేరు పేరునా పలకరించి 'గుడ్ మార్నింగ్' చెప్పింది.

"హల్లో జగన్నాథంగారూ! ఎలా వుంది సినిమా? చంద్రలావుగారి నడిగితే ఇంగ్లీషు సినిమా తన కర్థం కాదన్నారు. చిన్నబుచ్చుకోటం నా వంతయింది" అన్నది.

ఆ మాటతో అందరికీ పూర్తిగా సందేహం తీరిపోయింది.

"నిజమే! చంద్రలావుకి అంతగా ఇంగ్లీషు రాదు. ఆ[illegible] అప్పుడప్పుడు యిబ్బంది పడుతుంటా[illegible] అన్నాడు జగన్నాథం.

"మీరు [illegible] సుమిత్రగారూ!" భాస్కర్రావు.

"తప్పుతుం[illegible]! ఆయన కింగ్లీషు రాకుంటే నాకు డామ్ ఇన్సల్ట్!"

"సుమిత్ర గారూ... నేనొక విషయం విన్నాను... నిజమేనా?" రత్నం అడిగాడు.

"నా పెళ్ళి గురించే అయితే యూఆర్ కరక్ట్! అసలు కార్డ్సు ప్రింటయ్యేదాకా ఎవరికీ చెప్పకూడదనుకున్నాను. నేను చంద్రలావు గారిని పెళ్ళాడబోతున్నాను.

"బాగా ఆలోచించుకున్నారుగా! పెళ్ళంటే వెయ్యేళ్ళ పంట!"

"నిజమే విశ్వేశ్వర్రావుగారూ! అందుకే బాగా ఆలోచించే నిర్ణయించుకున్నాను. నా పెళ్ళిని మీరంతా ఆమోదించి హృదయపూర్వకంగా ఆశీర్వదించాలి!"

"సర్టెన్లీ! ష్యూర్! తప్పకుండా!" అనక తప్పలేదెవరికీ.

ఇంతలో మెల్లగా చంద్రలావు వచ్చాడు. అంతా చంద్రలావుని చుట్టుముట్టారు. అభినందనలు వరుసగా ప్రారంభమయ్యాయి.

"అదృష్టవంతుడివోయ్!" "కంగ్రాచ్యులేషన్స్!" "లక్కీఛాన్సు కొట్టేశావ్!"

చంద్రలావు ముందు కంగారుపడి సుమిత్ర తన వంక నవ్వుతూ చూస్తూ కనిపించేసరికి నిలదొక్కుకొని "థాంక్స్!" అన్నాడు.

"అవి చాలవు మిత్రమా! పార్టీ ఇవ్వాలి."

"అదంతా ఆమె యిష్టం!"

"బిపోయ్యాడు. మనవాడు ఆమె వాడయ్యాడు. అప్పుడే గీచిన గీటు దాటలేని వాడయ్యాడు!"


"అసలు అటువండా వుండాల్సిందిప్పుడే నోయ్!"

"తర్వాత అవసరం లేదా?"

"ఎందుకు లేదు? కాని ఆ గీటు దాటినప్పుడల్లా పెనాల్టీగా ఏదో నజరానా సమర్పించుకోవాలి" అందరూ నవ్వుకున్నారు.

ం ం ం

లంచ్ అవర్ దాకా ఈ విషయం నిద్రపోయింది. లంచ్ టైం కాగానే పీడకల నుండి వులిక్కిపడ్డట్లు హఠాత్తుగా మేల్కొనింది. సుమిత్రా చంద్రలావులు జంటగా బయటికెళ్ళారు. అరగంట తర్వాత తిరిగి వచ్చేసరికి స్టాఫ్ అంతా ఒకచోట చేరి చర్చించుకుంటు



మా ఆవెడ త్వరగా కొంపజేరమంది- నేవాకౌట్ జేయడం తప్పనిసరి గురుడా!!

న్నారు. వీళ్ళను చూసి అంతా బుద్ధిమంతుల్లా ఎవరి సీట్లల్లో వాళ్ళు కూర్చున్నారు. సుమిత్ర తనలో తాను నవ్వుకుంది. టైప్ మిషన్ ముందు వెళ్ళి కూర్చోబోతూ వుండగా హెడ్ క్లర్కు శ్రీనివాసులుగారు ఆమెను పిలిచారు.

"అమ్మాయ్ సుమిత్రా! ఒక్క మాట!"

ఆమె లేచి వెళ్ళింది.

"ఏమిటి సార్?"

ఆయన చిన్నగా నవ్వుతూ ప్రారంభించారు, "చూడమ్మాయ్! మాకు తెలిసిన ఉద్యోగస్తురాలు పెళ్ళాడబోతూంది. ప్రజంటేషన్గా ఏమిస్తే బాగుంటుంది?"

"ఏమిచ్చినా బాగానే వుంటుంది. నిండు మనసుతో వెళ్ళి ఆశీర్వదించినా సంతోషిస్తుంది."

"సంతోషానికేంలే! ఆఫీసులో వాళ్ళంతా తెగక తలలు బద్దలు కొట్టుకుంటున్నారనుకో!"

"పాపం! నిజంగా అంత యివ్వాలనివుంటే ఒక గ్యాస్ స్టవ్వో, కుక్కర్లో యివ్వండి.. తూగ గలిగితే రెండూ యివ్వండి. ఉద్యోగం చేస్తుండటున్నారు గదా? పెందలాడే వంటా వడ్డనా తెముల్చుకొని బయటపడే అవకాశముంటుంది."

"గుడ్ అయిడియా! కుక్కర్ పరవాలేదు గానీ గ్యాస్‌స్టౌ మాత్రం ముందుగా బుక్ చెయ్యాల్సుంటుంది అబ్బాయిలూ!"

"ఎవరికి చెబుతున్నారు సార్?"

"బహుమతి యివ్వాలనుకునే వారికి- సుమిత్రా! ఇంతకూ నేను విన్నది....నిజమేనా? లేక వీళ్ళందర్నీ ఫూల్స్ చేయాలనుకున్నావా?"

ఆమె నవ్వి "ఏం విన్నారు!" అంది.

"నీ పెళ్ళి సంగతి."

"నిజమే నండి నేనూ చంద్రలావు గారూ పెళ్ళి చేసుకోబోతున్నాం."

ఇంతలో చంద్రలావూ, సుమిత్రలకు ఆఫీసరు గార్నుంచి పిలుపు వచ్చింది. తన పెళ్ళి వార్తతో ఆఫీసు వాతావరణమంతా ఏదో విడ్డూరం జరగబోతున్నట్లు ఆశ్చర్యాంబుధిలో మునగడం సుమిత్ర గమనిస్తూనే వుంది.

ఇద్దరూ వెళ్ళి నమస్కరించగానే కుర్చీలు చూపించారు ఆఫీసరుగారు.

"ఫరవాలేదండీ" అని వారన్నా వినలేదు. తప్పనిసరిగా కూర్చున్నారు. తను తెప్పించుకున్న స్పెషల్ కాఫీ ఇద్దరికీ సర్వ్ చేశారు స్వయంగా.

"మిమ్మల్ని పిలిపించింది ఆఫీసు విషయంలో

కాదు!"

ఇద్దరూ ముఖాలు చూసుకొని తర్వాత ఆయనగారి వైపు చూశారు.

"నేను విన్నది నిజమే అయితే మిమ్మల్ని అభినందించడం తొందరపాటు కాదనుకుంటాను" ఆఫీసరుగారి ఉపోద్ఘాతంతో విషయం పూర్తిగా అర్థమయింది.

"నిజమే సార్!" "థాంక్యూ సర్!" సుమిత్రా, చంద్రరావు లొక్కమారే అన్నారు.

సుమిత్ర భర్తగా తన కంతకంతకూ విలువ పెరగడం గమనిస్తూనే వున్నాడు చంద్రరావు. ఆనందం పెరగడంతో పాటు వ్యక్తిత్వంలో ఏదో వెలితి కూడా పొడుతూంది. లోగడ తనను నిర్లక్ష్యంగా అందరికన్నా చివరిమెట్టుపై నిలబడిన వాడ్ని చూసినట్లు చూసేవాళ్ళు—ఆ వెధవలు—ఉన్నట్టుండి తనను హీరోగా చూస్తున్నారు. మామూలు హీరో కాదు. ఈ వెధవలు, ఈ నల్లులు, ఈ దోమలు...అని మండి పడబోయి యెదురుగా వున్న ఆఫీసరుగారిని చూసి తమాయించుకున్నాడు.

"సుమిత్రా నిన్ను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను!" అని "చంద్రరావ్! సుమిత్ర నిన్నంగీకరించిందంటే యెవరిలోనూ కనిపించని ఒక ప్రత్యేక తాను నీలో గుర్తించిందన్న మాట!" అన్నాడు.

చంద్రరావు లోపల యేమనుకున్నాడో గానీ ఒక చిరునవ్వు బదులిచ్చి వూరుకున్నాడు.

"కానీ ఒక్క మాట! సుమిత్ర నాకు ఐదారు సంవత్సరాలుగా బాగా తెలుసు. చాలా అభిమాన వంతురాలు పట్టుదల గలది. బంధువుల ఇంట్లో పెరిగి రకరకాల మనస్తత్వాలనూ, పరిస్థితులనూ యెదుర్కొని చాలా అనుభవాన్ని జీర్ణించుకొంది, టైపిస్టుగానే పని చేస్తూ, ఈవెనింగ్ కాలేజీలో బి. ఏ. పూర్తి చేయబోతూంది. అందుకే ఆమెపై నాకు తండ్రిలాటి అభిమానముంది. నువ్వామెను అర్థం చేసుకొని ప్రవర్తించి ఆమె నీలో వూహిస్తున్న ప్రత్యేకతను ఋజువు చేసుకోవాలి. ఇలా చెప్పినందుకు యేమీ అనుకోకు. నాకు రేపో, ఎల్లుండో ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ రాబోతున్నాయి. అందుకే చెప్పాలనుకున్నది చెప్పేశాను."

"మా పెళ్ళివరకూ వుండరా సార్!" సుమిత్ర అభిమానంతో అడిగింది.

"చెప్పలేను!"

చంద్రరావుకు ముఖమంతా చెమట పట్టింది.

"సో! యంగ్ కపుల్! విష్‌యూ ఏ హేపీ మ్యారీడ్ లైఫ్ ఇన్ అడ్వాన్స్!" అన్నాడు.

"థాంక్యూ సర్!" ఇద్దరూ ఒకేసారి అన్నారు. ఉత్సాహంగా బయటకు నడిచారు.

ం ం ం

తనలోని అందమూ, ఆకర్షణా, పురుషుల నెలా వెర్రెత్తిస్తాయో యెరుగనిది కాదు సుమిత్ర. తనతో మాట్లాడాలనీ, స్నేహాన్నీ, చనువునూ పెంపొందించుకోవాలనీ ఎందరు ఎంతగా ప్రయత్నిస్తున్నారో కూడా తెలుసు! కానీ ఎవరూ సాహసించి తనను సమీపించలేక పోయారు. అది తనకు గర్వకారణమే అయినా రానురానూ కొంత చింతను కూడా రేపింది. ఏమిటిది? చేయి తగిలితేనే పారవశ్యంతో తల క్రిందులైపోయే ఈ యువకులెవ్వరూ తన్ను కావాలనుకోరేం? తన జీవితంతో పాలు పంచుకుందా మనుకోరేం? పురుషులను పిరికివారిని చేసేటంత 'విపరీత శక్తి' తనలో లేదుగద?

ఆమె ఇలా ఆలోచించి మథనపడే సమయంలో చంద్రరావు వ్రాసిన ప్రేమలేఖ వచ్చింది. ఆ లేఖలో నిజంగానే అతని మంచి మనసు కనిపించింది. నిజంగా చంద్రరావు అందగాడు కాడు. ఎవరితోనూ, ఏ ప్రమేయమూ లేనట్లు ప్రత్యేకంగా వుంటాడు. అది పిరికితనమో—అవతలివారిపట్ల తృణీకారమో అర్థంకాదు. ఆఫీసులో యీనాటివరకూ సుమిత్ర విషయం కూడా అందరిలా పట్టించుకోనిది ఒక్క చంద్రరావే!

అతనికీ, అతను వ్రాసిన ఉత్తరానికీ ఆమె

అంత ప్రత్యేకత యివ్వడానికి అదికూడా ఒక కారణం. తను చంద్రరావుని పెళ్ళాడడం యింత అద్భుతంగా పరిణమిస్తుందని కలలో కూడా అనుకోలేదు.

ం ం ం

చంద్రరావుకు గంగ వెర్రులెత్తినట్లుంది. అందరూ తనను ప్రత్యేకంగా జూకు వచ్చిన కొత్త మృగాన్ని చూసినట్లు చూస్తున్నారు. ముఖ్యంగా ఆఫీసరుగారు సుమిత్రను అభినందించిన తీరు "చంద్రరావు, నీ ప్రక్కన నిలబడడానికి కూడా తగడు" అన్నట్లుంది.

సుమిత్ర మాత్రం చాలా అసాధారణ స్త్రీగా తనతో వ్యవహరిస్తూంది. ఏవేవో చెబుతుంది. మొన్నొకమారు "మనమొక పదివేలు కూడబెట్టేదాకా పిల్లల్ని కనకూడదు" అంది. "ఒకరి జీతమే వాడుకోవాలి! రెండవవారిది నిలువ చేయాలి" "ఊరికే దుబారా చేయకూడదు. చాలా పొదుపు చేయాలి!" ఇలా ఇంకేవేవో అంది. అతనికి విసుగెత్తింది. ఏమిటీమె! సరదాగా బయటికి వచ్చినప్పుడు ఇంకే విషయాలూ మాట్లాడకుండా ఒకటే నస! పెళ్ళ ముగ్గురు పిల్లల తల్లిలా మాట్లాడుతుంది. ఏ మాట మాట్లాడినా దానికి వెనకాల డబ్బుకు సంబంధించిన లంకె వుంటుంది. దానితో అతని 'మూడ్' చెడిపోతుంది కొంపతీసి ఆమెవ్యక్తిత్వాన్ని నిరూపించుకోడానికి తన వ్యక్తిత్వాన్ని మరుగున పడవేయదు కదా?

ం ం ం

ఆఫీసరుగారి బదిలీ సందర్భంలో స్టాఫంతా ఆయనకు 'తాజ్‌మహల్' హోటల్లో చక్కటి విందు చేశారు. ఆయనగారు రేపే మరో వూళ్ళో జాయినవ్వాలి. అప్పుడే తన కుటుంబాన్నంతా ఆ వూరికి పంపించారు.

విందు దివ్యంగా జరిగింది. ఆఫీసరు వెంకటేశంగారూ, శ్రీనివాసులుగారు, సుమిత్రా, చంద్రరావులు వరుసగా కూర్చున్నారు. బల్లలు మధ్యన పేర్చి చుట్టూ కుర్చీలు వేశారు. 'బట్లర్సు' అతి వినయంగా సర్వ్ చేస్తున్నారు.

విందు పూర్తవగానే ఆఫీసరుగారు కాస్సేపు ప్రసంగించారు. వచ్చే కొత్త ఆఫీసరుగారు నవయువకుడనీ, విదేశాలుకూడా వెళ్ళివచ్చారనీ చెబుతూ ఆఫీసు విషయాల్లో శ్రద్ధచూపించి ఆయనకు సహకరించమన్నారు. చివర్లో కాబోయే దంపతులను ఆశీర్వదిస్తూ చంద్రరావు అదృష్టాన్ని మరోమారు పొగిడారు. ఇద్దరినీ అభినందించారు.

స్టాఫ్ ఒక్కొక్కరు శెలవు తీసికొని వెళ్ళిపోయాక శ్రీనివాసులుగారినీ, సుమిత్రా, చంద్రరావునీ తన యింటికి తీసికెళ్ళారు ఆఫీసరుగారు. 'లాన్' లో కుర్చీలు వేయించారు. హోదాలు మరచిపోయి కలివిడిగా కబుర్లల్లో పడ్డారు.

"వివాహం క్లుప్తంగా జరగాలి" అంది సుమిత్ర.

"ఆ! అంతే తిరుపతి వెళ్ళిరావడం!—రాగానే సత్యనారాయణ వ్రతం" అంటూన్న చంద్రరావు మాటలు పూర్తికాక మునుపే సుమిత్ర అందుకుంది.

"ఎందుకూ! దేవుడికెక్కడనుండే మనస్ఫూర్తిగా నమస్కారం చేస్తే పోలా? అనవసరమైన దుబారా ఎందుకూ! సత్యనారాయణ వ్రతం కూడా దండుగే—నాకు మానవశక్తి మీదే యెక్కువ విశ్వాసం. ఈ ప్రపంచంలో ప్రతిదీ దైవసృష్టే అయినప్పుడు ఆయనది ఆయనకు యివ్వడమే అవుతుంది కదా? అందుకే హృదయపూర్వకంగా సమర్పించే ఒక్క నమస్కారాన్నే అన్నింటినీ మించిన వ్రతంగా భావిస్తాను నేను!"

చంద్రరావుకేమీ నచ్చలేదు. మిగిలిన ఇద్దరూ "బాగా చెప్పావమ్మా!" అని ఒకరూ, "ఎక్సలెంట్ థాట్" అని మరొకరూ పొగిడారు.

సుమిత్ర కళ్ళలో గర్వంతో కూడిన మెరుపు మెరిసింది.

"పెళ్ళికూడా రిజిస్ట్రరాఫీసులో పది

రూపాయల లోపుగా జరిగితే మంచిది." అన్నది సుమిత్ర.

"పురోహితుడుకూడా లేకుండా...!" నసిగాడు చంద్రరావు.

"మీరు అన్నిట్లో నన్ను వ్యతిరేకిస్తున్నారు" అన్నట్లు నిష్ఠూరంగా చూసిందామె.

"పోనీ అమ్మాయ్! పెళ్లికొడుకైనా, పెళ్లివారైనా అతనొకడేగా!" శ్రీనివాసులుగారు.

"అంతే! అంతే!" వెంకటేశంగారి సమర్థింపు.

చంద్రరావుకు సుమిత్ర ఒక బుర్రకథ చెబుతున్నట్లు మిగిలిన యిద్దరూ 'తందాన తాన' అంటూ వంత పాడుతున్నట్లు తోచింది. అతని అంతర్యంలో యిదమిద్ధమని చెప్పలేని ఒక నైరాశ్యం తలెత్తింది.

ο ο ο

కొత్త ఆఫీసరుగారి రాకవల్ల ఆఫీసులో కొత్త వాతావరణం నెలకొంది. మెల్లగా నడుస్తున్న రైలుబండి స్పీడ్ అందుకున్నట్లయింది. ఆయన గారిపూర్తిపేరేమిటోగానీ యస్ యస్. మిత్ర ఆనే పేరుతో వ్యవహరిస్తున్నారు. నవయువకుడు. అందంలో ఆరోగ్యంతో మిసమిసలాడుతూ వున్నాడు. ఏమయితేనేం ఆయనగారి ఉనికితో ఆఫీసుకి కొత్త హంగు వచ్చిందని ఒప్పుకోక తప్పదు.

వచ్చిననాడే స్టాఫ్ అందరికీపంక్చ్యువాలిటీని పాటించమని చాలా స్ట్రిక్టు ఆర్డర్స్ యిచ్చారు. బల్లలు, కుర్చీలు అలాకాదు యిలా అంటూ కొత్తవరుసలో మార్పించారు. ఆ మార్పుల్లో ముఖ్యమైనది సుమిత్ర సీటూ మిగనూ ఆఫీసరుగారి ఎయిర్ కండిషన్ గదిలోకి మారడం. రెండువారాలు దాటకుండానే మిస్టర్ మిత్ర సుమిత్రకు పనితనంలోను, పంక్చ్యువాలిటీలోను విధేయతలోనూ "ఏ" రాంక్ యిచ్చి వేశారు. సుమిత్ర ఆయనకు నచ్చింది లంచ్ వర్‌లో కేకుతో కాఫీటిఫిన్లు ఆఫీసరుగారితోపాటు వచ్చేవి.

మిత్రగారు దేశదేశాల వింతలూ, విశేషాలు వినసొంపుగా సుమిత్రకు చెప్పేవారు. అక్కడి జనులవేషధారణ, ఆహారవ్యవహారాలూ, సోషల్ మూవింగ్, నైట్‌క్లబ్బులూ వగైరావిశేషాలు భావావేశంతో వివరిస్తుంటే ఆమెకెంతయినానవ్వు వచ్చేది. ఎంతనిగ్రహించుకొన్నా కొంతయినా బయటపడేది.

"ఆపకు! హాయిగా నవ్వేసెయ్! పొంగి పొరలే ఆనందాన్ని నిరోధించాలనుంటే జీవితంలో ఉత్సాహాన్ని చంపేశావన్నమాటే!" అనేవాడు మిత్రా.

నెల తిరక్కుండా ఇద్దరిమధ్యామంచి స్నేహ మేర్పడింది. అయితే ఒక కొత్త చిక్కువచ్చి పడింది' ఆఫీసరు గదిలోకి వెళ్ళే తలుపుకులద్దం వుంది, శబ్దం వినిపించదుకానీ లోపలి దృశ్యం కనిపిస్తుంది. ఆ నిశ్శబ్ద దృశ్యాలకు బయటివారు కొత్త రూపకల్పన చేసి ఒకకావ్యం అల్లేశారు.


ο ο ο ο

సుమిత్ర ఎదురుగా ఎవర్నూ ఏమీ అనలేదు గానీ, చంద్రరావు పరిస్థితి మాత్రం చాలా జాలి పడేలా మారిపోయింది. అతన్నికూడాయెవరూ యేమీ అనరు. కానీగుసగుసలు. అతనురాగానే ఆపేయడం-అతన్ని సానుభూతి పూర్వకంగానే హేళనగానో చూడడం!- అయ్యోపాపం! అనే భావం ముఖాల్లో చూపడం. దీనివల్ల అతనికి పిచ్చిఎత్తినట్లయింది.

ఆఫీసులో అల్లిన "కావ్యం" అతని చెవిదాగా వచ్చింది. ఆఫీసరు గది తలుపులోంచీ కనబడే దృశ్యానికి అతనూ ఒక ప్రేక్షకుడే! సుమిత్రను ముఖాముఖీ అడిగి తెలుసుకోలేడు. ఊరుకునే విషయం అంతకన్నాకాదు. తమ వివాహం నిశ్చయమైంది గనుక తప్పకుండా తేల్చుకోవాలి.

ο ο ο ο

పొగమేఘాలు సృష్టిస్తూ మిత్రగారుసుమిత్ర టేబుల్‌చుట్టూ ఒక ప్రదక్షిణం చేశారు "చూడు సుమిత్రా! ఆ కాగితాల్లో నేను డిక్టేట్ చేసింది కాకుండా అదనంగా కొంతచేర్చాలి" అంటూ



ఆమె భుజం మీదుగా వంగి టైప్ చేసే కాగితాలవంక చూడసాగాడు.

"ఫారిన్‌సెంటు" వాసన మత్తుగా తాకింది "సార్! ఏమన్నా సజెషన్స్ ఇవ్వాలంటే నేనే మీటేబుల్ దగ్గరకు వచ్చేదాన్నిగా! మీకెందుకు శ్రమ? "అంటూ సీట్‌లోంచి లేచిందామె.

"నామూడ్ చెదిరిపోయింది" అంటూ నిట్టూర్చాడు మిత్రా.

ఆమె ఆయన వంక చూసింది. 'ఏమిటీ బుద్ధి! హాయిగా పెళ్ళి చేసుకోగూడదూ! ఆవేశం పట్టలేని యవ్వనాన్ని బజార్ల పాలుచేసి పిప్పి అయిన చెరకులాంటి ముది వయస్సులో గృహలక్ష్మిని గాలిస్తారు వీళ్ళు!. ఆ తరువాత పంచవర్ష ప్రణాళిక దాటీ దాటకుండానే హార్ట్ ఎటాక్స్,మధుమేహాలూ,డాక్టర్లూ-మందులూ."

"ఏమిటాలోచిస్తున్నావ్?"

ఆమె మాట్లాడలేదు. ఆయన కళ్ళలోని కాంక్షను, ప్రవర్తనలోని కంగారును చూస్తే నవ్వు వచ్చింది. మిత్రాగారు నవ్వుకు లైసెన్సు ఏనాడో ఇచ్చేశారు గనుక ఫక్కున నవ్వేసింది. ఇద్దరిమధ్యా యేర్పడిన స్నేహమూ, చొరవా మూలంగా అంతస్తూ, భయమూ మొదలైనవి కలుగకపోగా ఆయన్ను మంచితనంతోనే దారికి తేవచ్చుననుకొంది.

సుమిత్ర నవ్వుచూసి మిత్రాగారు కాస్త చొరవ చేశారు. తన వేడి శ్వాసను ఆమె మెడకు తగిలేలా వెనుకగా వచ్చి నిలబడి "సుమిత్రా!" అని పిలిచారు.

ఆమె ఆయన్ని చూసి కొంత ఆశ్చర్యం

అరువు తెచ్చుకొని "ఏమిటి సార్! ఎందుకలా అవుతున్నారు మీరు? డాక్టరు కెవరికయినా ఫోన్ చేసేదా?" అంది.

మిత్రా నెమ్మదిగా అన్నాడు "ఈ క్షణంలో నువ్వే నా డాక్టరువు."

"ఆ మరుక్షణంలో — నేనెవరు?" ఆమె మాటలతో పూర్తిగా చలించిపోయాడు.

"నువ్వు నా దేవతవు! ఏ క్షణంలోనయినా నేను ఆరాధిస్తాను. అసలు నేనింతకాలమూ నీలాంటి యువతికోసమే గాలిస్తూ వివాహాన్ని వాయిదా వేస్తూ వచ్చాను. నువ్వు ఒప్పుకుంటే...."

"కానీ సార్! నా వివాహం నిశ్చయమైంది. చంద్రలావుగారిని చూశారుగా! ఆయనే నా కాబోయే భర్త!"

"విన్నాను. విని భరించలేకపోయాను. అతను నిన్ను భరించలేడు."

ఆమె రోషంతో "ఏ ఆధారంతో మీరీ జోస్యం చెబుతున్నారు?" అన్నది.

"ముఖం చూస్తూనే అతని మనస్తత్వం తెలుసుకున్నాను."

సుమిత్ర ఏదో అనబోయింది. ఇంతలో డోర్ చప్పుడయింది. అద్దం అవతలినుంచి చంద్రలావు ముఖం కనిపించింది. లోపల దృశ్యాన్ని చూశాడో ఏమో ఆఫీసరు అనుమతితో ప్రమేయం లేకుండానే సాహసించి లోనికి వచ్చేశాడు. సుమిత్ర తన సీటులో కూర్చుంది. మిత్రాగారు సిగరెట్ 'అష్ట్రే'లో పడేశారు. చంద్రలావు ఆఫీసరుతో తన పని ముగించుకొని సుమిత్రకేసి అదోలా చూస్తూ నెమ్మదిగా వెళ్ళిపోయాడు.

సందర్భాన్ని మార్చే ఉద్దేశంతో సుమిత్ర టైపుచేసిన కాగితాలను రిఫర్ చేసుకోసాగింది.

"నేను కనిపెట్టాను" మిత్రాగారు హఠాత్తుగా అన్నారు.

"ఏం కనిపెట్టారు?"

"అతను ఒట్టి అనుమానపు మనిషి! ఆ చూపు చూశావా! నీవు నమ్మలేకపోతే అతను నిన్ను కలుసుకున్నప్పుడు ఈ సంఘటనకి ఎలాంటి కలరిస్తాడో చూడు! దాన్నిబట్టి నువ్వే ఆలోచించుకో!"

"అందులో ఆశ్చర్యమేముంది సార్! ఇందాక ఏస్థితిలో చూశాడు చెప్పండి! నేను మీ టేబుల్ దగ్గర నిలబడితే ఆశ్చర్యం లేదు కానీ మన మిద్దరమూ మన సీట్లు వదిలి ప్రత్యేకంగా నిలబడి మాట్లాడవలసిన ఆఫీసు వ్యవహారం యేముంటుంది? అతని అనుమానానికి కావలసిన దృశ్యాన్ని మనం చూపించేం."

"సారీ సుమిత్రా! అతన్ని పిలిచి ఏమీ లేదని చెప్పెయ్యనా?"

"దయచేసి ఆ పని మాత్రం చేయకండి. తప్పకుండా ఏదో వుందనే అనుకుంటాడు. నిజానికి మన మధ్య ఎముంది? నాకిష్టంలేని పదార్థం మీరు 'ఆఫర్' చేశారనుకోండి. నాకది సరిపడదని చెబుతాను! ఇప్పుడూ అంతే జరిగింది."

"నువ్వెంత మంచిదానివి సుమిత్రా!"


"మీరింతటి ఆఫీసరు ఎలాగయ్యారు సార్! మీ తెలివితేటల వెనుక వున్న అమాయకత్వం చూస్తే ఆశ్చర్యం వేస్తూంది."

"అయినా నా అంతటి దురదృష్టవంతుడుండడు. నీ పరిచయంతో, స్నేహంలో వెదకబోయిన తీగ కాలికి తగిలిందనుకున్నాను. కాని ఏం లాభం! నీ పెళ్ళి నిశ్చయం కాకమునుపు నేను వచ్చివుంటే యెంత బావుండేది! నాకింతే జరగాలి! ఈ శిక్ష కావలసిందే!" మిత్రాగారు చిరాగ్గా జుత్తు పీక్కున్నారు.

సుమిత్ర కంగారు పడింది. "ఎవరన్నా చూస్తే బావుండదు. ఈ సంఘటన వల్ల మీరు నాకు సన్నిహితులయ్యారు. మనం మంచి స్నేహితులం" అంది.

"ఎందుకొచ్చిన స్నేహం! అలా అనుకొని తృప్తి పడలేను!"

"మిమ్మల్ని చూస్తే నాకు బాధగానే వుంది.



కానీ ఏంచేయను చెప్పండి ఇలాంటి బలహీన క్షణాలు ఎదురవుతాయనే నీతి నియమాలంటూ సమాజం కొన్ని హద్దులేర్పరిచింది."

"ఒక్క కోరిక — చివరి కోరిక!"

"ఏమిటది?"

"నేనిలా అంటున్నాననుకోకు చంద్రలావు నిన్ను దక్కించుకోలేడని గ్యారంటీ పత్రం వ్రాసిమ్మన్నా యిస్తాను. అటువంటి సమయంలో, నీ జీవితంలో నిరాశ, ఒంటరితనం యెదురైన ఏక్షణంలోనైనా నన్ను గుర్తుంచుకో! నా దగ్గరకు రా! చంద్రలావుతో నీకు వివాహం జరిగినా ఆ బంధం మనమధ్య అవరోధం కాదు. మంచి మనసుతో మంచి మిత్రుడిగా నిన్ను అర్థిస్తున్నాను సుమిత్రా!"

సుమిత్ర రెండు క్షణాలు ఏమీ మాట్లాడలేదు ఆ తర్వాత మౌనంగా మిత్రాగారిని సమీపించి అంగీకార సూచకంగా తల ఊపింది.

○ ○ ○

"పిల్లి కళ్ళు మూసుకుని పాలు త్రాగుతూ ఎవరూ తనను చూడడం లేదనుకుంటుందట! సుమిత్రా! నేనేం పసివాడిని కాదు. నన్ను మభ్యపెట్టలేవు నువ్వు!" చంద్రలావు కఠినంగానే అన్నాడు.

"అలా అనకండి! పాపం ఆయన చాలా అమాయకుడు."

"అమాయకుడేం?" — చంద్రలావు పళ్ళు కొరికాడు. "ఆ అందమైన ముఖం చూసేసరికి మతి పోయింది నీకు! రాజును చూసిన కళ్ళతో మొగుణ్ణి చూసినట్లుంది నీకు!"

"అంత అసహ్యంగా మాట్లాడకండి. కేవలం అందం చూస్తేనే మతిపోయేదాన్నయితే మీ చక్కదనం చూసే ఒప్పుకున్నానా మిమ్మల్ని?" సుమిత్ర నెమ్మదిగాదే అడిగింది.

"ఔను. నేను అందగాడిని కాను, కానీ నీకొక తెరచాటు — మొగుడనే లైసెన్సు కావాలి. అందుకే యేరి కోరుకున్నావు నన్ను!"

"ఛీ! మీకెలా చెప్పాలో కూడా తోచడం లేదు. మీకంత అనుమానమైతే నన్ను చిత్రవధ చేయండి. మాట్లాడను. కానీ నిముషానికొకరు వచ్చే ఆఫీసరు గదిలో నేనేమో చేశానన్న ఆరోపణ మాత్రం చేయకండి! పోనీ ఉద్యోగం మానేయమంటే ఆ మాట చెప్పండి. మానేస్తాను."

"అదొక ఆయుధముంది నీకు! నా జీతం తక్కువని ఎత్తిపొడుపు!"

"కాదు. కానేకాదు" సుమిత్ర అరిచింది. "ఉద్యోగం చేసే భార్య విషయంలో ఈ రకం ధృక్పథాన్ని పెంచుకోకూడదు మీరు."

"ఏం చేసినా యెలా వున్నా సహించాలా?" అక్కసుతో వత్తిపలికాడు.

"ఏం చేశాను నేను?"

"ఏమీ అర్థం కానట్టు నటించకు! అసలు నీ సీటు ఆయన గదిలో యెందుకు?"

"నేను స్టెనోను. ఆయన ఆఫీసరు కనక."

"డిక్టేట్ చేసింది బయట సైపు చేయ కూడదా? మీ గదిలో నేనొక్కర్తెను, కూర్చో వడం యిష్టం లేదని ఆయనతో స్పష్టంగా చెప్పొచ్చుగా? పాత ఆఫీసరుగారున్నంతవరకు అలా సాగలేదా?"

"ఆ ఆఫీసరు అలా సరిపుచ్చుకున్నాడు. ఈయన స్టెనో తన మాట వినిపించేంత దూరంలో వుండాలనకున్నాడు."

"అదే! ఎందుకని అడుగుతున్నాను."

"డిక్టేట్ చేస్తుంటేనే టైపు చేయగల మెరిట్ నా దగ్గరుంది గనుక. అర్జంటు అవసరాలలో ఉపయోగపడుతుందని."

"అవును! నీ మెరిట్‌ను బాగా గుర్తించా డాయన."

"అలా ద్వంద్వార్థాలతో మాట్లాడకండి! ఎవ రన్నా వింటే అసహ్యంగా వుంటుంది."

"చూస్తే వుంటదేం? అందరూ ఏమను కుంటున్నారో ఒక్కమారు విను."

"వాళ్ళు రోగ్స్! మిమ్మల్నే ఏరికోరి యెన్ను కున్నానని జెలసీ."

"నువ్వు చమత్కారంగా మాట్లాడగలవు. అదే నీ ధీమా!"

"ఏదైనా కానీయండి" ఆమె నిశ్చలంగా అంది. "ఈ విషయాన్నింకా సాగదీస్తే నేను సహించలేను. ఒక్కటిమాత్రం గుర్తించండి! మీ ఆలోచణ నిజమైన పక్షంలో మిమ్మల్నింతగా దేవిరించాల్సిన అవసరం నాకు లేదు."

సుమిత్ర చివరి మాట చంద్రలావుపై ఎలా పనిచేసిందో కాని అప్పటికేమీ మాట్లాడలేదు.

○ ○ ○

మరునాడు సుమిత్ర ఆఫీసుకి వచ్చేసరికి ప్యూన్ ఆమె చేటికి ఒక కవరిచ్చి "చంద్రలావు గారు మీ కివ్వమన్నారమ్మా" అని చెప్పాడు.

సుమిత్ర ఉత్తరం తీసి చదివింది. ముఖంలో పెద్ద మార్పేమీ లేదు, "అయ్యగారున్నారా?" అని ప్యూన్నడిగింది. అత్యవసర పరిస్థితుల్లో మిత్రాగారు టైంకన్నా ముందు రావడం మామూలు విషయమే!

"ఉన్నారమ్మా! ఏదో ట్రంక్‌కాల్ బుక్ చేసి ఎనిమిదింటినుంచి దానికోసం ఎదురు చూస్తున్నారు" అన్నాడు.

ఆమె మరేమీ అనకుండా తన చేతిలోని ఉత్తరాన్ని ఉండగా నలిపి విసురుగా నేలకేసి కొట్టి రాయంచలా అడుగులు వేసుకుంటూ మిత్రాగారి గదిలోకి వెళ్ళింది.

అప్పుడే వచ్చిన జగన్నాధం ఆమె ఉత్తరా న్నలా నలిపి విసిరి వెళ్ళిపోవడం చూసి గబు క్కున జాగ్రత్తగా విడదీసి చదివాడు.

సుమిత్రా!

నీవు యిచ్చిన చనువును. యివ్వబోయిన సాహచర్యాన్నీ నేను అంగీకరించలేక పోతున్నం దుకు క్షమించు. నా మనసు ఒప్పుకోని పని చేసి, మనయిద్దరి జీవితాలనీ సంఘర్షణ పాలు చేయలేను.

అందుకే నన్ను మర్చిపొమ్మని స్నేహ పూర్వకంగా కోరుతున్నాను ఇదే మనకిద్దరికీ మంచిది. నేను నిన్ను భరించలేను. నన్ను నువ్వు సహించలేవు. ఇప్పటివరకూ జరిగింది "మనిద్దరి మంచికే" అని నీవు తలచే పక్షంలో నాకొక ఉప కారం చెయ్యి.

నేను నెలరోజులు సెలవు పెడుతున్నాను. ఆ సెలవులోపల నాకు ట్రాన్స్‌ఫర్ కావాలి. అలా కాని పక్షంలో నేను నా ఉద్యోగాన్నే వదలుకో వలసి వస్తుంది.

"జెలసీ ఈజ్ ఎ డెవిల్! నేను నిన్ను చూస్తూ దూరంగా వుండలేను. దగ్గరగా రాలేను. నీ శుభం కోసం, నన్ను నేనే నమ్మలేక నీకు దూరంగా వెళుతున్నాను నన్ను క్షమించ గలిగితే ఈ దూరాన్ని మరింత దూరంగా–అక్షయంగా చేయ డం నీ బాధ్యత– మరిచి పోకు.

నీ హితుడు

చంద్రలావ్" *



మనో విజ్ఞాన శీర్షిక :

మనసు సంగతి

డా॥ జయా నాగరాజ్

దేవుడు దిగివచ్చాడు!

"నాకేమీ తెలియదు... ఆ శ్రీనివాసుడే నాకు సాక్షి ... అతనినే అడగండి ... శ్రీనివాసుడే నా సర్వస్వం..." అంటూ మెల్లగా వూగడం మొదలుపెట్టింది రమణమ్మ. గట్టిగా తల వూపుతూ బొంగురు గొంతుతో ... "నీకేమీ ఫరవాలేదు. శ్రీనివాసుణ్ణి... ఆపద మొక్కులవాణ్ణి. నీ మనసును రంజింపజేయటానికి నీతోటే వుంటాను ... నీ భక్తికి మెచ్చాను... నువ్వు నాకు కావాలి... కావాలి... కావాలి" అంటూ విసురుగా ఊగుతూ రమణమ్మ కిందికి వాలిపోయింది. ఆ తరువాత కాళ్ళు బిగుసుకొనిపోగా, కొంతసేపు మైమరిచి వుండిపోయింది ... పనిమాలి శ్రీనివాసుడు రోజూ రెండుమూడు సార్లు రమణమ్మకోసం తిరుమల శిఖరాలు దిగివచ్చేవాడు ... పగలు రాత్రి అని లేకుండా రమణమ్మ పిలిచిందే తడవుగా పరుగెత్తుకొని వచ్చేవాడు ... ఇది సుమారు ఎనిమిది నెలలనుండీ జరుగుతున్న తతంగం ... వేరే వూళ్ళో చదువుకుంటున్న కొడుకు వచ్చి, చూసి పూనకంమీద నమ్మకం లేనివాడు కాబట్టి మానసిక వైద్యంకోసం తీసుకొనివచ్చాడు తల్లిని....

రమణమ్మకు సుమారు రెండేళ్ళ క్రితం ఒక వ్యాధికి చికిత్సలో భాగంగా బిడ్డసంచి తీసివేయబడింది. అది పెద్దఆపరేషను. సుమారు నెలరోజుల పైనే ఆసుపత్రిలో వుండి, బయటికి వచ్చింది. ఇంటికి వెళ్ళిన పిదపకూడా సక్రమమైన ఇల్లాలుగా వుండలేకపోయింది....లైంగికంగా భర్తను రంజింపలేకపోయింది. స్త్రీత్వానికి చిహ్నమైన బిడ్డసంచి తీసివేయడంతో తనలో స్త్రీకి సహజంగా అవసరమైన ధాతువులు తగ్గిపోయాయని, భర్తకు తాను పనికిరానని అనుమానాలు పెంచుకుంది .... భర్త ఉదాసీనత దీనికి తోడయింది .... ఆధ్యాత్మిక చింతనలో పడి తన కోరికలను, బాధలను మరవాలని చూసింది రమణమ్మ! ఆలోచనలు దేవునిమీద కేంద్రీకరించినా శరీరం కోరికలకు అతీతం కాలేకపోయింది .... ఈ సమయంలో పూనకంలో 'శ్రీనివాసుడు రమణమ్మను కోరివచ్చి' భౌతిక వాంఛలను మానసికంగా తీర్చడం మొదలుపెట్టాడు .... వాంఛలను మనసులో యెంత అణచిపెట్టుకున్నా (రిప్రెషన్) అవి మరో రూపంలో పైకివచ్చి తృప్తికోసం తహతహలాడతాయి. (రిటర్న్ ఆఫ్ ది రిప్రెస్డ్ కన్టెన్ట్స్ ఆఫ్ థాట్స్) ఆపదలకు "దేవుడే దిక్కు" కాబట్టి మనోవాంఛా సిద్ధికోసం దేవుడు తిరుమలగిరి దిగిరావడం కద్దు....

2

"చాలా నీరసంగా వున్నది .... శ్రీ వెంకటేశ్వరస్వామి వంటిమీదకు వచ్చిపోయాక మరీ నీరసగావుంది. గుండెల్లో దడ .... గాని దేవుడు నన్ను ఆవరించినప్పుడు....అహా.... చాలా బలం....ఆనందం...." అని చెప్పకుపోతున్న రామలక్ష్మి ఒక్కసారి లేచి నిలబడి బొంగురు గొంతుకతో, హాహాకారాలతో "నేను తిరుమల వెంకటేశ్వరుణ్ణి....నీకు రుజువు కావాలంటే వెలుగుతున్న కర్పూరాన్ని మింగుతాను...." అంటూ కండ్లు పెద్దవిచేసి వూగిపోయింది .... మన మాటలు వినే పరిస్థితిలో మాత్రం లేదావిడ .... కర్పూరాన్ని తెప్పించి అరచేతిమీద వెలిగించాము....చటుక్కున దానిని నోట్లో వేసుకొని ఆర్పివేసిందావిడ .... దేవుడు "మీద" వున్నప్పుడు "అగ్ని" కాల్చదని నోట్లో వెలుగుతున్న కర్పూరం మింగడం.... మండుతున్న బొగ్గులమీద నడవడం....గట్టిగా పూనకంలో వున్నప్పుడు కొట్టుకోవడం కద్దు. దీనికి హిస్టీరియా నిద్రావస్థ (హిస్టీరికల్ ట్రాన్స్ స్టేట్) అంటారు. ఈ అవస్థలో నొప్పి అనిపించడం తక్కువ (యూనివర్సల్ ఇన్‌డిఫరెన్స్ టు పెయిన్ స్టిములస్) ఇది చూసినవారికి పూనకంమీద నమ్మకం కలిగించేటట్లుంటుంది.

తిరుపతి గురించి .... పద్మావతి గురించి కబుర్లు చెపుతున్న వెంకన్న చటుక్కున ఏ పిలుపు విన్నాడో వచ్చిన విధంగానే రామలక్ష్మిని విడిచి వెళ్ళిపోయాడు .... స్పృహ లేకుండా కొంతసేపుండి పోయిందావిడ ... అటుపైన సన్నటి ఆడ గొంతుకతో "నేను పద్మావతిని... నా ఆత్మ రామలక్ష్మి... రామలక్ష్మే నేను ... నేనే రామలక్ష్మి" అని చెపుతూ చుట్టూ వున్నవారిని చూచి వారి ప్రశ్నలకు జవాబు చెప్పనారంభించింది.

రామలక్ష్మికి నలభై యేళ్ళు....భర్త ఆమెను వదలి వెళ్ళి సుమారు 15 యేళ్ళయింది.... అప్పటినుంచి అన్నగారింట్లో వుండిపోయింది. అన్నగారియింట ఎత్తిపొడుపు మాటలను ఈ సడింపులకు మనస్సు మొద్దుబారిపోయింది... జీవితం మీద విరక్తి పుట్టింది....తనజీవితంలో తను ఏమి చవి చూసినట్లు? చాలాచిన్నతనంలో వివాహమయింది.... కొంచెం తెలిసీ వచ్చేసరికి అత్తగారింట నానా అగచాట్లూ పడింది.... చివరికి భర్త ఆదరణ కూడా లేకపోయింది. అత్తగారింటినుండి అన్నగారిపంచజేరింది.... మరీ గుర్తింపులేనిజీవితం అయింది....దానితో దైవపూజలు, ఉపవాసాలు, భజనలు చేస్తూతిరుపతివెంకటేశ్వరుణ్ణి పద్మావతి కొలిచింది..అంతవరకూ మూతి విరుచుకుంటున్న వదినెలు.... తిట్టుకుంటున్న అన్నలు పద్మావతి అంశాన్ని పొందిన రామలక్ష్మిని చూసి నోళ్ళు తెరిచారు! పద్మావతి అంశ పొందిన రామలక్ష్మి ప్రజలకు సన్నిహితురాలయింది....ఇదిచూసి శ్రీ వెంకటేశ్వరుడు రామలక్ష్మి బదిలి పారిపోవాల్సి వచ్చింది....పూనకంలో ప్రశ్నలకు జవాబులివ్వడం...దీవెనలు, విబూది, పూలూ యివ్వవ కోరికలు తీర్చడంతో రామలక్ష్మి అంటే ఎవ్వరూ తెలియని వారికి కూడా ఆమె సాక్షాత్తూ పద్మావతి దేవి స్వరూపమైంది. ధనం.... పేరు ప్రతిష్ఠలు ప్రచారమూ పెరిగాయి....దీనితో రామలక్ష్మి మనస్సులో గూడు కట్టుకున్న దీనతానికి ఉపశమనం కలిగింది.... పేరువూరు లేని

రామలక్ష్మిదేవతగా మారింది! దీనితో మనసు సేదదీరింది(గ్రాటిఫికేషన్) తన జీవితంలోని లోటు పాట్లకుయిది జవాబయ్యింది (కాంపెన్సేషన్)అర్థంలేనిఆమె జీవితంఒకవెలుగావెలిగింది

కడుపునొప్పి అని రామలక్ష్మిని ఆసుపత్రికి తీసుకు వచ్చారు. ఆమెను వైద్యులు మానసిక శాస్త్రవేత్త దగ్గరికి పంపారు. మానసిక వైద్య విధానాన్ని గురించి ఆమె మానసిక వ్యవహారానికి వివరణ యివ్వక ముందే, చికిత్స ప్రారంభించక ముందే వాళ్ళు వాళ్ళు ఆమెను తీసుకుపోయారు....పద్మావతిని రామలక్ష్మిగా మారిస్తే మరి వెంకటేశ్వరుడు రాడు...ధనలక్ష్మి కూడా రాదు!

3

ఆమె, పరమ భక్తురాలు...పిలిస్తే "ఓ" అంటాడు శ్రీకృష్ణుడు. ఆనాడు మీరాబాయి కోసం కృష్ణుడు వచ్చాడో లేదో కానీ ఈనాడు మాత్రం డెబ్బయ్యేళ్ళ రాధమ్మ పిలిస్తే తప్పకుండా వస్తాడు. ఇల్లంతా ఆశ్రమంలా వుంది చుట్టూ చెట్లు, పూలూ, తీగలు. బృందావనాన్ని మించిపోయింది...ఎక్కడ చూసినా శ్రీకృష్ణుని విగ్రహాలే....వెన్నముద్ద దొంగిలించే శ్రీకృష్ణుని దగ్గర నుంచి, గోపికలతో సరసాలాడే కృష్ణుని వరకూ తైలవర్ణ చిత్రాలలో కనిపిస్తున్నారు. పాలు....వెన్న నైవేద్యంలో నిత్య దీపారాధనతో వెలిగిపోతోంది ఆ ప్రదేశం...చిన్ని కృష్ణుడికి లాలాపోసి గోరుముద్దలు తినిపించి వుయ్యాలలూగించి నిద్రపుచ్చడం దగ్గిర నుంచి రాసకేళి విలాసాల వరకూ రాధమ్మదే పని. అందులోనే మునిగి డెబ్బయి దశాబ్దాల జీవితాన్ని ఎదుగూ బొదుగూ లేకుండా, ఏ వికారాలకూ లోను కాకుండా గడిపిందామె. ఎల్లవేళలా శ్రీకృష్ణుడు ఆమెతోనే ముచ్చటలాడుతూ మురిపిస్తూ గోకులాన్ని గోపికలను మరిచిపోయాడనిపిస్తుంది. ఆమెకు అదే లోకం... ధ్యానంలో వున్నప్పుడు ప్రజలను దీవించడం భజనలు చేసి వారిని రంజింప జేయడం... రాధమ్మ కార్యక్రమంలో భాగం.

అశుభం శుభం తెలియని ఎనిమిదవ ఏట రాధమ్మ వివాహం జరిగింది, రజస్వల అయిన తరువాత యెన్నో మరిపాలతో పంపారు.... అత్తమామలు కూడా చాలా ఆదరంతో ఆమెను ఆదుకొని ఇల్లు వాకిలి గొడూ, గోదా డబ్బూ దస్కం అన్నీ ఆమెకు అప్పచెప్పారు. క్రొత్తలో సరదాగానే వుంది....తాను కథలలో చదివినట్లు అత్తమామలు రాక్షసులు కారు... బాధ్యతలు తనకి అప్పగించారు. లంకంతకొంప ....నౌకర్లు, చాకర్లు దీనితోనే సరిపోయేది.... భర్త ఎక్కడో చదువు కొనేవాడు.... ఎప్పుడో గాని వచ్చేవాడు కాదు....వచ్చినా అతనిచదువు పాడవుతుందని అత్త తనను భర్త సేవలకు పంపేది కాదు. పదమూడవ ఏట అత్తవారి గడప తొక్కిన రాధమ్మకు యుక్త వయసు వచ్చింది....దానితో కోరికలు చెలరేగాయి.... ....తనజీవితం గురించిఎన్నోకలలుకన్నది— అప్పుడు తెలిసింది తన భర్త నపుంసకుడని... లైంగిక జీవితానికి పనికి రానివాడని....చదువు నెపంతో దూరంగా వున్న భర్త, యింటి పట్టున వున్నాతనని భర్త వద్దకు పంపని అత్త .అంతా ఎందుకు ఈ కుట్రపన్నారుతనమీద? కదిజవాబు లేని ప్రశ్న....భర్త చేతకానితనంఅత్తమామల దీనత్వం...సాంప్రదాయం...కులం...ఇంటి పరువు ప్రతిష్టలు అన్నీ ప్రతిబంధకాలై ఆమె కాళ్ళకు సంకెళ్ళై వుండిపోయాయి...ఎటూ తోచక, తెగించి గుమ్మం దాటలేక ఎవ్వరితోనూ చెప్పుకోలేక అపర మీరాబాయిగా మారిపోయింది రాధమ్మ...తనలో రేకెత్తుతున్న కోరికలను (డిజైర్) అణచి పెట్టుకొని (సబ్లిమేట్) వాటికి జవాబుగా భక్తిలోకి జొరబడి.... శ్రీకృష్ణునిలో లీనమైపోయింది....కలలు.... పూనకాలు...దైవదర్శన సందర్భాలు అన్నీ ఆమె కోరికలను నలుగురూ హర్షించే విధంగా (సోషియల్లీ యాక్‌సెప్‌టెడ్ వే) తీర్చుకో గలిగింది. శ్రీకృష్ణుడే ఆమెకు అండగా నిలవకపోతే ఆమె జీవితం ఎటువంటి మలుపు తిరిగేదో!! *

సీరియల్



అమ్మని ఇంటికి తీసుకొచ్చి. నాలుగు రోజులయింది.

—రెండు రోజుల్నుంచి ఒంట్లో బాగుండక శేఖరం ఇంట్లోనే వున్నాడు.

మీరాకి చాలా ఇబ్బందిగా వుంది.

అరుణ వున్నా తనకేదైనా కావలిస్తే తిన్నగా మీరాకి చెప్పటానికి అతను సంకోచించటం లేదు తల్లి వున్నప్పుడయితే తల్లికే చెప్తున్నాడు అందుకే శేఖరం వుండే ఛాయలకే వెళ్ళడం మానుకుంది అరుణ బ్రతిమాలినా సరే వెళ్ళదు.

'మీరాకి అన్నయ్య మీద కోపం పోలేదు' అనుకుంది అరుణ. అన్నగార్ని పదిరోజులుగా అడగాలనుకుంటున్న ఒక విషయం–మీరాకి అన్నగారంటే వున్న విముఖత చూస్తున్న కొద్దీ ఆ కోరికని విరమించుకుంది.

ఒకసారి మీరాతో అంది అరుణ. "నువ్వు అదివరకు మీరావి కాదు". అని.

"ఏదేం?" అంది మీరా పాపని ముద్దాడుతూ అరుణ కేసి చూడకుండానే.

"తెలియనట్టు మాట్లాడకు! అదివరకు నీతో ఏం మాట్లాడ్డానికీ భయం వుండేది కాదు. ఏం చెప్పడానికీ సంకోచం కలిగేది కాదు."

"అరుణా! నేను భయపెట్టేలా వున్నానా?" అరుణకేసి తిరుగుతూ అంది.

"భయమంటే....భయం కాదనుకో...." ఆగిపోయింది.

"ఈ రోజు కొత్తగా మాట్లాడుతున్నావు."

"ఎన్నాళ్ళ నుంచో నిన్నొకటి అడగాలని—ఏమనుకుంటావోనని....అది వరకెప్పుడేనా ఇలా సంకోచించేనా?"

మీరా గుండెలు కొట్టుకున్నాయి. "ఇప్పుడు మాత్రం భయమెందుకూ? అడగూ!" అని తేలిగ్గా అనలేకపోయింది మీరా. పాపకేసే చూస్తూ ఉండిపోయింది.

మీరా భుజంమీద చేయి వేస్తూ, "చూశావా? ఇదివరకయితే ఏమనేదానివి?" నవ్వింది అరుణ.

మీరా మొహం ఎత్తకుండానే అంది "నువ్వు అదివరకిలా మాట్లాడి ఎరగవు—ఏమిటో అంతా గుంభనంగా మాట్లాడుతున్నావు."

"పోనీలే! వాటి సంగతి వదిలేయి. నిన్నొకటి అడగాలనుకుంటున్నాను అడగనా?"

"అడుగూ!" తప్పనిసరిగా అంది మీరా. "ఏమిటో ఆ విషయం" గుండెలు దడదడ లాడాయి.

"అన్నయ్య మీద నీకు కోపం పోలేదు కదూ!"

నిజంగా అరుణ అలా అంటే విజయ్ సంగతే అయి వుంటుంది అనుకుంది.

మీరా మాట్లాడక పోవటంతో మళ్ళీ అంది అరుణ "ఏం మీరా! అప్పుడు అలా అన్నాడని అన్నయ్యంటే కోపం కదూ! అసలు జ్యోతి........"

"ఇప్పుడా సంగతులు ఎందుకరుణా! నువ్వు ఎన్నేమీ అనలేదు–నేను నిన్నేమీ అనలేదు–జ్యోతికి నాకు ఎంత స్నేహమో నీకు తెలుసు–దయచేసి ఇంకా సంగతులు తు



మాట్లాడకు" అంది.

తర్వాత మీరా ఎంత నవ్వుతూ మాట్లాడినా అది కృత్రిమంగానే అన్పించింది అరుణకి.

"మీరా మీద అన్నయ్యకి కోపం పోయింది. డబ్బులే! ఇలాంటి పరిస్థితికి వచ్చింది కానీ, మీరాకి ఏంలోటూ! అన్నయ్యకి ఇష్టం అయితే అమ్మ ఏం అనదు అని సంతోషించింది అరుణ. కానీ మీరాకే అన్నయ్యంటే సదభిప్రాయం లేదు. అలాంటిది అన్నయ్య దగ్గర కదపడం బాగుండదు అన్పించింది అరుణకి.

మీరా వెళ్ళబోయేముందు శేఖరం తల్లికి నూట ఏభై ఇచ్చేడు. అంతక్రితమే మీరాకి జీతం ఇవ్వాలని చెప్పిందావిడ నూటఏభై చూసి "ఇంతెందుకూ?" అంది.

"అరుణకి ఏదో సహాయం చేయాలని వుంది–విడిగా ఏమిచ్చినా తీసుకోకపోవచ్చు. అందులో అరుణ ఇస్తే తీసుకుంటుందా? నువ్వే ఏదో ఒకటి చెప్పి ఇయ్యి" అన్నాడు,

ఇది అరుణకీ నచ్చింది. తను ఇస్తే మీరా తీసుకోదు. అమ్మ ఇస్తేనే బాగుంటుంది. అసలు అమ్మ ఏం చెప్పినా మీరా కాదనదు అనుకుంది.

మీరా తీసుకుంటుందన్న నమ్మకం శేఖరానికి లేదు. అప్పుడు ఇరవై తిరిగి తనకిచ్చేసినట్లు అమ్మకి తెలియదు. తీసుకోకదమంటూ వుంటే అది అమ్మ ఇస్తేనే....

మీరా వెళ్తోంటే శాంతమ్మగారు జీతం ఇచ్చింది.

చేతికి తీసుకున్న నోట్లు ఒత్తుగా కనిపించటంతో మీరాకి అనుమానమేసి లెక్క చూసింది

తిరిగి డెభై రూపాయలు శాంతమ్మ గారికి ఇవ్వబోయింది.

ఆవిడ తీసుకోలేదు. "మీరా! నా సంతోషం కోసం ఇచ్చేను నువ్వు తీసుకోవల సిందే" అంది.

"క్షమించండమ్మా! నేను తీసుకోలేను" తిరిగి ఆవిడకి ఇవ్వబోయింది.

"అదేమిటి మీరా! అమ్మ ఇస్తే కాదంటావు" అంది అరుణ.

"మీకు నేను డబ్బు మనిషిలా కనిపిస్తున్నానా అరుణా! నీకు చేసిన చాకిరీకి ఏకంగా ఒక్కసారి నీకు ఎంత ఇయ్యాలని పిస్తుందో అంతా ఒకేసారి ఇచ్చేవంటే.... ...."మీరా గొంతు పట్టుకోవటంతో ఆగిపోయింది.

వరండాలో వాలుకుర్చీలో కూర్చున్న శేఖరానికి అన్నీ వినవడుతూనే ఉన్నాయి విని తను చేసేదేం లేదని తెలిసి మౌనంగా వింటూ వుండి పోయాడు

అరుణ లేచి మీరా దగ్గర కొచ్చి మీరా రెండు చేతులూ పట్టుకుంది. "మీరా! మాకింత శ్రమను కోకుండా చేస్తున్నావు. మాకేం కావాలన్నా నీ దగ్గర సంకోచపడు తున్నామా? నువ్వెన్ని సార్లనలేదూ? అమ్మ నిన్నెంతో అభిమానంగా చూస్తుందని!" అంది.

"అవును అరుణా...."

"మరి అభిమానంగా ఇస్తే తప్పట్టు కుంటావా, చెప్పు! నా స్నేహితురాలివని తెలిసి మనిద్దరం ఒకప్రాణం అని తెలిసి అమ్మ నీ పరిస్థితికి ఎంత బాధపడిందో తెలుసా?"


"నేనేదీ కాదనట్లేదు అరుణా! అప్పుడు అమ్మకి బొత్తిగా బాగుండక మానేద్దా మంటే అమ్మగారు డబ్బుకోసమే అని ఎక్కడనుకుంటారోనని "నువ్వొస్తావనీ అమ్మని ఎదిరించి వుండిపోయాను.... ఇప్పుడు తీసుకోలేను అరుణా! నన్ను క్షమించు నాకేదేనా అవసరం వస్తే నేనే అడిగి తీసుకెళ్తాను" అని శాంతమ్మగారికిచ్చేసింది.

క్రితం నెల ఇరవై రూపాయలు శేఖరానికి మీరా ఇచ్చేసిన సంగతి తెలియక మళ్ళీ తిరిగి ఇరవై ఇవ్వబోయింది.

"మొదట మాట్లాడుకున్నది ఇంతే! ఇదే చాలమ్మా" అని వెళ్ళిపోయింది

నాలుగు రోజులు గడిచి పోయివాయి. అప్పుడే మూర్తి దగ్గర నించి వుత్తరం వచ్చింది అరుణనీ పాపని నెలలోపు తీసుకెళ్తామని. దానికి శాంతమ్మగారు వెంటనే జవాబు రాయించింది మూడోనెల వచ్చే వరకన్నా వుంచమని.

శాంతమ్మ గారికి వియ్యపురాలిమీదా అల్లుడిమీదా చాలా కోపం వచ్చింది.



"పెళ్ళయినాక పట్టుమని పదిరోజులుంచలేదు! పోనీ పుట్టింటికి ఎప్పుడు పంపే రనీ! తొలికాన్పుకి ఏడోనెలని తీసుకొచ్చి మళ్ళీ చంటి బిడ్డకి అయిదోనెలవచ్చే వర కన్నా ఉంచుకుంటారు. ఏదీలేదు. ఇప్పుడు నెలలోనే తీసుకెళ్తారుట. పెళ్ళి చేసి పంపేస్తే ఇంక వుంచకూడదను కున్నారా?" అంటూ మొదలెట్టింది. అరుణని కూడా మూర్తికి వుత్తరం రాయమని చెప్పింది.

ఆరోజు మీరాకి తొందరగా ఇంటికెళ్ళడానికి కుదరలేదు. శాంతమ్మ గారికి ఒంట్లో బాగుండలేదు. అరుణకి అన్నం పెడితేగాని వెళ్ళడానికి లేదు.

"రాత్రి అయితే ఒక్కదానివీ వెళ్ళాలి వెళ్ళు మీరా" అంది అరుణ. అరుణ నాలు గయిదు సార్లు చెప్పినా మీరాయే బాగుండదని ఉండిపోయింది.

తనకోసం మీరా ఉండిపోవడంతో అరుణ ఏడున్నరకే భోజనానికి వచ్చే సింది. అసలు పొద్దుపోకుండా తినాలని తల్లి చెప్పినా అలవాటు లేక అరుణ తినట్లేదు.

అరుణ భోజనం అవుతోంటే శేఖరం వచ్చేడు.

పొద్దుపోయింది కదాని గంగుల్ని తోడిచ్చి పంపాలనుకొంటోంది శాంతమ్మగారు.

ఇది తప్పితే ఇలాంటి సావకాశం రాదనుకున్నాడు శేఖరం ధైర్యం చేసి తల్లీ అరుణ వుండగా అన్నాడు "నేనెలాగూ రెడ్డి ఇంటికెళ్ళాలి అభ్యంతరం లేక పోతే తీసుకెళ్తాను."

"సరే ఆలా అయితే. పొద్దు పోయింది. అవిడేం కంగారు పడుతుందో! వెళ్ళమంటే వెళ్ళింది కాదు" అంది శాంతమ్మగారు.

"అభ్యంతరానికేముంది? నేనే అందామనుకున్నాను" అంది అరుణ.

"నీకూ నాకూ లేకపోవచ్చు" మీరా వస్తుందన్న నమ్మకం అతనికి లేదు.

మీరా వంట గదిలోంచి ఇవతలకి రాగానే శేఖరం ఈ అవకాశం ఎక్కడ జారిపోతుందో అన్నట్టు వెళ్ళి కారులో కూర్చున్నాడు.

శాంతమ్మగారు చెప్పగానే "ఎందుకమ్మా! లైట్లుంటాయి పోనీ గంగుల్ని పంపండి" అంది మీరా. కారులో అన్నతో వెళ్ళటం మీరాకి ఆసక్తిష్టం లేదు.

శాంతమ్మగారు కేకలేసింది "అరుణ ఎక్కడ అలసిపోతుందోనని, వెళ్ళమన్నా ఉండిపోయావు. ఇవ్వింత పొద్దుపోయి నడిచి వెళ్తే అరుణ బాధపడదా! వెళ్ళు. ఇప్పటికే మీ అమ్మగారు ఏం కంగారు పడుతున్నారో."

అరుణ బ్రతిమిలాడింది

ఇక తనేం చెప్పినా వీళ్ళు వినరని-ఇంక తప్పదనుకున్న మీరా అయిష్టంగానే వచ్చి కారులో కూర్చుంది.

తలుపు సరిగా పడలేదని గ్రహించిన శేఖరం మళ్ళీ లాగి గట్టిగా వేశాడు.

మీరా వెనకాలే వచ్చిన అరుణ కారు కదిలేక వెనక్కి వచ్చింది. ఎందుకో అన్నయ్యని చూస్తూనే అలా అయిపోతుంది మీరా. ఒక్కసారి-ఆ రోజు జ్యోతితో కూడా వచ్చిన రోజు-కోపంలో కాస్త కోపంగా మాట్లాడేడు. దానికే మీరాకి అన్నయ్యంటే అంత కోపమా? లేకపోతే అన్నయ్య మళ్ళీ ఎప్పుడన్నా ఏదేనా అన్నాడా!

○ ○ ○

స్కూలు దగ్గర కొచ్చేసరికి శేఖరం కారు స్లో చేస్తూ, "ఇక్కడ కొంచెం సేపు ఆపుతాను మీరా. ఏం అభ్యంతరం చెప్పద్దు" అన్నాడు.

మీరా మాట్లాడలేదు

స్కూలు ఆవరణ దగ్గర శేఖరం కారుని ఓ పక్కగా ఆపాడు.


కారు ఆగీ ఆగగానే మీరా డోరు తెరవబోయింది వెళ్ళిపోవడానికి.

వెంటనే డోరు తెరవకుండా దానిమీద చేయి వేస్తూ "మీరా నీతో మాట్లాడాలి అందుకే కారు ఆపాను" అన్నాడు.

చాలా ఈసడించుకున్నట్లుగా అంది మీరా "పూరికే మీరు తీసుకొస్తారా!"

"అంటే?" తెల్లబోతూ అడిగాడు.

"ఏ దురుద్దేశం లేకుండా మీరు తీసుకొస్తారా? అమ్మగారూ, అరుణా మీరు ఏం చెప్పినా నమ్ముతారు- కాని నేను నమ్మను. మీరు...."



"ప్లీజ్, మీరా! అలామాట్లాడకు. అంత నీచుణ్ని కాను. నీతో మాట్లాడాలనే తీసుకొచ్చేను — అందుకే ఇక్కడ ఆపాను....

"నేనేం వినాలనుకోవడం లేదు— ఆ సంగతి ఎప్పుడో చెప్పాను."

"అంటే! తెలిసో తెలియకో ఒక తప్పు చేస్తే అది సరిదిద్దుకొనే అవకాశమే లేదా, మీరా! నా వల్ల జరిగిన అన్యాయానికి నేనెంత వ్యథ చెందుతున్నానో నీకు తెలియదు ఎన్నాళ్ళనుంచో నీతో అన్నీ మాట్లాడాలనీ- ఇలాంటి అవకాశం కోసం నేనెన్నాళ్ళ నుండి ఎదురు చూస్తున్నానో నీకు తెలియదు. ప్లీజ్ ఒక్క అయిదు నిముషాలు కూర్చో మీరా" బ్రతిమాలుతున్నట్లుగా అన్నాడు శేఖరం.

అతని బాధనీ వేదననీ అర్థం చేసుకొనే స్థితిలో లేదు మీరా.

"మీరు చెప్పాల్సినవీ - నేను వినాల్సినవీ ఏం లేవు - నేనేం వినను" చాలా కచ్చితంగా అంది మీరా.

రెండు మూడు క్షణాలు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం-

తర్వాత గొంతు సవరించుకొని అడిగాడు శేఖరం. "మీరా.... బాబు ఎవరు?" అతని గొంతు అతనికే క్రొత్తగా అన్పించింది.

ఆ రోజు హాస్పిటల్ దగ్గర విజయ్‌ని చూశాక - ఎప్పుడో ఒకప్పుడు అతనీ మాట అడుగుతాడని మీరా అనుకుంటూనే ఉంది. అతను అలా అడిగితే తను మౌనంగా ఉండిపోవాలనుకుంది

మీరా డోరు తెరచుకుని దిగింది.

శేఖరం కూడా కారు దిగి మీరాకి అభిముఖంగా నిలబడి "మీరా, బాబు ఎవరి బిడ్డ!" మీరా నోటి నుండి రాబోయే జవాబు కోసం అతని మనసు తహతహలాడుతోంది తన భవిష్యత్తంతా ఆ ఒక్క మాట మీదే ఆధారపడినంత ఇదిగా ఉగ్గబెట్టుకున్నట్టు నిలబడ్డాడు.

చప్పున వెళ్ళిపోవడానికి మీరా జంకింది. అతను మొండితనంగా చెయిపట్టి ఆపేస్తాడేమోనని _ అయినా మళ్ళీ మళ్ళీ ఎప్పుడూ తననేమి అడక్కుండా _ తన జోలికి రాని విధంగా జవాబు చెప్పాలనుకుంది.

మీరా మాట్లాడక పోవటంతో ఆత్రుత అణుచుకోలేక మళ్ళీ అడిగాడు. "మీరా! చెప్పు! బాబు ఎవరి బిడ్డ!"

"మీరు ఎవరి బిడ్డ!" సూటిగా శేఖరం కళ్ళల్లోకి చూస్తూ అంది. ఇది అర్థం లేని ప్రశ్నే అయినా శేఖరానికి తల్లి లేదూ_ సవతి తల్లి అంటే అతను చాలా బాధ పడ్డాడని కోపం వస్తుందని అరుణ చెప్పగా వింది.

ఇదే మాట ఇంకెవరేనా అంటే వాళ్ళ చెంప చెళ్ళుమనేదే. ఇంకో సమయంలో ఈ మాట మీరా అన్నా ఇంత సహనంగా వుండేవాడు కాదేమో. అతని కను బొమలు ముడుచుకున్నాయి. మీరాని నిశితంగా చూస్తూ శాంత స్వరాన అన్నాడు. "అదేం ప్రశ్న _ నేనెవరో నీకు తెలియదా! .... బాబు ఎవరని అడుగుతున్నాను."

"మీరెవరు! నేనెవరు _ అందర్లాగే వాడూనూ" మీరాలో మొండితనం ప్రవేశించింది.

"అది కాదు" _ మీరా నుండి చూపు మళ్ళించుకుంటూ అన్నాడు మళ్ళీ "బాబు అమ్మా, నాన్నా _ లేరా .... వాళ్ళదగ్గరుండరా?...." ఇంత ఇదిగా కంగారు పడడం గాని _ సూటిగా ఏదేనా అడగటానికి సంకోచపడడం కాని ఎప్పుడూ ఎరగడతను.

"ఉండకుండా ఎలా?...." చాలా పెడసరంగా అంది.


"అదే _ కలిసి ఉండరా?"

"నింగి _ నేలా .... ఎలా కలిసి వుంటాయి...."

శేఖరం చప్పున మీరా చెయ్యి పట్టుకున్నాడు. ఎంత డొంకతిరుగుడుగా మాట్లాడినా మీరా చెప్పింది అర్థమవడమే కాకుండా మీరా అభిప్రాయం కూడా అతనికి అర్థమయింది. అతని మనసు గిలగిలలాడింది.

మీరా శేఖరం చేతిని విదిల్చికొట్టింది. కాని శేఖరం వదల్లేదు.

"మీరా! నా మాట శాంతంగా విను. ముందు నువు కార్లో కూర్చో! నా వల్ల జరిగిన పొరపాటుకి నేనెంత వ్యధ చెందుతున్నానో నీకు తెలియదు మీరా! నేను వచ్చి మీ అమ్మగారితో మాట్లాడతాను. నా వల్ల జరిగిన అపరాధం ఆవిడతో చెప్పి



ఆవిడని ఒప్పిస్తాను....."

అతని మాటలు పూర్తికాకుండానే మీరా "మా ఇంటికొచ్చి మా అమ్మతో చెప్పాలని చూశారంటే ఒకటి కాదు _ మూడు శవాలని చూస్తారు...."

"మీరా!?"

"మా అమ్మ కోసం నేనున్నాను _ నేనున్నాను కాబట్టే వాడున్నాడు. మా ఇంటికి రావాలని చూసినా _ ఆవిడకి ఏదేనా చెప్పాలని చూసినా _ ఆవిడ కోసమే జీవచ్ఛవంలా వున్న నేను _ ఆవిడకి ఏదేనా పెట్టి, నేనూ తింటాను. వాడికీ పెడతాను _ మీకు శవాలతో మాట్లాడాలని సర్దాగా వుంటే _ అలాగే రండి."

మీరా మాట్లాడే ప్రతీ మాటకీ గుండెల్లో పదేసి బల్లేలు గుచ్చుకోగా_స్థాణువులా నిల్చున్న శేఖరం చేయి విడిపించుకుని విడివడిగా వెళ్ళిపోయింది మీరా.

తేరుకున్న శేఖరం "మీరా వుండు, వెళ్ళకు" అని వారించినా పరుగులాంటి నడకతో వెళ్ళిపోయింది.

వెనకాలే శేఖరం వెళ్ళేడు.

శేఖరం గుడి దగ్గరుండగానే మీరా తడిక తోసుకుని లోపల కెళ్ళింది.

"ఇప్పుడా రావటం?" తగ్గు స్వరంలోనే అన్నా ఆ స్వరంలో తీవ్రత ధ్వనించింది."

"ముందు లోపలకి నడు" విసుగ్గా అని మీరా తల్లిని తోసుకుని లోపలికెళ్ళింది.

తలుపులు మూసుకున్నాయి. చెవి ఒగ్గి వింటేకాని వినపడనంత నెమ్మదిగా వినిపిస్తున్నాయి మాటలు.

"ఇదేం ఉద్యోగం? నన్నిలా కూడా బ్రతకనీయవా? పుణ్యాత్మురాలు వెళ్ళిపోయింది-నేనన్నా పోయాను కాదు" ఏడుపు గొంతు....

"ఇప్పుడేమయిందనీ! అమ్మగారికి ఒంట్లో బాగుండలేదు-ఇంట్లో ఎవరూ లేక-అరుణకి సాయంగా వున్నాను. ఆలాంటప్పుడు వచ్చేస్తే బాగుంటుందా?" కోపంగా వినపడింది.

"అవునమ్మా నేనేం మాట్లాడినా నీకు కోపమే. అపేక్ష నాకుండదు. వుండకూడదు. వాడికి కాస్త జలుబు చేస్తే గిలగిల్లాడతావే! వాడు మామూలుగా అయ్యే వరకూ తిండి తినవే? నాకు అలా వుండదూ?" ఏడ్చిన శబ్దం....

తర్వాత మళ్ళీ మాటలు వినపడలేదు.

శేఖరం వెనక్కి తిరిగి వచ్చేశాడు.

"బాబుని అంత ఇదిగా ప్రేమిస్తుందామీరా!" బాబుని రెండు చేతులతో పట్టుకుని మీరా సంతోషంగా ఎగరవేస్తున్న దృశ్యం అతని కళ్ళముందు మెదిలింది.


స్టీరింగు మీద చేతులాన్చి-వాటి మీద తల ఆన్చుకున్నాడు. మీరాకి తనంటే చాలా అసహ్యం. తన అభిప్రాయాన్ని ఒక్క మాటలో ఎంత చక్కగా చెప్పింది! నింగీ నేలా ఎలా కలిసి వుంటాయి! తను ఇలాంటి అవకాశం కోసం ఎన్నాళ్ళుగా ఎదురు చూస్తున్నాడు. ఇలాంటి మాట కోసమా తను ఎదురు చూసింది! ఓ! మీరా! అనుకోకుండా-ఆవేశంలో నా వల్ల జరిగిన పొరపాటును-మళ్ళీ దిద్దుకొనే అవకాశం కూడా లేదా? ఆ రోజు నీ నోరు కట్టేయాలని చూస్తున్నానన్నావు-ఈరోజు నిజంగా నా నోరు కట్టేశావు. ఇంక నేనెటువంటి ప్రయత్నాలూ చేయడానికి వీలులేని విధంగా నా నోరు కట్టేశావు.... ....

ఆ రాత్రి మీరా అన్నం తినలేదు ఏడుస్తూ పడుకుంది.

"ఇప్పుడు నేనేమన్నాననీ? నన్నెందుకే తల్లీ ఇలా బాధపెడ్తావు. నాకు ఓపిక లేదమ్మా! రా, రెండు ముద్దలు తిందువు గాని." కూతురు అన్నం తినలేదనే బాధ ఓ వైపు-ఇలా ఈ రోజులు ఎప్పటికి తెల్లవారేనని మరో వైపు.

"నువ్వన్నావని కాదే! నాకు తలపోటుగా వుంది. నేను తినను-కాస్త అరుణ వెళ్ళేవరకూ ఓపిక పట్టు. అరుణ వెళ్ళిన మర్నాడు మానేస్తాను. నాకిదేం నచ్చలేదు. ఇప్పుడే మానేస్తే అరుణ ఇంటికొస్తుంది." తల్లిని అక్కడ్నించి పంపేసి దిండులో తల దూర్చుకుని ఏడుస్తూ పడుకుంది. ఎందుకో మీరాకి ఎంత ఆపుకుందామన్నా దుఃఖం ఆగలేదు.

మర్నాడు—



మీరాకి నిజంగా ఆ పూట వెళ్ళాలని లేదు. కాని వెళ్ళక తప్పదు. ఆవిడకి ఒంట్లో బాగుండలేదు. అరుణ బాలింతరాలు—అయినా కాలు కాలినప్పుడు వెళ్ళిన దాన్ని ఇప్పుడు ఏం లేకుండా మానేస్తే ఎందుకో అనుకుని కబురు చేయవచ్చు. అందులో, అరుణ ఏమయిందోనని కంగారుపడి తప్పకుండా కబురు చేస్తుంది.

శుష్కంగా కనిపించిన కూతుర్ని చూసి, "ఏం అలా వున్నావు? పోనీ ఈ పూటకి మానేయి" అంది కాంతమ్మ. "మీరా అదివరకంత ధైర్యంగా కనిపించటం లేదు. దానికే బెంగగా అనిపిస్తుందేమో! బెంగ కాదూ? ఎల్లకాలం రోజులిలా ఒంటరిగా నిశ్చింతగా వెడతాయా? అప్పుడు ఆ మమకారంతో తనేం చెప్పినా బుర్రకెక్కలేదు... ఏమందామన్నా లేదు కదా! కస్సుమని లేస్తుంది. ఏడుస్తూ పడుకుంటుంది. భగవంతుడా! మా జీవితాలు ఎందుకిలా చేశావు? నా అదృష్టమే దానికీ పట్టాలా?...."

"ఎందుకూ మానేయటం! ఒక్క పది రోజులు ఓపిక పట్టి వెళ్ళానంటే అరుణ వెళ్ళగానే మానేస్తాను - ఆ పిల్లలు నాకు వినట్లేదు - నాకు సమస్య అయిపోయారు" తనకు తాను చెప్పుకున్నట్లుగా అని దొడ్లోకి వెళ్ళిపోయింది.

"ఏమిటో దీని ధైర్యం- ఒక్క మాట వినదు కదా! దానికేం లోటు చేశాను? అసలేం జరిగిందో కూడా కన్నతల్లిగా ఒక్క విషయం కూడా తెలుసుకోలేకపోయాను. కన్నతల్లితో చెప్పుకుని కొంత భారం దించుకుంటారు. తనకి ఆ అదృష్టం

లేక ఎంత కళ్ళి కళ్ళి ఏడవలేదు, అప్పుడు దొడ్డమ్మే ఆదుకోకపోతే—"

"పాల్ పాల్" అంటూ గ్లాసు పట్టుకుని వచ్చేడు విజయ్.

ఆ పక్కనే వున్న చిన్న పీట వాల్చి పాలు కలిపింది కాంతమ్మ. పీటమీద కాని వాడు కూర్చోడు. ఆ పీటే కావాలి. ఆ పీటమీద ఎవరు కూర్చున్నా వూరుకోడు.

"చా చ్చా" అన్నాడు. చెంచా ఇచ్చింది. పర్వాగ్గా వున్నా వాడు వూరుకోడు. పది గంటలయిందంటే పళ్ళెం పట్టుకుని కూర్చుంటాడు. వాడికి ఆకలేసిందంటే ఒక్క నిముషం ఆగడు. కడుపులో ఆహారం పడిందంటే ఏదో ఒకటి సవరిస్తూ అల్లరే తప్పితే ఏడవడు. వాడికేమీ అందకుండా వుంచేసరికి కాంతమ్మ ప్రాణం విసిగిపోతుంది: "వాడేం చేశాడు వాటిని విసుక్కుంటే వాడికేం తెలుస్తుంది? అన్నీ సవ్యంగా వున్నచోటే వాడు పుడితే నేలమీద నడవనిచ్చే రూపమా! తను కొన్నాళ్ళ కన్నా మంచి రోజులు రాకపోతాయా అని ఆశతో ఎదురు చూసేది. దాని జీవితానికి అదీ లేదలా వుండ" అని బాధపడింది.

మీరా చెప్పులేసుకొంటోంటే విజయ్ వచ్చి కాళ్ళని చుట్టేశాడు. వాడిని ఎత్తుకుని ముద్దు పెట్టుకుని దించింది. వాడు "టాటా" అన్నట్టు చెయి వూపాడు.

మీరా కూడా చేయి వూపి వెళ్ళిపోయింది.

మీరా వెళ్ళేసరికి ఇల్లు నిశ్శబ్దంగా వుంది. మీరా కాంతమ్మగారి గదిలోకి వెళ్ళింది. ఆవిడ అప్పుడే లేచిందిలా వుంది. మంచంమీద కూర్చుంది. చాలా నీరసంగా వుంది. ఆవిడని ఎలా వుందని పలకరించి వంట గదిలోకి వచ్చింది.

అరుణకి కాఫీ ఇచ్చి మిగతాది ఫ్లాస్కులో పోస్తోంటే "చినబాబులేడు. అప్పికి ఇచ్చేయి" అంద కాంతమ్మగారు.

"అదేం ఎక్కడికి వెళ్ళాడు అప్పుడే" అని అడిగింది అరుణ.

"తెల్లారగట్లే వెళ్ళిపోయాట్ట! నన్నూ లేపలేదు. అప్పితో చెప్పి వెళ్ళిపోయాట్ట."

కాంతమ్మగారు చెప్పినట్టుగా అప్పిని పిలిచి కాఫీ ఇచ్చేసింది మీరా.

(సశేషం)



కులపతి కొడవటిగంటి కుటుంబరావు

కొడవటిగంటి కుటుంబరావుగారు కాలధర్మం చెందారనగానే (17-8.'80) తెలుగునాట సాహిత్యోద్యమాలకు పెద్ద దిక్కు లేకుండా పోయిందనిపించింది నిత్య నూతన సాహిత్యోద్యమాల సూత్రకారునిగా జీవితకాలమంతా పనిచేశారు. సమరశీల సమాజంలో అభివృద్ధి చెందుతూన్న అభ్యుదయశక్తులకనుగుణంగా సాహిత్య వ్యాసంగాన్ని మలవడానికి అవిరామకృషి చేశారు. సామాజిక వికాసంలో సాహిత్యంకూడా తనవంతు పాత్రను నిర్వహించాలని కొత్త తరాలను హెచ్చరిస్తూ పోయారు. సమాజానికీ, జీవితానికీ గల అవినాభావ సంబంధాన్ని రచనా వ్యాసంగంలో స్పష్టంగా, సరళంగా వివరించారు. ఎక్కడా ఎలాంటి మడతపేచీ లుండేవికావు. చెప్పాల్సింది దాల సూటిగా చెప్పేవారు. అలాంటి గద్య విద్యతో ఒక తరం రచయితల్ని ప్రజాభిముఖంగా తయారుచేసి వదిలారు. అలా వారు తెలుగునాట కులపతి స్థానాన్ని పొందారు. కాలానికి లొంగని కాలజ్ఞానం వారిది. వారి కాలధర్మం తీరని లోటు.

కుటుంబరావుగార్ని తెలిసినవారంతా ముఖ్యంగా అభిమానులు కొ. కు. అంటారు. అది వారి పేరుకు సంక్షిప్తరూపం అయినా వారి వ్యాసంగాన్నిబట్టి అది 'కొ'త్త తరానికి 'కు'లపతిగా మిగులుతుంది.

వారి సాహిత్య వ్యక్తిత్వమే విపరీతాల మధ్య నిలిచింది. ఆ రోజుల్లో ఒకవైపు పద్యానికి పట్టంగట్టే భావకవుల ప్రేయసీ జ్వరాల ఇష్టారాజ్యం కొనసాగేది. మరోవైపు ఆధునిక భావాల పేర సెక్సు స్వేచ్ఛ స్త్రీ స్వేచ్ఛగా చలామణీ అయ్యేది. ఇంకోవైపు కాలాన్ని వెనక్కి నడిపించే చాతుర్వర్ణ్య ధర్మం జాతీయ సంస్కృతిగా ముందుకు వచ్చేది. వీటికి భిన్నంగా మానవతావాదం పేరిట ప్రజల

క్రియాశీల శక్తిని దెబ్బతీసే హృదయ దౌర్బల్యం నవలా సాహిత్యంలో స్వీయ మానసిక ధోరణిని ప్రవేశపెట్టేది. ఇవి చాలవన్నట్లు అపరాధ పరిశోధక భయానక బీభత్సాలు కొత్త తరాల్ని భ్రమాందోళనలకు లోను జేసేవి.

అటు చూస్తే ఊర్వశులు, శశికళలు; పద్మావతులు (భావకవులు), ఇటు చూస్తే ధర్మం నాలుగు పాదాలా నడవాలనే ఏకపక్ష సాంప్రదాయ వాదాలు (విశ్వనాథ వేయిపడగలు), చలంగారి విశృంఖల సెక్సు మైదానాలు తెచ్చిపెట్టిన కాపిటలిస్టు వెర్రికేక ఒక విపరీతానికి దారితీస్తే జీవన దౌర్బల్యాన్ని ప్రతిబింబించే బుచ్చిబాబు గోపీచంద్‌లు మరోవైపు దారి తీశారు.

భావకవిత్వ పలాయనవాదానికనుగుణంగా వచ్చిన కాంతం కథలకీ (మునిమాణిక్యం)లేచిపోవడాన్నే స్త్రీ స్వేచ్ఛగా చిత్రించే సెక్సువికారాలకీ మధ్య తెలుగుకథ ఊపిరాడక చచ్చింది-


కొ.కు వీటన్నిటా తిరిగి చేతులుకాల్చుకున్నారు-ఈవైపరీత్యాల మధ్య జీవితాన్ని జీవితంగా చూపే సత్యాన్వేషణలో బయల్దేరారు- తనకు తెలిసిన మధ్య తరగతి వారి పరించైనా అభూత కల్పనలు లేకుండా, పచ్చిబూతునే జీవితం చేయకుండా, కనిపిస్తున్న జీవితాన్ని కనిపించేట్లు రాసి ప్రపంచగమనానికి జీవితాన్ని ప్రతిబింబంగా చూప ప్రయత్నించారు-

కవిఐనవాడే కథలు రాయాలనేమూఢ నమ్మకాలరోజులవి-రాస్తే ప్రేయసికథలే రాయాలనే వాతావరణం ఇంకాకొవ్వలివారి అపూర్వచింతామణుల ప్రభావంచావలేదు మాయావిమనోరమల అద్భుతాలు దారి తప్పిస్తున్నాయి.

ఈ సందర్భంలో పద్యాలనుండి రచనా వ్యాసంగాన్ని వచనంవైపు, అందునామామూలు వాడుకభాషవైపు మళ్లించడం సాహసం-ఏడ్రదే కాలూలేకుండా ఇంగితాన్ని ముందుకుతెచ్చిమధ్య తరగతికొంపల్లోనూతనశక్తులఆవిర్భావంగురించి చర్చించడం నాటి రస నిష్పత్తికి సరిపోనిమాట-పైగా శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి సంస్కరణ వాదం కథలు, మల్లాది రామకృష్ణశాస్త్రిగారి జాను తెనుగుశోభ, వేలూరి శివరామశాస్త్రిగారి కథలకావ్యదృష్టి, విశ్వనాథ, బాపిరాజుల కవితావేశం, ఎంకి పాటలగాలిదుమారం, శివశంకరశాస్త్రి నవీనఛాందసం, సాహిత్యోద్యమాల్లో బలమైన శిబిరాలూ స్థాపించుకున్నాయి-అయినా కొ.కు. అధైర్యపడలేదు-అన్ని చోట్లకీ పోయాడు-నచ్చనిది నిర్మొగమాటంగాచెప్పాడు అనాటి మైనారిటీ వాణి ఆ తర్వాత సాహిత్యలోకంలో మెజారిటీని సృష్టించింది-జీవితమంటే అభూతకల్పనా కాదు- తెలియని యక్షప్రశ్నా కాదు - అది మనం సృష్టించుకున్న పొడుపుకథ-మనమేవిప్పదీయాలి అనిస్పష్టంగా సాహిత్య సూత్రీకరణలు చేసి కొత్తవారి వీపు చరిచి ప్రత్యామ్నాయ సాహిత్య లోకాన్ని సాంఘిక వికాసంలో భాగంగా సృష్టించి ఒక యుగానికి కులపతి అయ్యారు కొ.కు.

నేల విడిచి సాము చేస్తేనే కాని సాహిత్య సృష్టి కాజాలదనే భావం బలపడిన రోజుల్లో, భాషలో భావంలో శైలిలో వస్తువులో సులభగణితాన్ని ప్రవేశపెట్టి రచన బ్రహ్మ విద్య కాదని, శరపరంపరగా కథలు రాసి కొ కు. కొత్తరచయితలకు ఆత్మస్థైర్యాన్ని కలిగించారు-

అంతే కాకుండా అంటూ సొంటూ పనికి రాదనే ఛాదస్తపు మడి ముంగిళ్ళలో జీవితపు విలువల కొత్త జిజ్ఞాసల చిచ్చు రగిలించారు. ప్రపంచవ్యాప్తంగా వస్తూన్న విప్లవాత్మకమైన మార్పుల్ని "అరుణోదయం" గా మధ్య తరగతి చదువరులకు అందించారు-జీవితపు అశాంతి తొలగాలంటే సాంఘిక సంక్షోభం పోవాలని ప్రతి రచనలో . ఏదో రూపంలో వాదించారు-ఇటు అస్పష్టతని అటు హృదయ దౌర్బల్యాన్ని



తిరస్కరించి జీవిత వాస్తవికతని సూచించారు. అలాగే ఆధునికత పేర చొచ్చుక వచ్చే వికృత నినాదాలైన సెక్సు స్వేచ్ఛను, ఉత్తి ప్రయోగ వాదాన్ని సామాజిక సంక్షోభంలో భాగంగా చూపి విలువల పోరాటం కోసం చదువరుల్ని ఆలోచింప చేశారు - ముందుకు నడిపించే సామాజిక గుణం లేని రచనను ఉత్తి చెత్తకింద కొట్టి పారేశారు-అందువల్లే అభ్యుదయ సాహిత్యోద్యమ నిర్మాతల్లో ఒకరయ్యారు.

తెలుగు సమాజం ఫ్యూడల్ భావాలతో ఒక వైపు కుంగిపోతూ మరో వైపు మార్పు పేరిట పెట్టుబడిదారీ సమాజలక్షణాల్ని వెర్రి కేకలతో ఆహ్వానిస్తూన్న కాలంలో సాహిత్యోపాధ్యాయునిలా అసలు జీవితపు "చదువు" అంటే ఏమిటో సామాజిక పరిణామ క్రమంలో వివరించి చెప్పారు- సంస్కార సాహిత్యం వల్ల లోన పని చేస్తున్న "కురూపి"ని ఎత్తిచూపి మనిషి మొదట స్వస్వరూప జ్ఞానాన్ని ఆత్మసంస్కారాన్ని అభివృద్ధి చేసుకోవాలని హెచ్చరించారు-"అనుభవం" అనేది వ్యక్తి విశేషం కాదు సామాజిక లక్షణ ప్రతిరూపం-రెంటి మధ్య ఎదురయ్యే సమస్యల్లోంచి చేదు నిజాల్ని వెలికితీసే విజ్ఞానాన్ని సమకూర్చుకోవడమే జీవితానుభవం అన్నారు కొ.కు.-

సంస్కారం ఏ విధంగా జన్మసిద్ధ లక్షణం కాదో ఆ విధంగానే పై వర్గాల గుత్త సొత్తు కాదని కుండబద్దలు కొట్టారు కొ.కు. అది విలువల పోరాటాల వల్లే అభివృద్ధి చెందుతుందని సాపేక్షకలక్షణాన్ని సూత్రీకరించారు-జీవితాన్ని సమాజంగాను సమాజాన్ని జీవితంగానూ తరచి తరచి చూపారు కొ.కు- ఏదీ అతీతం కాదనీ, బింబ ప్రతిబింబ భావమే సాహిత్య వికాసం అని వివరించారు.

కొ.కు. ప్రవేశపెట్టిన జీవితవాస్తవికత సాహిత్యంలో క్రమంగా పోరాటవాస్తవికతగా అభివృద్ధి చెంది సోషలిస్టు వాస్తవికతగా స్థిరపడింది.

ఇక్కడే కొ.కు-సాహిత్య మహోపాధ్యాయు
లయ్యారు-కాలక్షేప సాహిత్యానికి కాలదోషం
పట్టించి "కమిటెడ్"రచనా వ్యాసంగానికికూడా
ఆద్యులయ్యారు- వారునినాదాలహోరులోలేకుం
డానే విప్లవ సాహిత్యోద్యమానికి పునాదులు
వేశారు-"కులంగాడికి అంత్యక్రియలు" జరిపి
మధ్యతరగతి"దుష్టగ్రహాలకు"జీవన నిర్దుష్టతను
నేర్పారు-" కొత్తఅల్లుడి"కి కొత్తకోడలు"కి
మార్పుప్రతిరూపాల్ని చూపారు-

పెద్దల్ని పిల్లలుగా మార్చి పాతకథల్నితవ్వి
జీవితపు వెలుగుల్ని చూపడంలో కొ.కును మిం
చిన దిట్టమరిలేరు-అందువల్లే "చందమామ"
పిల్లల బొమ్మల పత్రికఅయినా పెద్దలబుద్ధుల్ని
తీర్చిదిద్దింది-కాలక్షేపంలో కాలజ్ఞానం ధ్వనిం
చింది-భేతాళకథల్లో భూతభవిష్యత్ వర్తమానా
లు ప్రతిబింబించాయి - రాజనీతిలో ప్రజానీతి
కనిపించింది- యక్ష ప్రశ్నల్లో లక్ష సమస్యలు
బయటపడ్డాయి-వారుకొత్తరకంపంచతంత్రాన్ని
ప్రపంచతంత్రంగా మలిచారు-తిక్కనగారి అను
వాదంలోనైనా విశృంఖలతకనిపిస్తుందికానికొ.కు
గారి ఉపాఖ్యానవ్యాఖ్యానంలోసమకాలీనతస హే
తుకంగా ప్రతిధ్వనిస్తుంది-ప్రాచీనకథా సాహి
త్యం మీదవారికున్నంత పట్టు మరెవరికీ లేదు-
భారతభాగవతరామాయణ పురాణాల్లోంచికథలు
వెలికితీసి వెలకట్టారు-బాలకథా సరిత్సాగరాన్ని
సృష్టించి ఇంటింటా బుద్ధిబలాన్ని పెంచారు-
ఇది సామాన్యమైన కృషి కాదు-కొన్ని విశ్వ
విద్యాలయాలు చేయలేని పనిని ఒక్కరు కేవలం
ఒక్కరు చేశారు-తెలుగుదేశంలో "చందమామ
రావే కో.కు కథలు తేవే"అనేట్లుగావారు బుద్ధి
వెన్నెల కాశారు -


వారు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం దివాలా
కోరుతనాన్ని చూశారు-"పిబ్బరాజ్యం" కథల
విరాట్ స్వరూపాన్ని వ్యంగ్య వ్యంగ్యాలుగా
బిగించి పదునైన చెంపదెబ్బల్నికొట్టారు-హాస్య
రసం అంటే ఏదో ఛుక్కాయాసపుచమత్కారం
గానో, పార్వతీశంవిశేషలుగానో, గిరీశంలెక్చర్లు
గానో. మునిమాణిక్యం ప్రణయకలహంగానో,
భమిడిపాటి కాలక్షేపంగానో, అని మనకుసంక్ర
మించింది-కానిజంఘాలశాస్త్రి(సాక్షి-పానుగంటి)
"సాంఘికస్పృహ"రానురాను బొత్తిగాపోయిం
ది-దాన్నితిరిగి లేవనెత్తి ఏజంఘాలశాస్త్రీ అవ
సరంలేకుండా నేరుగా నేటి "దిబ్బరాజ్యం"
మీదవిరుచుకపడ్డారు కొ.కు.

ఏ వేదిక ముందుకు వచ్చినా దాన్ని విని
యోగించుకునే విజ్ఞత కొ.కు. లో వుంది -
మహాకవులిక్కడ తప్పిపోయారు-

సాహిత్య వ్యాసంగాన్ని రాజకీయ నిర్మా
ణాన్ని కలగాపులగం చేస్తున్న విప్లవాభి
మానుల విపరీతధోరణుల్ని చూసి రెండింటికీ
మధ్యవుండాల్సిన "విభజనరేఖల్ని" గీసి కార్య
క్షేత్రాన్ని నిర్మోహ మాటంగా నిర్ణయించారు.
నిబద్ధత-నిమగ్నత"తో కొట్టుమిట్టాడు తూన్న
విజ్ఞతా శూన్యులకు చరిత్రగతిని చాటిచెప్పారు-
కొందరి సీసాలో బందీకావడం రచనావిస్తృతికీ
సమకాలీనతా ధర్మానికీ ఆటంకం అని భావిం
చారు-దీనివల్ల అలిగినవారుగ్రంథాలురాశారు-
వారి"ఇన్‌ఫాలిబుల్" సూత్రీకరణలో ప్రాప్త
కాలజ్ఞతా లోపాన్ని వివరించారు-

మూడు తరాల సాహిత్యోద్యమాలతో తల
పండిన కొ.కు.వ్యక్తులకంటే సంస్థలుగొప్పవని
కొందరు వ్యంగ్యాలుబిగించినా సంస్థలు తప్పు
దారి పట్టినప్పుడు ఉద్యమాలు సంస్థలకన్నా
గొప్పవని కొ. కు కార్యాచరణలో తేల్చారు.
తానే ఉద్యమంగా ప్రతిధ్వనించారు-

కథకుని మించిన నిర్మాణం కొ.కు.లో
వెలుగుతుంది. అది సన్నివేశాల్లో కాక ఇతి
వృత్తం కుదింపులో ప్రతిబింబిస్తుంది.
విమర్శకుని మించిన వివేచన కొ.కు. ప్రతి
వాక్యంలో ప్రతిధ్వనిస్తుంది. అది చరిత్ర
కారుని వ్యాఖ్యానంలా పంక్తుల మధ్య సామా
జిక నైజాన్ని బయట పెడుతుంది. అంతటి



నిర్మొహమాటం అంతటిని విషయ పరిజ్ఞానం
అంతటి బాధ్యతాయుత చింతన భవిష్యత్తు
మీద పరిపూర్ణమైన ఆశ వర్తమానం మీద
చదువు, గతం మీద యుద్ధం, త్రికాలాల్నీ
పుక్కిటపట్టే బుద్ధిబలం మరెవరిలోనూ కని
పించదు. పద్మ వ్యూహం లోకి ప్రవేశించి
దాన్నీ, దాని నిర్మాతల్నీ బద్దలు కొట్టే బుద్ధి
బలం, చొరవ సాహసం వారికి వుంది. విక్ర
మార్కుడి కథలు రాస్తూ, వాడిలా సమస్యల
శవాల్ని మోయలేము. మొదట శవాల్లా వేలాడ
దీసిన వాడి అంతు కనుక్కొచ్చి ఆ తర్వాత
వేలాడుతున్న శవానికి దహన సంస్కారం
చేసి విక్రమార్కుణ్ణి పిలిచి ప్రజల్నే నమ్ముకో,
వారే నీకు సింహాసనం ఇస్తారు- శవాల్ని
నమ్ముకొంటే మిగిలేది శ్మశానమే అని బ్రహ్మ
ముడి విడదీశారు కొ.కు.

బుద్ధివాది హృదయవాది కాదు.
బుద్ధి బలానికి హృదయ దౌర్బల్యానికి
పొంతన చాల మటుకు కుదరదు. అందువల్లే
వారి రచనల్లో సెంటిమెంట్లు లేవు. ప్రకృతి
వర్ణనలు పాత్రల్ని మింగేయడానికి రాలేదు.
వారు ఎక్కడా సన్నివేశాన్ని ఆపి నాటకీయ
తను ప్రవేశపెట్టి పాత్రల్ని రెచ్చగొట్టి చదు
వరుల్ని ఉద్రేకాలకు లోను చేయరు- ఇలా
చేస్తే వస్తు ప్రయోజనం దెబ్బ తింటుందని
కొ కు. విశ్వాసం కాబోలు-జీవితపు ఉద్యో
గాల్లో కూడా వారు గుండెను పక్కకు పెట్టి
బుద్ధికి పదును పెట్టారు. ఉప్పు కారం చీము
నెత్తురు బుద్ధితో చూడాలిగానిగుండెతో కాదనేది
వారి దృక్పధం-ఈ వైఖరి సాహిత్య ప్రపం
చంలో చాల తక్కువగా కనిపిస్తుంది. అభి
వృద్ధి చెందుతూన్న సమాజంలో బెర్నార్డ్ షా
దృక్పథం తక్కువ ప్రభావాన్ని ఇస్తుంది-
ఇక్కడ ఉద్రేకాలెక్కువ-ఉద్రేక విషయాల్ని
ఉద్రేకంగానే చెప్పాలి-ఆ కొరతను పూరించ
డానికి రావిశాస్త్రి రాక తప్పలేదు. కొ.కు.

నిప్పును రాజేసే చెకుముకి – రా వి శా స్త్రి మంటల్ని ఎగదోసే గాలి_కాళీపట్నం నివురు గప్పిన నిప్పు. ఈ యిద్దరూ రావడానికి కొ.కు. గారే మూలం.

మేధావి అనేవాడు సమరశీల సమాజంలో ఒక నిరంతర పోరాటం అంశమే గాని ఏనాడో పోరాడి ఆగిపోయిన పోరాట సంస్మరణ కాదు—నిత్యనూతన సామాజిక అవసర్థాలలో క్రియాశీలి మేధావి – తటస్థ వ్యాఖ్యాత కాదు-ఈ విషయంలో కొ. కు. తనకు తానుగా ఏర్పరచుకొన్న పరిమితులు ఆయన బుద్ధి నైశిత్యాన్ని క్రమంగా పరిమితం చేసి భ్రమలకు తావునిచ్చాయి ఈ ఒక్కమచ్చను మినహాయిస్తే కొ. కు. తెలుగునాట పిన్నలకే కాదు పెద్దలకూ చందమామలో పీఠం వేసుకొని పాఠాలు చెప్పే గుణశాలి. వంతులవారీగా ప్రాణాల్ని భోంచేసే సింహానికి అంత్యక్రియల్ని ఆలోచించే చెవుల పిల్లిగా కొ. కు. చందమామలో దర్శనమిస్తారు. నాలుగు సింహాల దిబ్బ రాజ్యాన్ని కూల్చడానికి ఆలోచిస్తున్నట్లు ఏకాగ్రతలో కనబడతారు. వారిది అపూర్వమైన వ్యక్తిత్వం.

భావోద్వేగ వ్యాపారంవల్ల అభిమానులలో కవి గాఢమైన ముద్ర వేస్తాడు. అభిమానుల్ని ఆలోచించకుండా చేసి తన వెంటబడేటట్లు చేస్తాడు – వచన రచయిత తర్కాన్ని ఆశ్రయించి కేవలంబుద్ధిశాలుల్ని వెతుక్కుంటాడు. కవి ఈ విషయంలో తళుక్కున మెరిస్తే – రచయిత మెరవకుండానే వెలుగు స్పృహను కలిగిస్తాడు. కవి ఒక భావావేశం – రచయిత జీవన వ్యాప్త సన్నివేశం – కవి భక్తుల్ని లేదా శిష్యుల్ని సంపాదించుకొంటే రచయిత విశ్వాసపాత్రుల్ని సమకూర్చు కొంటాడు – కవి దూసుకపోయే-బాణం – రచయిత ఆవహించే విజ్ఞానం.

ఇది సర్వసాధారణ సాహిత్య నైజం కాకపోయినా శ్రీశ్రీ, కొ. కు. గార్లను చూశాక స్ఫురించే సాహిత్య మీమాంస-శ్రీశ్రీది భావావేశం-దానికి నిలకడ తక్కువ-కొ. కు.గారిది విజ్ఞతా విశేషం. దానికి నెమ్మది ఎక్కువ. శ్రీశ్రీ జనావసరమైతే కొ.కు. యుగావసరం-శ్రీశ్రీ నాంది - కొ.కు. ఇతివృత్తం. శ్రీశ్రీ ప్రేరణ – కొ. కు. నిర్మాణం. శ్రీశ్రీ రస నిర్దేశం - కొ. కు. ఉద్యమ బాధ్యత.

వారు కథా కథనంలో వర్తమానాన్ని భవిష్యత్తుతో ముడివేసి గతాన్ని భూస్థాపితం చేశారు. నేటి జీవితం మోస్తూన్న గతమనే శవాన్ని కిందకు దించి అంత్యక్రియలు చేయడానికి చివరిదాకా కృషి చేశారు. వారి నాడీ నిదానం అసాధ్యం - వారు సామాజిక రుగ్మతల్ని జీవితంతోచూపే సామాజిక భిషక్కులు. వారు మధ్య తరగతికి ప్రాణవాయువు.

కొ.కు. కథలో ప్రాప్తకాలజ్ఞత ప్రతిధ్వనిస్తే, వ్యాసంలో క్రాంతదర్శిత్వం ప్రతిబింబిస్తుంది. వారు కథాయాత్రలో అలసినా వ్యాస రచనలో ఎన్నడూ విశ్రమించలేదు. సమరశీల సమాజంలో ద్రష్టగా నిలిచి స్రష్టగా మనుగడ సాగించారు. వారు కాలధర్మాన్ని పాటించిన యుగధర్మం.

వారు ఎత్తిన కలం దించని యోధులు-నమ్మిన మార్గం వదలని కథా యాత్రికులు-రచించే జీవితాన్ని విస్మరించని స్రష్టలు-'యువ'తరం రచయితలకు నిబద్ధతా మార్గాన్ని స్పష్టం చేసిన ద్రష్టలు. గతానికి వ్యాఖ్యాతలు. ప్రస్తుతానికి అక్షర నిర్మాతలు-భావికి ఆశయాల సంధాతలు.

అంతటి కులవతి కన్నుమూత ఉద్యమాలకి తెర దించివేత కారాదు-అప్పుడే వారి అవిరామ సాహిత్య మూర్తిత్వానికి నిజమైన శ్రద్ధాంజలి కాగలదు.

—జ్వాలాముఖి

ఛాయాచిత్రం

ఆర్. యస్. కృష్ణమూర్తి

అద్గదీ! అప్పుడొచ్చింది ఫ్లాష్‌లా ఆలోచన.

○ ○ ○

ఈ ఇరవయ్యో శతాబ్దపు నవనాగరికపు పరుగుల్లో, ముందుకు తోసుకు పైపైకి పోయే తొందర్లో—

మిట్ట మధ్యాహ్నపు వెలుగులోనే చీకట్లను వెదికే మనం కళ్ళెదురుగా వున్నవికూడా చూడలేని వెన్నో—

సామాజిక రుగ్మతల్ని వెతికి వెలికి తీసి చూపి, సమకాలీన సమాజానికి దర్పణం పట్టేది కళ!

సాంఘిక అసమానతలను సెంటీమీటరు తయామీటరు గాజుముక్క లోంచి, కాగితం మీదకు కావాల్సినంత పెద్దది గానూ లేదా కావల్సినంత చిన్నదిగానూ కట్టిపడేసి చూపించే కళ—ఫొటోగ్రఫీ!!

ఇందులోనూ పరుగూ, వేగం....ఎవరు ముందు? అందుకే ఈ పందెం. పరుగు పందెం లేదా ఫొటోగ్రఫిక్ కంటెస్ట్.

టాపిక్ - జీవన పోరాటంలో మానవుడి ఆరాటం!

విజేతకు వినూత్న అవకాశం!...కళా ప్రశంసతో పాటు నగదు వెయ్యి నూట పదహార్లు!!

జగన్నాథం ఫొటోగ్రాఫర్ — ఆర్టిస్టిక్ ఫొటోగ్రాఫర్. జీవితాన్ని ఎంతో చాకచక్యంగా, ఎంతో చాతుర్యంతో ఫొటో ఫ్రేంలో బిగించగల నేర్పరి.

జగన్నాథానికి జీవితమే ఒక ఛాలెంజ్. ఎప్పుడు అతను ఛాలెంజ్‌నే ఛాలెంజ్ చేస్తాడు. అందుకే 'సై' అన్నాడు.

చాలా శోధించి సాధించాడు.

ఎంతో మంది చూడలేని, చూడని దాన్ని జగన్నాథం చూశాడు. అవును....అక్షరాలా అదే రూపం!

జగన్నాథం చూసింది మరెక్కడో కాదు. అందమైన అద్దాల బీరువాలో—

నీటుగా నిల్చున్న సాహిత్య ప్రపంచంలో-

బంధించబడి వున్న 'మహా ప్రస్థానం' లో.

అద్గదీ! అప్పుడొచ్చింది ఫ్లాష్‌లా ఆలోచన!

"శ్రీశ్రీ! థేంక్యూ శ్రీశ్రీ" అనుకున్నాడు జగన్నాథం.

○ ○ ○

బ్లాక్ అండ్ వైట్‌లో, లైఫ్ సైజు ఫ్రేములో మెజస్టిక్‌గా నిల్చుంది ముష్టి ముసిలిది — జగన్నాథం ఎంట్రీ!

ఎంగిలాకుల్లో మెతుకులు ఆత్రంగా దగ్గరకు తీసుకుని ఆబగా, ఆరాటంగా నోట్లో కుక్కుకుంటూంది. కాంతి లేని గాజు కళ్ళలో దైన్యం, భయం, తొందరపాటూ తొంగిచూస్తూ వుంటే, కుక్కతో, ఎంగిలాకుతో పోటీ పడుతూ - సర్వ సజీవ కోటితో సమానత్వం ప్రతిబింబిస్తూంది!



జగన్నాథం పరికించి చూస్తున్నాడు.

అందరి తలలూ ఊగినా ఒకటే, ఊడినా ఒకటే, జడ్జీల తలలు వూగాయా లేదా?.... యస్, యస్! దిస్ ఈజ్ ది ఎంట్రీ!...అవును...ఇదే బహుమతి పొందిన, కళలు పొంగిన, ఎముకలు కుళ్ళిన భిక్షువర్షీయసి చిత్రం. అది బహుమతి పొందడంతో లేనేలేదు చిత్రం పొందక పోతేనే విచిత్రం!

కళా ప్రశంసలు...అభినందనలు అందుకున్నాడు జగన్నాథం చిద్విలాసంగా. వెయ్యి

నూట పదహార్లు జేబులో దోపుకున్నాడు సంతోషంగా. మనసు నిండా ఆనందం

నవ్వుకున్నాడు మనసారా.

మనస్సు కుళ్ళిన మానవులారా ఛావండి!

ఆనందంగా కారు డోర్ తెరిచి స్టీరింగు ముందు కూర్చున్నాడు-పక్కనే తన అసాహీ పెంటాక్స్ కెమెరా. మనిషి తలను తడిమినటు ఆప్యాయంగా తమెరాను తడిమాడు.

ఆగండాగండి! ఏమిటి వీడు—ఈ రచయిత గాడు!

ఫొటోగ్రాఫర్‌కి—కారా?

యస్! వై నాట్?...యూ డోంట్నో?

జగన్నాథం ఈజే లేఖియర్?

ఫొటోగ్రఫీ?....అతని హాబీ.

హౌవండర్‌ఫుల్! అంత పెద్ద వాడు, ఇంత చిన్న విషయం మీద—అదే, సాంఘిక అసమానత-ఆసక్తి చూపించటం ఎంత గొప్ప విషయం? ఎంతైనా హర్షదాయకం కాదూ?....యస్. యస్.....ఏథౌజండ్ టైమ్స్ యస్!

జగన్నాథానికి అందుకు కూడా ఆనందంగా వుంది. అతనేది చేసినా సిస్టమేటిగ్గా, సైంటిఫిగ్గా, ప్లాన్‌డ్‌గా చేస్తాడు. అందుకే ఎప్పుడూ అతనిదే జయం.

రండి. మీరూ జగన్నాథం ఇంట్లోగెట్టు గదర్‌కి రండి. మీరూ అతన్ని కంగ్రాచ్యులేట్ చెయ్యండి బట్ డోంట్ వేస్ట్‌హిజ్ వేల్యూబుల్ టైం, కాలం అతనికి చాలా విలువైంది—మీకు కాదు. అందుకే ఆతనికి కారుంది-మీకు లేదు.

జగన్నాథం టైం చూసు కున్నాడు. చీకట్లో రేడియం డయల్ ఎనిమిదిన్నర అంటూంది.

అబ్బ! ఎంత ఆలస్యం అయిపోయింది! అంతావచ్చేసి వుంటారు. ఎంతవేగం అనుకున్నా తెమిలింది కాదు. మైకు ముందు నిల్చుంటే వక్తలకి ఒళ్లుపై తెలియదు. జనాన్ని కురుపుసలిపినట్టు సలిపిగాని వదలరు! అందరికీ తప్పినా, తనకి తప్పలేదు. హరిదాసు పరచుకున్నతివాసీ తనది! ఆఖరుదాకాఆగాలి. ఆసలిటువంటిసభల్లో బహుమతి ప్రదానం ముందు జరిగి పోవాలి. ఆ తర్వాతే స్పీచెస్ ఎట్సెట్రా అనింపార్టెంట్ థింగ్స్!

కారు స్టార్టు చేసి హెడ్‌లైట్లు ఆన్‌చేశాడు. హెడ్‌లైట్లు వెలగటం లేదు. డామిట్! ఏమైంది? ఏమో. రేపు అజంతా గరాజ్‌లో పారేస్తేవాడే చూసుకుంటాడు. ఇప్పుడు టైంలేదు. వేగం వెళ్ళాలి.

ఐకెన్ మేనేజ్, అఫ్‌కోర్స్! నేనుడ్రైవింగ్‌లో ఎక్స్‌పర్ట్‌ని-లైకిన్ ఎవ్విరి అదర్‌ఫీల్డ్!

ఏక్సిలేటరు గట్టిగా నొక్కాడు. ఒక్కదాటుతో గుర్రం లాలంఘించింది జగన్నాథ రథం. రోడ్లన్నీ చుట్టుకుంటూ, చీకట్లో వెలుగు చూసుకుంటూ, సాటిలేని చాకచక్యంతో, జనాన్నితప్పుకుంటూ....

స్క్రీచ్! కారాగి పోయింది.

"ఓర్నాయినో! సచ్చిపోన్రో!"

ఎవరది కారుకింద?— చీకట్లో చీకట్లాల్సిపోయి?

దిగిచూశాడు. ఒక్కసారి తేలిగ్గా నిట్టూర్చాడు.

థాంగాడ్! ఇంకా ఎవరో అనుకున్నా. ఏమైపోతుందోనని కలవర పడిపోయా. గెట్టుగెదర్ అభాసవుతుందని భయపడ్డా. హమ్మయ్య! మరేం పర్వాలేదు.

మొన్న ఫోటో కంటెస్ట్ కోసం వెతికి వెతికి పట్టుకొచ్చి ఎంగిలాకుల్లో పడేస్తే, దానికితెలియకుండా కుక్కని ఉసికొల్పి వదిలేస్తే, కుక్కతో కాట్లాడి, కుక్కతో కలిసి కుక్కలా, ఆత్రంగా భోంచేసిన కుక్కముండే. ముష్టిముండే, మరేం పర్వాలేదు.

గుడ్ రిడెన్స్!- గరీబీ హటావో!

ఎవరూ చూడలేదు.

ఎవరూ చూడ బోరు

నిత్యం చచ్చే పిరికి

ఏడ్చేవాడూ లేడు.

కారుకేం దెబ్బ తగల్లేదు కదా?

నో. కారు కేమీ అవలేదు.

గుడ్! వెరీగుడ్!!

మరింత వేగంతో ముందుకు కదిలిపోయింది జగన్నాథ రథం!

*

పిరికివాడు

పవని.రా. భానుమూర్తి

సుదర్శనం మంచివాడో, చేతకాని వాడో, పిరికివాడో నాకు తెలియదు. నాకు తెలియదు అనడం కంటే నేను చెప్పలేను అనడం సబబు. ఎందుకంటే లోకంలో ఒక్కోసారి మంచితనాన్ని చేతగానితనంగాను మరీ ఒక్కోసారి పిరికితనంగాను జమకట్టడం నేనెరుగుదును. ఎటొచ్చీ నాకింతవరకూ స్పష్టంగా తెలియని విషయం సుదర్శనం ఈ మూడు తెగల్లో దేనికి చెందుతాడనే. బహుశా-ఈ మూడూ అతనిలో ఉన్నాయేమో అని కూడా నాకు అనిపిస్తుంది. ప్రస్తుతం-ఈ చర్చ వదిలి సుదర్శనం కథ చెపితే మంచిది.

సుదర్శనం అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటున్నాడు. కాలేజీ కెళ్ళడానికి అరగంట టైముంది. సుదర్శనానికి తొందర ఎక్కువవుతూంది. తొందర పెరిగే కొద్దీ 'క్రాపు' సరిగ్గా రావడం ఆలస్యమవుతోంది. యింతకీ అతనికెందుకా తొందర?

అంతకు ముందు రోజు సుదర్శనం కాలేజి వదలగానే యింటికి వస్తున్నాడు. ఆ దారిలోనే అనురాధ ఇల్లు. అనురాధ అతని క్లాస్‌మేట్. అయినా, ఇంతవరకూ వాళ్ళిద్దరూ మాట్లాడుకోలేదు. అసలు సుదర్శనంలో అంత చొరవ లేదు. సుదర్శనం అలా వస్తుండగా గేటు వద్ద నిలబడి చూస్తున్న అనురాధ కనబడింది. సుదర్శనం వైపు చూసింది. సుదర్శనం చటుక్కున తల తిప్పుకున్నాడు. అనురాధ ఇల్లు దగ్గరయే కొద్దీ అతని గుండె వేగం హెచ్చింది. కాళ్ళలో వణుకు ప్రారంభమయింది, అడుగులు తడబడుతున్నాయి.

"సుదర్శన్‌గారూ" అనూరాధ పిలిచింది.

సుదర్శనం గుండె వేగం నాలుగుతో హెచ్చవేసినట్టుగా పెరిగింది. మెల్లిగా తల తిప్పి చూశాడు. అనూరాధ రమ్మన్నట్టుగా చేయి ఊపింది. తడబడుతూ వెళ్ళి గేటు ముందు తలవంచుకు నిలుచున్నాడు. అనూరాధ కతని ధోరణి నవ్వు తెప్పించింది. ఐనా ఆపుకుంది.

"నేనీ రోజు క్లాసుకు రాలేదు. ఇంగ్లీషు నోట్సిస్తారా. రాసుకుని రేపిస్తాను" అన్నది.

రేపు అడిగిన ప్రశ్నలకు జవాబియ్యకపోతే యిక క్లాసుకు రానివ్వనని ఇంగ్లీషు లెక్చరర్ చేసిన హెచ్చరిక సుదర్శనానికి జ్ఞాపకం వుంది. తనకు కొన్ని పాఠాలు రావని కూడా అతనికి గుర్తుంది.

"రేపు ఇంగ్లీషు లెక్చరర్ ప్రశ్నలడుగుతాడండీ. నాకు సరిగ్గా రావు. ఈ రోజు నేర్చుకోవాలి. సారీ"

ఈ మాటలు సుదర్శనం అనలేదు. అందామనే అనుకున్నాడు. అనలేకపోయాడు.

ఆ మాటలు గొంతు లోనే ఆగిపోయాయి.

"సరేనండీ" అని నోట్సుతీసి అనూరాధకిచ్చాడు. గబగబా ఎవరో తరుముతున్నట్టు ఇంటికొచ్చి పడ్డాడు.

అందుకే అతనికి ఆ రోజింత తొందర. తొందరగ తయారయి అనూరాధ యింటికెళ్ళి నోట్సు యిప్పించుకోవాలి. ఫస్టవరే ఇంగ్లీషు

క్లాసు. నోట్సు తీసుకొని కాలేజీకెళ్ళేసరికి పది హేను నిమిషాలవుతుంది. మిగిలిన పదిహేను నిమిషాల్లో రాని పాఠాలు నేర్చుకోవాలి. ఇదీ అతని ఆలోచన.

"నాయనా, సుదర్శనా" వంటింటినుంచి పార్వతమ్మ పిలిచింది.

"ఏమ్మా" అన్నాడు సుదర్శనం తల దువ్వుకుంటూనే.

"అలా మార్కెట్ కెళ్ళి కాసినికూరగాయలు తెచ్చిపెట్టు నాయనా. మళ్ళీ నీ కాలేజీకి టైమవుతుంది."

సుదర్శనం ఒళ్లు మండి పోయింది. మార్కెట్ కెళ్ళి కూరలు తేవాలంటే కనీసం అరగంటవుతుంది, యిక అవి తెచ్చి, వంట అయ్యాక కాలేజీకెప్పుడు పోవాలి? నోట్సు ఎప్పుడు తీసుకోవాలి? ఎప్పుడు చదువుకోవాలి?

"ఉదయంనుంచి ఏం చేస్తున్నావ్? ఉదయం చెప్పకూడదా? చెపితే నేను తెచ్చేవాణ్ణి గదా! యిప్పుడు చెబితే నేను కాలేజీకి వెళ్లే దెప్పుడు? నువ్వు వండాలి. నేను తినాలి. కాలేజీకి పోవాలి. పొద్దున చెప్పరాదూ?"

ఈ మాటలు సుదర్శనం అనలేదు. అందా మనుకొన్నాడు. అనలేకపోయాడు.

వంటింట్లోకెళ్ళి సంచీ తీసుకొని, పార్వతమ్మ వద్ద డబ్బు తీసుకొని మార్కెటుకు బయలుదేరాడు.

"బెండకాయలు మరచిపోకు నాయనా" అన్నది పార్వతమ్మ.

"సరే. అన్నాడు సుదర్శనం. ఎవరిమీదో తెలియదుగానీ అతనికి ఒళ్లు మండిపోతూంది. మార్కెట్ కెళ్లాడు.

"వంకాయలెంత?"

"ఎంత కావాలండీ?"

"అర కేజీ."

"ఎనభై పైసలు."

సుదర్శనం అటూ యిటూ చూశాడు. పక్కన ఓ కళ్లజోడు పెట్టుకున్నాయన కూరగాయలు కొంటున్నాడు.

"అరకేజి వంకాలు ఎనభై పైసలా. మనుషులు బతకాలా! చావాలా! మరీ యింత అన్యాయమా. అర్ధ రూపాయికిస్తే యివ్వు లేకపోతే లేదు."

సుధర్శనం ఈ మాటలూ అనలేక పోయాడు.

పక్కనున్న పెద్ద మనిషి ఏమయినా అనుకుంటే! ముప్పై పైసలకి వీడింత ప్రాకులాడతాడని అనుకొంటే! బేరమాడితే అందరూ నవ్వుతారేమో. వాడు చెప్పిన ధరకే వంకాయలు తీసుకున్నాడు సుదర్శనం. బెండకాయలు తెమ్మని తల్లి చెప్పిన మాట గుర్తు వచ్చి మూలగా బెండకాయలున్న దుకాణానికి వెళ్ళి బెండకాయలు తీసుకుని ఇంటికి బయలుదేరాడు. వస్తుండగా ఇందాకటి కళ్ళజోడు పెద్దమనిషి వంకాయలు కొంటూ కనిపించాడు.

"'అర్ధ రూపాయికిస్తే ఇవ్వు. లేపోతే లేదు.' అంటున్నాడు. కూరలవాడు "సరే అలాగే తీసుకోండి సార్" అంటున్నాడు.

సుదర్శనానికి ఎవరిమీదో తెలియదు విపరీతమైన కోపం వచ్చింది. కానీ ఏం చేయగలడు?

యింటికొచ్చి పార్వతమ్మకు సంచీ యిచ్చి, ఆమె కూర వండాక అన్నం తిని కాలేజీకి బయలుదేరాడు. వాచీ చూసుకున్నాడు. అయిదు నిమిషాలు లేటు!

సుదర్శనం క్లాసుకు చేరేటప్పటికి యింకో పది నిమిషాలు గడిచిపోయాయి. అప్పటికే యింగ్లీషు లెక్చరర్ పాఠం మొదలుపెట్టాడు. గుమ్మం వద్ద నిలబడి "మే ఐ కమిన్ సర్" అన్నాడు సుదర్శరనం. గొంతు వణుకుతున్నట్టుంది.

ఎవడో వెనక బెంచీ నుంచి "వచ్చాడ్రోయ్ పిరికోడు" అన్నాడు.

"కమ్ టుద నెక్ట్స్ క్లాస్. డోంట్ డిస్టర్బ్ ద క్లాస్" యింగ్లీషు లెక్చరర్ కోపంగా అన్నాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ సర్. లేటయింది."

"ఎలా అవుతుందయ్యా లేటు. కాలేజీ పైన, పాఠాల పైన శ్రద్ధ వుండి ఏడిస్తే గద. ఊ. రా. రా, కమిన్" నాలుగు క్లాసులకు వినిపించేలా అరుస్తూ అన్నాడు లెక్చరర్.

సుదర్శనం తల వంచుకుని లోపలకు నడిచాడు.

"ఏం? యిరవయి నిమిషాలకే యిలా అరుస్తారే? మీరు అరగంట లేటుగా వచ్చినప్పుడు దానికేమనాలి? కాలేజీ పైనా, పాఠాల పైన శ్రద్ధ లేనిది మీకా? మాకా? నాకు శ్రద్ధ లేకపోతే మీరు పొమ్మనగానే పొయ్యేవాణ్ణి. మీరు ...సనే జీతాలు తీసుకుంటూనే ఏం చెబుతున్నారు? ప్రైవేటులకొస్తే ఫస్టు మార్కులు. ...పోతే ఫెయిలు మార్కులు. మిమ్మల్నే ...లి."

... మాటలు సుదర్శనం అనలేదు. అందా...కున్నాడు. అతని మనసులోమాత్రం యివే మాటలు బిగ్గరగా వినిపిస్తున్నాయి.



పాఠం అయ్యాక ప్రశ్నలడగటం మొదలు పెట్టాడు లెక్చరర్.

"యింగ్లీషులో మీ జ్ఞానం పరీక్షిస్తాను. క్లాసులో ఎవరైనా సరే—ప్రపంచ ప్రసిద్ధి పొందిన యింగ్లీషు యువ కవి పేరు చెప్పగలరా?"

సుదర్శనం లేచి నిలబడి "కీట్స్" అందామనుకున్నాడు.

తప్పంటే! అందరూ నవ్వుతారేమో. అంత మంది ముందు ఎలా నిలబడేది!

"ఏవరూ చెప్పలేరా...." లెక్చరరు.

సుదర్శనం పక్కన కూర్చున్న సుబ్బరాజుతో మెల్లిగా "కీట్స్‌రా" అన్నాడు.

సుబ్బరాజు లేచి నిలబడి "కీట్స్" అన్నాడు.

"వెరీగుడ్, సిట్‌డౌన్" అన్నాడు లెక్చరర్.

సుబ్బరాజు వంక అందరూ గర్వంగా చూశారు. సుదర్శనం తల వంచుకున్నాడు.

తెలుగు క్లాసు జరుగుతుండగా నోటీ సొచ్చింది. "కాలేజీ డే కోసం వక్తృత్వపు పోటీ జరుపుతున్నారు. ఎవరైనా పాల్గొనే వారుంటే పేర్లివ్వమని."

"ఎవరైనా పేర్లిస్తారా" తెలుగు లెక్చరర్ అన్నాడు.

సుబ్బరాజు లేచి తన పేరిచ్చాడు. సుదర్శనం తనూ లేచి పేరిద్దామనుకున్నాడు. కానీ అక్కడ ఏ "టాపిక్" యిస్తారో! ఎంత మందొస్తారో. అంతమంది ముందు మాట్లాడలేక పోతే. కాళ్ళు వణికితే.

"యింకెవరూ యివ్వరా...." తెలుగు లెక్చరర్ అన్నాడు.

సుదర్శనం లేద్దామనే అనుకున్నాడు. కానీ లేవలేదు.

పోటీ జరిగే రోజు సుదర్శనం కూడా వెళ్ళాడు మాట్లాడదామని. కాని అంత మందిని చూసి భయమేసింది. కాళ్ళు వణికి అక్కడే పడిపోతే...?

"విద్యార్థులు-సంఘసేవ" గురించి మాట్లాడమన్నారు.

అందరూ మాట్లాడుతున్నారు. ఏవేవో ఆదర్శాలు వల్లిస్తున్నారు. సుదర్శనానికితనూ మాట్లాడాలనిపిస్తోంది. సుబ్బరాజు మాట్లాడుతున్నాడు.

సంఘమంటే ఏమిటి? మనుషులే.సంఘసేవ చేయని మనిషి ఉండిఏమి ప్రయోజనం? మన నిత్యజీవితంలో ఎందరో పేదలు. అనాధలు కనిపిస్తారు వీరి కందరికీ మనం-విద్యార్థులం సహాయం చేయాలి. అదే సంఘసేవ....ఏదేదో మాట్లాడుతున్నాడు.

"అందరూ మాట్లాడారు: చివరన ప్రిన్సిపాలన్నాడు.

"యింకా ఎవరైనా మాట్లాడతారా...."

సుదర్శనం లేచి నిలబడి మాట్లాడదామనుకున్నాడు.

"ఎంతమంది సంఘసేవ చేస్తున్నారు. ఎంతమంది తమ ఆదర్శాలను ఆచరిస్తున్నారు? పేదలకు, అనాధలకు సహాయం చేసే ఉన్నత గుణం ఎంతమందిలో ఉంది? యివన్నీ లేనప్పుడు సంఘసేవ అనడానికైనా అర్హత లేదు...."

ఏదో మాట్లాడుదామనుకున్నాడు.

కానీ, సుదర్శనం లేవనూ లేదుమాట్లాడనూ లేదు.

కాలేజీడేరానే వచ్చింది. బహుమతులు ప్రకటించారు.

సుబ్బరాజు ఫస్టు.

సుదర్శనం మనసంతా ఎలాగో అయిపోయింది తానూ మాట్లాడితే బాగుండేది అనుకున్నాడు.

మిత్రులంతా సుబ్బరాజును సినిమాకి తీసుకెళ్ళమన్నారు. సుబ్బరాజు సరేనన్నాడు. సుదర్శనాన్నికూడా రమ్మన్నాడు.సుదర్శనం పోకూడదనుకున్నాడు. కానీ, వాళ్ళ వెంట నడిచాడు.

మధ్యరోడ్డులో సుదర్శనం ఓ గుడ్డివాణ్ణి చూశాడు. మనుషులతో, కార్లతో రద్దీగా ఉన్న రోడ్డు దాటడానికి ప్రయత్నిస్తున్నాడు. దాటలేక పోతున్నాడు.

సుబ్బరాజు, సుదర్శనం. మిత్రులు వాడి ముందుకు వచ్చారు. అడుగుల శబ్దం విని. "బాబూ, నన్నవతల వైపు వదులుతారాబాబూ" అన్నాడు.

సుబ్బరాజు యిబ్బందిగా స్నేహితులవైపు చూశాడు. స్నేహితులు" పదరా పోదాం" అన్నారు.

అందరూ ముందుకు కదిలారు, సుదర్శనం తప్ప. సుదర్శనం అక్కడే నిలబడ్డాడు.

అందరూ సందు మలుపు తిరిగే వరకూ అలాగే నిలబడ్డాడు. వాళ్ళలా మలుపు తిరగ్గానే గబుక్కున వాడి చేయి పట్టుకుని "రా తాతా" అంటూ అవతలకి నడిపించసాగాడు.

అక్కడ సుబ్బరాజు మిత్రులతో సినిమా చూస్తూ నవ్వుతున్నాడు. యిక్కడ సుదర్శనం "తననెవరూ చూడ్డం లేదు కదా" అని బెరుకు బెరుగ్గా చూస్తూ అతన్ని రోడ్డు దాటిస్తున్నాడు.

రాజీ

గోపీకృష్ణ

ఇరవై ఆరేళ్ళ జీవితంలో రాజేశ్వరికి మిగిలింది కుక్కి మంచం, శరీరంలో ఎప్పటికీ వదలని రోగం, నాలుగు గోడల మధ్య జైలు లాంటి జీవితం.

భర్తనుంచి ప్రేమ కరువై, తన బ్రతుకు బరువైపోయింది. తన కలల పంట, కన్న కూతురే. ఆమెకు చేరువగా రావడం మానేసి చాలా రోజులయింది. అమ్మ రోగిష్టిది, అంటరానిది అనే భావం నాలుగేళ్ళ 'విజ్జి' లో నాటుకుపోయిందో,లేక ఆ గదిలోకి రావడానికి భయపడుతుందో తెలీదు.

అన్నీ వుండి, ఏమీ లేనట్లు ... ఆ గదిలో ఒంటరిగా ... కుక్కి మంచంమీద శవం లా. రాజేశ్వరి మానసికంగా ఏడాది క్రితమే చనిపోయింది. నిర్లిప్తంగా బ్రతికేయడం అలవర్చుకుంది.

రాత్రి చాలా సమయం గడచిపోయింది.

ఆమెకు నిద్ర రావడంలేదు.

పక్క గదిలోంచి సన్నగా మాటలు వినిపిస్తున్నాయి. గుసగుసలు...నిట్టూర్పులు... శబ్దాలు...

అవి రోజూ ఆమెకు వినిపించేవే. మనసును ఎంత బలవంతంగా అదుపు చేసుకున్నా ఏదో తెలియని బాధ...రంపంతో కోస్తున్నట్లు వ్యథ.

అర్ధరాత్రివరకూ ఆ పక్కగదిలో వాళ్ళిద్దరూ ఆనందంగా గడిపేసి హాయిగా నిద్రలోకి జారుకుంటారు.

రాజేశ్వరికి మాత్రం నిద్రరాదు. అసహనంగా అటూ యిటూ కదిలింది. ఆలోచనలు మెదడును తొలుస్తున్నాయి.

తన సుఖాన్ని ఎవరో లాక్కుపోతున్నట్లు తనని అగాధంలోకి తోస్తున్నట్లు .... తన శోకం కన్నీటి అనంతం.

వెచ్చని కన్నీళ్లు ఆమె చెంపల్ని తడిపేస్తున్నాయి. గుండెల్లో గునపాలు దిగబడిపోతున్నట్లు గిలగిలలాడిపోయింది.

ఇప్పుడు పక్కగదిలోంచి మాటలు వినిపించడం లేదు. ఆమెకు నిద్ర రావడంలేదు. నిద్రను 'కొని' తెచ్చుకోవాలి. ఎదురుగా టేబుల్‌మీద స్లీపింగ్ పిల్స్. రాత్రులు అవి తన పాలిట వరాలు. ఆఖరికి తను నిద్రకు కూడా చులకన అయిపోయింది.

గతం....జీవితపు పుటల్ని తిరగేస్తుంది. కళ్ళ ముందు గడచిన దృశ్యాలు .... గతించిన చిత్రాలు.

"నువ్వు లేనిదే ఈ జీవితం లేదు ... నేను లేను రాజీ" అన్నాడు మోహన్రావు ... శోభనం రాత్రి....మొదటి అనుభవం తరువాత.

రాజేశ్వరి పులకించి పోయింది. అతని మాటలు ఆమె ఊహల్ని కోటలు దాటించేశాయి. కొన్నాళ్ళ తరువాత అవే మాటలు ఆమెను కోటల క్రింద పునాదుల్లో సమాధి చేశాయి.

విజ్జీ పుట్టిన తరువాత .... ఆమె శరీరంలో

మార్పు ... వదలని దీర్ఘరోగం కదలకుండా చేసింది.

అప్పుడూకూడా అతను మారలేదు. ఆఫీసు నుంచి రాగానే ఆమెదగ్గరే కూర్చుని ధైర్యం చెపుతుండేవాడు.

అతనే వంటకు తినేవాడు. విజ్జీకి తినిపించేవాడు. ఉదయం విజ్జీకి స్నానం చేయించేవాడు. ఇంట్లో అన్ని పనులు తనే చేసేవాడు. అతని ఓర్పుని, శ్రమని చూసి ఆమె బాధ పడుతుండేది.

ఆమెకు తెలుసు, భర్తగా అతను సుఖపడలేక పోతున్నాడు. భార్యగా ఉపయోగపడలేక పోతోంది. ఏ సుఖంలేని అతను అలా శ్రమ పడుతుంటే ఆమె భరించలేకపోయింది.

ఎలాగైనా అతనికి శ్రమ తగ్గించాలి. సుఖంగా వుండేట్లు చేయాలి. నాలుగు రోజులు తీవ్రంగా ఆలోచించి ఓ నిర్ణయానికివచ్చేసింది.

ఆ మర్నాడు భర్తచేత తన పుట్టింటికి లెటర్ రాయించింది తన పరిస్థితి వివరిస్తూ, ఓ నాలుగు రోజులు చెల్లెలు నీలవేణి తనకు సాయంగా వుంటుందని, వెంటనే ఆమెను పంపించమని తెలియచేసింది.

"ఇప్పుడు నీలవేణి ఎందుకు, యీమాత్రం శ్రమ నాకు పెద్ద కష్టం కాదు" అన్నాడు మోహన్రావు.

అతని మంచితనానికి రాజేశ్వరి చలించి పోయింది. జన్మజన్మలకూ అతన్నే భర్త కావాలని కోరుకుంది.

కానీ, యిప్పుడు జన్మంటూ వుంటే మోహన్రావుకి భార్య కాకూడదని, అసలు ఆడదానిగా పుట్టించకని కోరుకుంటోంది.

మరో వారం రోజుల్లో నీలవేణి వచ్చింది. అక్కను కౌగిలించుకొని భోరున ఏడ్చింది. విజ్జిని దగ్గరకు తీసుకొని లాలించింది. "ఇకనుంచి యీ యింటి బాధ్యతలన్నీ నేను చూసుకుంటాను నువ్వు దిగులు పడకు అక్కా" అందామె.

రాజేశ్వరి మనసు ఆమెమీద కృతజ్ఞతతో నిండిపోయింది. కానీ యింటి బాధ్యత అంటే తన స్థానాన్ని ఆమె ఆక్రమించుకుంటుందని ఆమె తెలుసుకోలేకపోయింది.

విషయం తెల్సుకొనేసరికి వ్యవహారం చాలా దూరం పోయింది.

ఓనాటి అర్ధరాత్రి నిద్రపట్టని రాజేశ్వరి, బాత్‌రూమ్‌కి వెళ్ళడానికి, లేని శక్తి తెచ్చుకొని పెరటివేపు నడిచింది.

పెరట్లో మల్లెపందిరి క్రింద మంచం మీద వాళ్ళిద్దరూ .... వెన్నెల్లో కనిపించేసరికి ఆ 'నగ్న' సత్యాన్ని తెలుసుకోగలిగింది.

తన చెల్లెలు ... ఒకే రక్తాన్ని పంచుకు పుట్టిన చెల్లెలు తన భర్తనుకూడా పంచుకుంటుందని అనుకోలేదు.

మనసు చెదిరి గుండె పగిలి గదిలో మంచంమీద పడి భోరున ఏడ్చిందామె. ఏడుపు తప్ప ఏమీ చేయలేని నిస్సహాయురాలై నిర్లిప్తంగా వుండిపోయింది.


నీలవేణిని వెంటనే పుట్టింటికి పంపించేయాలనుకుంది. అందుకు తన భర్త ఒప్పుకుంటాడా —? వాళ్ళిద్దరూ ఎందుకిట్లా తప్పుగా ప్రవర్తించారు? కాదు, వాళ్ల తప్పుకి కారణం తను...తన రోగం. తనే ఆరోగ్యంగా వుంటే వాళ్లు యిలా ప్రవర్తించరు. ఎంతకాలం అని మగవాడు నిగ్రహించుకోగలడు.

తనకు ఎలానూ ప్రాప్తంలేదు. తను బ్రతికుండి అతనికి ఉపయోగం లేదు. తనకు బ్రతుకు వుండీ బ్రతుకు లేదు.

ఈ యింటిని సరిదిద్ది...తనను అర్థం చేసుకొని...తనకు సపర్యలు చేసి...అన్నివిధాలా సరిపెట్టుకొనే మనిషి నీలవేణి. ఆమె ఈ యింటికి యిల్లాలయితే ఎలా వుంటుంది"— అనుకుందామె...ఆలోచించింది.

తెల్లారి ఆఫీసుకి వెళుతున్న భర్తను పిలిచి, మంచంమీద, తన పక్కగా కూర్చోమంది. ఎలా మాట్లాడాలో ఆమెకు అర్థం కాక మౌనంగా వుండి పోయింది.

ఆమె ఎందుకో మథనపడుతోందని



గ్రహించగలిగాడు అతను. "ఏమిటో చెప్పరాదే" అన్నాడు.

"మీరు...మీరు...మళ్లీ పెళ్లి చేసుకోవాలి" ... అనగలిగింది. ఆమె కంఠం ఆమెకే ... గా, వింతగా వుంది.

అతను ఆశ్చర్యంగా ఆమె మొహంలోకి చూశాడు.

"ఏం ... అలా అంటున్నావు."

"... కాదు....నిజం....నిజంగానే మీరు పెళ్లి ...సుకోవాలి."

"... మతిగానీ పోయిందా—?"

"... పోయింది, రాత్రి నుంచి ..."

"...?"

"నా ... తెలుసు...రాత్రి పెరట్లో... ...రూ ..." ఆ తరువాత మాట్లాడలేక ...ంది. గొంతు పూడిపోయే దుఃఖపు తెర! ... మొహం పాలిపోయింది. ఆమె కళ్ళ ... సూటిగా చూడలేక తల దించుకున్నాడు.

ఈ మాటలు గుమ్మం పక్కనుంచి విన్న నీలవేణి గుండెలు గతుక్కుమన్నాయి.

అటు తరువాత నాలుగురోజుల వరకూ వాళ్లిద్దరూ రాజేశ్వరికి మొహం చూపలేక పోయారు.

వాళ్లతో నిమిత్తం లేకుండా రాజేశ్వరి తండ్రికి లెటర్ రాసింది. లెటర్‌లో సారాంశం అర్థంకాని ఆమె తండ్రి వెంటనే వచ్చాడు. నీలవేణి అన్ని విషయాలు విపులీకరించేసరికి "దీనికి రోగంతో పిచ్చి పట్టలేదు కదా" అనుకున్నాడు.

"నీలవేణిని తప్పకుండా మావారు చేసుకుంటారు, చేసుకొని తీరాలి" అని పట్టుపట్టిందామె.

చివరికి ఆ తండ్రి ఒప్పుకోక తప్పలేదు. ఈ విషయం గురించి మోహన్రావు, నీలవేణి మరోమాట మాట్లాడలేకపోయారు, తమ రహస్యం....బయటపడి, పెళ్లివరకూ పయనిస్తుందని వాళ్లు ఊహించలేదు.

మరో నెలరోజుల అనంతరం మోహనరావుకి రెండో పెళ్లి. రెండో పెళ్ళాంగా నీలవేణి ఆ యింటి యిల్లాలయింది. రాజేశ్వరి దగ్గరుండి ఆ పెళ్లి జరిపించింది.

ఈ పెళ్లివల్ల తన చెల్లెలికి తనమీద అభిమానం వుంటుందని, తన భర్తకు తనమీద యింకా ప్రేమాభిమానాలు పెరుగుతాయని అనుకుందామె. అంతేగాని, వాళ్లిద్దరూ ఆమెను మర్చిపోయి, ఆ గదిలో పడి... అర్ధరాత్రుల వరకూ నిద్రపోకుండా... నవ్వులతో – మాటలతో....ఆనందంగా గడిపేస్తారని .... అసలు తన ఉనికినే వాళ్లు గమనించరని ఆమె అనుకోలేదు.

ఆమెకు పెళ్లయినప్పుడు ఎంత ఆనందంగా వుందో వాళ్లిద్దరికి పెళ్లి చేసినప్పుడుకూడా అంతే ఆనందంగా వుంది. ఆ ఆనందం యిప్పుడు ఆమెను ఒక్కొక్క మెట్టే అధఃపాతాళంలోకి తోస్తోంది.

అతని పలకరింపులు కరువైపోయాయి. విసుక్కోవడం....కసురుకోవడం ఎక్కువయిపోయాయి.

నీలవేణి ఛీత్కారింపులు, ఏవగింపులు ఆమె భరించలేక పోతోంది.

తన కళ్ళ ఎదుటే వాళ్లు సినిమాలకు, షికార్లకు తిరుగుతుంటే భరించలేక పోయింది.

తన భర్త యిలా నిర్లక్ష్యం చేయటం గుండెల్ని పిండిచేస్తున్నది.

నీలవేణి తన చెల్లెలు. తెలుసుండే ఆమెకో స్థానాన్ని కల్పించింది. ఆమె తనని చులకన చేయడం, మనసును వికలం చేస్తున్నది.

తను చేసిన పొరపాటు ఏమిటో యిప్పుడిప్పుడే తెలిసివస్తున్నది. ఆమెలో అశాంతి చెలరేగింది.

రాజేశ్వరి ఈ ఆలోచనలతో చాలా రోజుల నుంచి సతమత మయిపోతోంది.

రాత్రి సమయం—

నిద్ర రాక ఆమెకో నరకం.

నిద్ర పోక వాళ్ళకో స్వర్గం.

ఒకరికి సుఖం....మరొకరికి....?

యింకా ఎన్నాళ్లిలా బ్రతకాలి? బ్రతికి ఏమి సాధించాలి? ఎవర్ని ఉద్ధరించాలి? అనుకుంటూ ఎన్నోసార్లు ఏడ్చిందామె. ఆమె ఏడుపు గొంతు దాటి, ఆ గది దాటి బయటకు రాలేదు. అలాగని రాజేశ్వరి రాజీ పడలేక పోయింది. అటో యిటో తేల్చుకోవాలనుకుంది.

ఆమె మనసులో యిప్పుడున్న ఆలోచన ఒకటే.

నీలవేణిని వదిలించుకోవాలి. తన భర్తను తన వేపుకు తిప్పుకోవాలి. యింట్లో తను పోగొట్టుకున్న స్థానం తిరిగి పొందాలి.

అప్పుడే తనకు శాంతి.

అందుకు ఏం చేయాలి? ఏం చేయాలి? ఎలా? ఎలా?

పరిపరివిధాల ఆలోచించింది.

ఆమె ఆలోచన మరో రెండు నెలలకు కార్యరూపం దాల్చింది.

ఆ రోజు నీలవేణి, మోహనరావులకు పెళ్లి అయిన రోజు....మేరేజ్ డే.

దురదృష్టవశాత్తు మోహనరావు ఊళ్ళో లేడు. ఆఫీసు పనిమీద మరో ఊరు వెళ్ళవలసి వచ్చింది.

నీలవేణిని గుడికి పంపించిందామె. ఆమె తిరిగి వచ్చేసరికి రాజేశ్వరి వంట వసారాలో పొయ్యి ముందు కూర్చుంది.

నీలవేణి ఆశ్చర్యపోయింది.

"ఏమిటక్కా ... వంట నేను చేద్దునుగా!" అంది.

"కాదే .... పాయసం వండుతున్నాను. యివాళ మీ పెళ్లిరోజు. కనీసం యీ ఒక్క రోజయినా నా చేతులమీదుగా మీకు వండి పెట్టనివ్వు" చిరునవ్వు నవ్వేస్తూ అందామె.

నీలవేణి మాట్లాడలేదు. అన్నీ ఓపిగ్గా చేసింది రాజేశ్వరి. భోజనం అనంతరం పాయసం గ్లాసులో పోసి నీలవేణికి అందించింది.

"ఆయన రానీ అక్కా, యిద్దరం కలిసి తీసుకుంటాం" అంది.

"ఆయన ఎప్పుడొస్తారో నువ్వు తీసుకో" బలవంతం చేస్తూ అంది రాజేశ్వరి.

నీలవేణి గ్లాసు అందుకుంది. నోటి దగ్గర పెట్టుకొని ఆగిపోయింది. "వేడిగా వుంది. చల్లారాక తీసుకుంటాలే అక్కా" అని గ్లాసు టేబుల్ మీద పెట్టేసింది.

రాజేశ్వరి తన గదిలోకి వచ్చేసింది. మంచంమీద పడుకుండి పోయింది.

తలలో ఆలోచనల వలయం!

తను చేసింది మంచిదా? కాదా? స్వంత చెల్లెల్ని....అలా మత్తు మందుతో....

ఆమెకు నిద్ర రావడం లేదు. రాత్రి ఎనిమిది గంటలు దాటుతోంది.

ఈ పాటికి పాయసం నీలవేణి తాగే వుంటుంది. నిద్రలోకి వరిగిపోతూ, ఇక ఆమె లేవదు. అది శాశ్వత నిద్ర....సమాధి నిద్ర.

రాజేశ్వరికి బిగ్గరగా నవ్వాలనిపించింది. నిద్రలోకి వరిగి పోతూ, యిక ఆమె లేవదు అది శాశ్వతనిద్ర...సమాధి నిద్ర...

రాజేశ్వరికి బిగ్గరగా నవ్వాలనిపించింది. నవ్వలేక ఆగి పోయింది.

తాను చేసింది అన్యాయమా?

కాదు.

నీలవేణి తనకు చేసిన అన్యాయం కంటే యిది పెద్ద అన్యాయంకాదు.

రోజూ తను వేసుకొనే నిద్ర మాత్రల్ని మెత్తగా పొడిచేసి పాయసం గ్లాసులోవేసింది.

ఇది పాతకమా? పాపమా?

రాజేశ్వరికి ఎందుకో భయంగావుంది. నిద్ర రావడం లేదు. లేచి పక్కనున్న స్లీపింగ్ పిల్ తీసుకొని మింగింది.

○ ○ ○ ○

ఎవరో సన్నగా ఏడుస్తున్నారు

కళ్ళ ముందు ఏవో కదులుతున్న ఆకారాలు, చెరిగి పోతున్న దృశ్యాలు....ఎక్కడో అపశృతి

రాజేశ్వరి త్రుళ్లిపడి లేచింది

తెల తెల వారు తోంది

ఎందుకు తనకి మెలుకవ వచ్చింది.

ఏవో మాటలు బిగ్గరగా వినిపిస్తున్నాయి.

రాజేశ్వరి తల విదిలించింది, రాత్రి సంఘటన మెదిలింది. గుండెలు వేగంగా కొట్టుకున్నాయి...చిన్నగా వణుకు...

ఈ పాటికి నీలవేణి దీర్ఘ నిద్రలో.... యిక ప్రపంచాన్ని చూడకుండా ఆమె కళ్లు శాశ్వతంగా మూతపడి వుంటాయి.

ఉలిక్కి పడింది. శరీరం కంపిస్తోంది.

అంతలో....

భళ్లున తలుపులు తెరుచుకున్నాయి

గుమ్మంలో నీలవేణి

రాజేశ్వరిఅమెనుచూసింది. శరీరంవణికింది.

"అక్కా... ఆయన...." ఆమె ఏదో చెప్పాలనుకుంటూందికంఠంలో కంగారు.మాట సరిగా రావడంలేదు.

రాజేశ్వరికి అయోమయంగావుంది.

"ఆయన లేవడం లేదు", నీలవేణి అంది.

ఆమె గుండెలు జారిపోయాయి. ఒక్కవుదుట్నలేచి, పక్కగదిలోకి నడిచింది.

గుమ్మం దగ్గర ఆగి పోయింది.

"రాత్రి ఆయన ఎప్పుడొచ్చారో నాకు తెలీదు. ఆయన లేరని పాయసం నేనుకూడా తాగలేదు. ఆయన వచ్చాక యిద్దరం కలిసి తీసుకుందాం అనుకున్నాను...నీలవేణి ఏదో చెపుతోంది.


రాజేశ్వరికి ఏమీ వినిపించడంలేదు.

మంచంమీద శాశ్వతనిద్రలో మోహనరావు,

టేబుల్ మీద ఖాళీఅయిన పాయసంగాసు,

ఆమె అలా చూస్తూ నిలబడిపోయింది.

అంతర్జాతీయ మేధావుల ఆలోచనా మథనం



చేత వెన్నముద్ద

— వాకాటి

"ఏ ఆకాశం క్రింద మానవమేధ తనలోని కొన్ని నిగూఢశక్తుల నత్యద్భుతంగా వికసింపజేసింది? ఏ దేశం జీవితంలోని అతి గంభీరమయిన సమస్యలగురించి క్షుణ్ణంగా ఆలోచించింది? ఆ సమస్యలు కొన్నింటికి ప్లేటో, కింట్‌లను చదివినవారు సైతం తెలుసుకోవలసిన పరిష్కారాలను ఏజాతి సాధించింది?. అని నన్నడిగితే భారతదేశం అని చెబుతాను. మన జీవితాలను పరిపుష్టంగా, పరిపూర్ణంగా, విశ్వజనీనంగా చేసి ఇంకొక శాశ్వత జీవితాన్ని ప్రసాదించగల సాహిత్యం ఎక్కడుంది?—అని అడిగితే భారత దేశం అంటాను నేను."

సరిగ్గా 98 సంవత్సరాలక్రితం కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో "ఇండియా—వాట్ కెన్ ఇట్ టీచ్ అజ్?" అన్న శీర్షిక క్రింద ఇచ్చిన ప్రసంగాలలోని మొదటిదానిలో పైవిధంగా చెప్పినవాడు ఫ్రెడరిక్ మాక్స్ ముల్లర్.

ఆనాటి భారతజాతి రాజకీయ బానిసత్వంలో, మూఢాచారాల అమవసనిశిలో, అజ్ఞాన తిమిరంలో—జీవచ్ఛవంగా వుండింది. అలాంటి జాతికి, తన్నుతాను తెలుసుకొమ్మని వెన్ను తట్టిన వెలుగుదీపం మాక్స్ ముల్లర్.

18:3 డిసెంబర్‌లో తూర్పుజర్మనీలో పుట్టిన ముల్లర్, ఇంగ్లండులో 1900 అక్టోబర్‌లో కన్నుమూశాడు. ఆయన మాతృభాష జర్మన్ అయినా ఆయన 55 సంవత్సరాల పాటు నివసించిన ఇంగ్లండు దేశపు భాష అయిన ఇంగ్లీషులోనే ఆయన రచనలుచేశాడు.

"ప్రాచ్యదేశాల పవిత్ర గ్రంథాలు" అన్న శీర్షిక క్రింద 25 సంవత్సరాలు కృషిచేసి 49 సంపుటాలు వెలువరించిన మహాతపస్వి ముల్లర్.

శాయనుడి వ్యాఖ్యానంతో 'ఋగ్వేదాన్ని' ఆరు సంపుటాల్లో ప్రచురించింది ఆయనే.

ఇవిగాక "పౌరాణికగాథల ప్రేరణలు" అని 864 పుటల్లో రెండు పుస్తకాలు, "శబ్దాల జీవిత చరిత్రలు", "ప్రాచీన సంస్కృత వాఙ్మయ చరిత్ర" వంటి పుస్తకాలూ రచించిన ఈమనిషి సాధనకు ప్రేరణ ఏమిటి? ఒక వ్యక్తి జీవితంలో ఇంతటి బృహత్ రచనా వ్యాసంగం సాధ్యమా?

ఇది తెలుసుకోవాలంటే మాక్స్ ముల్లర్ తన ఏకైక పుత్రుడు విల్‌హెల్మ్ గ్రెన్‌ఫెల్‌కు రాసిన వుత్తరం చూడాలి. అందులో ఆయన—

"జీవితంలో అనుభవించదగిన సరదాలను అనుభవిస్తూనే ఒకొనొక వ్యక్తి, ఆశయం. సాధన—దేనిమీదో ఒక దాని మీద మమకారం పెంచుకోవాలి. ఇది ప్రేమయై, సాధనయై, తపస్సు కావాలి. అలాంటిది లేని జీవితం గానుగెద్దు జీవితం అవుతుంది."

అలాంటి ప్రేమ ఆయనలో ప్రాచ్యదేశాల, ముఖ్యంగా భారతదేశపు ప్రాచీన సాహిత్యం మీద ఏర్పడింది.

ముల్లర్ చిన్నబ్బాయిగా బడిలో చదువుకుంటున్నప్పుడు అతడి నోట్ పుస్తకం ఒక దాని వెనకట్టమీద వారణాసి బొమ్మ కన్పించింది. స్త్రీలు, పురుషులు, పిల్లలు గంగానదిలో స్నానం చేస్తున్న ఆ దృశ్యం ఎందుకో ఆ బాలుడి మనస్సును ఆకట్టుకుంది!

అదివరకే భారత దేశంగురించి "సతీసహగమనం" గురించి కొద్దిగా విన్న ఆ కుర్రవాడు ప్రొఫెసర్ బ్రోకన్ అన్న గురువు దగ్గర సంస్కృతం నేర్చుకోవడం మొదలు పెట్టాడు.

యువకుడిగా పారిస్‌లో వుండగా ముల్లర్ దేవేంద్రనాథ్ టాగూర్ (రవీంద్రుడి తాతగారు)ని కలిసేవాడు. ఒకసారి సంగీతప్రియుడయిన ముల్లర్ టాగూర్‌ని పాడమంటే ఆయన పర్షియన్ పాట పాడాడు.

"అది కాదు మీ సంగీతం వినాలని వుంది—" అని కోరాడు ముల్లర్.

ముల్లర్ బలవంతం మీద టాగూర్ పియానో వాయిస్తూ ఒక పాట పాడాడు కాని, దాని మాధుర్యం, రాగం ఏదీ ముల్లర్‌కి అర్థం కాలేదు.

అప్పుడు టాగూర్ చెప్పాడు: "మీరందరూ అంతే! మీకు ఏదన్నా కొత్తగా అన్పిస్తే దాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించక మొహాలు తిప్పేసుకుంటారు. నేను మొదట ఇటాలియన్ సంగీతం విన్నప్పుడు నాకూ అలాగే అన్పించింది. కాని ప్రయత్నించగా ప్రయత్నించగా నాకు అది అర్థం కాసాగింది. దాని మీద ఇష్టం ఏర్పడసాగింది. ఏ విషయమయినా అంతే. దాని గొప్పదనం ఎంతదయినా మనలో ఆ ప్రయత్నం కావాలి. అది లేకుండా మీరు మా మతం మతం కాదని, కవిత కవిత కాదని, తత్వశాస్త్రం తత్వశాస్త్రం కాదని అనుకుంటారు. యూరప్ జ్ఞాన విజ్ఞానాలతో బాటు మా కళలను, శాస్త్రాలను కూడా మేము తెలుసుకుని గౌరవిస్తాం. మీరు మా జ్ఞానాన్ని కళలను అధ్యయనం చేస్తే మీరంటున్నట్లుగా మేము అజ్ఞులం కాదనీ, తెలియని దానిమీద మీరెంత తెలుసుకున్నారో మేమూ అంతే తెలుసుకున్న వారమనీ, కొన్ని రంగాలలో మీ కన్నా లోతుగా వెళ్ళగలిగామనీ తెలుసుకోగలరు"

ఈ ప్రసంగం మాక్స్ ముల్లర్ ఆలోచనలను అమితంగా ప్రభావితం చేసింది. భారత దేశం మీది ఆయన ప్రేమ భారత దేశపు నాగరికత మీదకు, అక్కడ నుండి భారతీయుల మీదకు మళ్ళింది. ఆ ప్రేమ ఈ దేశపు అమూల్య సాహిత్యాన్ని పాశ్చాత్యులకు అరచేతిలో ఒలిచి పెట్టింది. భారతీయులకూ కను విప్పు కల్గించింది.

ఆయన అర్థం చేసుకున్న భారతీయత గాక— ఆయనకు భారత దేశంలో కరడు గట్టుకుపోయిన మౌఢ్యం, మతం పేరిట వేయి వెర్రితలలు, భ్రష్టాచారాలూ, కల్మషం కన

> "జీవితం వేరు, సంఘం వేరు... కానీ దురదృష్టం ఏమిటంటే, సంఘం జీవితాన్ని నమిలి మింగుతుంది"
>
> —ఫ్రెడరిక్ మాక్స్ ముల్లర్

పడ్డాయి. ఆయన భారత దేశం మీద పాదం మోపలేదు గానీ ఇక్కడి మనుషులను, ఆనాటి పరిస్థితులను చూచి వుంటే మరింతగా కుంగి పోయేవాడు. అలా చీకటిలో మగ్గుతున్న భారతీయులకు ఒకప్పటి వారి జ్ఞాన దీపాలను గుర్తు చేసి, మసిబారిన ఆ ఒత్తులను చిదిపి, ఆ ప్రమిదలలో అధ్యయన తైలాన్ని నింపడానికి ఆయన తన జీవితాన్ని వెచ్చించాడు. అధ్యయనాన్ని ఇంత ఏకాగ్రతతో చేపట్టిన ముల్లర్ తన భార్యను పిల్లలకు అంతే తీవ్రతతో ప్రేమించాడు. పెళ్ళికి ముందు అయిదేళ్ళపాటు జార్జినా గ్రెన్‌ఫెల్‌ని తెలిసి పరిచయం పెంచుకున్న ముల్లర్ అనేక అడ్డంకులను దాటి 1859 ఆగస్టులో ఆమెను వివాహమాడగలిగాడు.

అయన ఎప్పుడు పనులమీద బయటి వూర్లకు వెళ్ళినా ఆమెకు ఉత్తరాలు రాసేవాడు, చిన్నచిన్న కానుకలు తెచ్చేవాడు. అలాంటి ఒక వుత్తరంలో-"నేను ఎంత నీవాడినో, నువ్వు అంత నాదానివి. అంటే నేను నీకు యజమాని అనో, నువ్వు నా యజమానురాలివి అనో కాదు. నిన్ను నాకు, నన్ను నీకు భగవంతుడు కానుకలుగా ఇచ్చాడు. నీతోటి నా జీవితమే స్వర్గం అనీ, శాశ్వతం అనీ అన్పిస్తుంది నాకు!" అని హృదయం విప్పి చెప్పాడు ఆయన.

ఆ ప్రేమైకజీవులకు ముగ్గురమ్మాయిలు, ఒకబ్బాయి పుట్టారు. ఆ పిల్లలనూ అత్యంత ప్రేమానురాగాలతో లాలించి పెంచిన ముల్లర్ జీవితం చూస్తే "కామిగాక మోక్షగామి గాడు" అని వేమన-అన్నదాని అర్థం ఇట్టే తెలుస్తుంది.

అందరు మేధావులవలెనే సమాజంలోని విలువలు చూసి అసహ్యం వేసేది ముల్లర్‌కు.

"ఎంత డబ్బు ఇచ్చినా ఈ లండన్‌లో నేనుండను. ఈ చప్పుడు, ఈ గోల, ఈ విందులు, ఊసుపోక కబుర్లు, నటనలో. అహంభావ ప్రదర్శనలో ఒకరిని మించాలని యింకొకరు పడే పోటీలు-అబ్బబ్బా! జుగుప్సాకరంగా వున్నాయి" అని రాశాడాయన తన భార్యకు రాసిన ఒకవుత్తరంలో. ఈనాటి మన నగరాల జీవనం యింతకన్న భిన్నంగా వుండనగలమా?

యింకొకసారి-"ఈ సంఘం సంఘం అంటారే దానికన్న అభూతకల్పన యింకొకటివుండబోదు. అసలు సంఘం అనేది ఏదీలేదు. మూర్ఖత్వం, అహం, అబద్ధం-ఈ మూటి కలయికే సంఘం....జీవితంవేరు, సంఘం వేరు.... కాని దురదృష్టం ఏమిటంటే సంఘం జీవితాన్ని నమిలి మింగుతుంది!" అన్న వాక్యాల వెనుక ఎంత బాధ, ఎంత అనుభవం వుంది. యిది తెలియడానికి జీవితమంతా ఖర్చు చేసిన వారెందరున్నారు!

మాక్స్ ముల్లర్ చార్లెస్ డికెన్స్ డార్విన్, టెన్నిసన్, బ్రౌనింగ్, జాన్‌రస్కిన్, వివేకానంద, పండిత రమాబాయ్, లార్డు రిపన్‌లవంటి హేమాహేమీలతో సంబంధ బాంధవ్యాలు నెరపిన ముల్లర్ జీవితంలో అనేక రగడలు, నిరాశలు, దుఃఖాలుఎదురయ్యాయి. ఆక్స్‌ఫర్డు విశ్వవిద్యాలయంలోని సంస్కృత పీఠంలోని "బోడెన్" ఆచార్య పదవికై మరొక గొప్ప సంస్కృత విద్వాంసుడు మోనియర్ విలియమ్స్, మాక్స్ ముల్లర్ తలపడిన వైనం పెద్ద రాజకీయయుద్ధంగా మారింది, చివరకు ముల్లర్ ఓడిపోయాడు. ఆక్స్‌ఫర్డునుండి రాజీనామా చేసి వెళ్ళి పోదాం అనుకున్నాడుగాని అక్కడి వారు అయనను వదలుకోవడం ఇష్టంలేక ఆయనకు తగినవేతన సౌకర్యాలతో ఇంకొక పదవి నిచ్చి ఆయనను నిలుపుకున్నారు.

మానవజాతి పుట్టు పూర్వోత్తరాలను విశ్లేషించిఒకసిద్ధాంతాన్నిప్రతిపాదించిన డార్విన్‌కు మాక్స్ ముల్లర్‌కు మధ్య ఆ విషయం మీదే అభిప్రాయభేదాలు వచ్చాయి. ముల్లరు డార్విన్ ఇంటికి వెళ్ళాడు. ఇద్దరూ నిర్మొహమాటంగా చర్చించుకున్నారు. ముల్లరు లేచివెళ్ళిపోతుండగా డార్విన్ నవ్వుతూ అయనచేతులు పట్టుకుని— "మీరు చాల ప్రమాదకరమైనవారు!" అంటే, ముల్లరు-"ఇద్దరం సత్యాన్వేషులమేగనుకప్రమాదానికిఆస్కారంలేదు" అన్నాడు. ఇంకొకసారి డార్విన్ అభిప్రాయాలను తునాతునియలుచేసే వ్యాసాన్ని ముల్లరు ఆయనకు పంపగా, డార్విన్-"మీవ్యాఖ్యలు కొన్ని బాణాల్లా నిశితంగా తగిలినా నామనసు-"ఇవాళ సాక్షాత్తు రాజుగారే నన్ను చావబాదాడు సుమా" అని మురిసిపోతూచెప్పుకున్న కథలోని వ్యక్తిలా వుంది" అని రాశాడు.

ఎంతటి మహోన్నత సంస్కారం! ఇంతలా జీవితాన్ని జీవించి సాహిత్యాన్ని సేవించిన వ్యక్తి గుడ్డి ఆరాధనాపరుడని అనుకుంటే అది పొరబాటు కాగలదు. "విశ్వాసానికి మతానికి నాస్తికతను మించిన టానిక్ లేదు." అని నిర్వచించిన ముల్లర్ ఇట్లా వివరించాడు. "నా స్తికతలో రెండు రకాలున్నాయి ఒకటి మృత ప్రాయం, ఇంకొకటి అమృత ప్రాయం. ఈ రెండవ రకం నాస్తికత అన్ని విశ్వాసాలకు జీవాధారం వంటిది. అది మన జీవితంలో కొన్ని విషయాలు స్పష్టంగా అర్థమయిన క్షణాలలో మనం అంతవరకు నమ్మిన వాటిని వదిలివేయగల శక్తి నిచ్చేది ఈ రెండవ రకం నాస్తికతే! మనకెంత నచ్చినా, ఎంత ప్రియమయిన దయినా అంతకన్న మేలైన ఆలోచన, వాస్తవం, విషయం ఎదురయినప్పుడు పాతదాన్ని వదలివేయాలి. అదే శరణాగతి, త్యాగం, విశ్వాసం—" అన్నాడు ఆయన! అనగా నాస్తికత నెగిటివ్ మీద ప్రగతి పాసిజిటివ్ ప్రింట్లు తీయాలని సూచించాడన్నమాట.

మాక్స్ ముల్లరుని "మోక్ష మూలరు" అంటూ తతం గమనించి మనం - ఈ చాద స్తపు హిందువులు అన్నింటిని సంస్కృతంలోకి మార్చుకుని చంకలు కొట్టుకుంటారుగా, అందులో ఇది ఒక భాగం-" అని కొట్టి పారేస్తాం. కాని "ట్రూత్ ఈజ్ స్ట్రేన్‌జర్ దేన్ ఫిక్షన్"-గనుక అవధరించండి.

1849 లో ప్రచురించిన ఋగ్వేదపు మొదటి సంపుటపు రెండవ టైటిల్ పేజీ మీద మాక్స్ ముల్లరు- "భట్ట మోక్ష మూలరేణ సంశోధితా" అని రాసుకున్నాడు. అంతేకాదు జర్మనీని "శార్మణ్య దేశం" గాను, ఆక్స్ఫోర్డును "ఉక్షతరణం" గాను పేర్కొన్నాడు.

మొదటిసారిగా గ్రామఫోన్ రికార్డింగ్ పద్ధతి కనుగొన్నప్పుడు, మాక్స్ ముల్లరుని రికార్డు కోసం ఏదయినా పలకమన్నప్పుడు- ఆయన "అగ్నిమీళే పురోహితమ్" అన్న ఋగ్వేదంలోని శ్లోకాన్ని చదివారట.

స్వామి వివేకానంద — మాక్స్ ముల్లరుని భారత దేశపు మిత్రుడిగా వర్ణించాడు.

ఆయన జబ్బుతో వున్నాడని తెలిసి ఆయన కృషిని అర్థం చేసుకున్న సామాన్యుడొకడు శ్రీమతి ముల్లరుకు 1889 డిసెంబరు 18 న మద్రాసు నుండి రాసిన వుత్తరంలో ఇలా వుంది.

"మాక్స్ ముల్లరుగారు ఆరోగ్యం కోలుకునే నిమిత్తం నేను, నాలాగే ఆలోచించే మిత్రులు కొందరూ పార్థసారథిస్వామి కోవెలలో ప్రత్యేకంగా అర్చనలు చేయించాలనుకుని కోవెలకు వెళ్ళాం. మా కోరిక విని ఆ అర్చకుడు-'అబ్బే హిందువుగా పుట్టనివాడిపేర అర్చనయ్యే వీలుకాదు. కిరస్తానీవాడిపేర పూజచేస్తే నా ఉద్యోగం వూడుతుంది. మావాళ్ళు నన్ను వెలివేస్తారు" అని తిరస్కరించాడు!.... అప్పుడు మాలో ఒకరు అతడికి ఎక్కువ డబ్బులు ముట్టజెపుతామనగానే అతడు ఒప్పుకున్నాడు!'

మాక్స్‌ముల్లర్ ఆరోగ్యం గురించి ఈ దేశంలో ఆనాడు ఒక సామాన్యుడు తపన పడడంలో ఎంత ఔన్నత్యం వుందో-అర్చకుడు మరి నాలుగు రూపాయలకోసం "చేయరానిది" అని తనే అన్నదానిని చేయబూనడంలో మతం పేరిట వ్యక్తుల అధోగతి, భ్రష్టత్వం అంత కన్పిస్తుంది.

అందుకనే యింకో సందర్భంలో ద్వారకానాథ్ టాగూరుకు రాసిన వుత్తరంలో మాక్స్ ముల్లరు—"యిటలీలోగానీ, యింగ్లండులోగాని, యిండియాలో గాని పూజారులను బట్టి ప్రచారకులనుబట్టి మతాన్ని బేరీజువేయరాదు!" అని హెచ్చరించారు. ●

ఎ.ఎస్.మణి — ఉద్యోగం

కాలింగ్ బెల్ విని వెళ్ళి తలుపు తీశాను.

దశరధుడు లోపలికి వచ్చాడు.

దశరధుణ్ణి చూస్తుంటే నాకు రాజ్‌కపూర్ గుర్తు వస్తాడు. ముఖ్యంగా జోకర్‌లో రాజ్‌కపూర్. ఆ కళ్ళలో రాజ్‌కపూర్ చూపు, కరుణాత్మకమైన చూపు, ఒలికి పోయిన పాలనిఎత్తుకోటానికి ఎవరైనా ప్రయన్నిస్తుంటే ఎట్లాగ చూస్తాము?-అటువంటి చూపు.

పిల్లవాడు స్కూలుకి వెళ్ళనంటాడు తిట్టినా కొట్టినా లాలించినా మనమాట వినడు. ఇంకో మార్గం కనిపించదు. అప్పుడు మనంచూస్తూనిలబడి పోతాం, అటువంటి చూపు నేను ఈమాట అంటే. ఆయనా పిల్లలూ ఛీ అన్నారు.

"రాజ్‌కపూర్ ఎక్కడా, వీడెక్కడా?" అన్నారు.

ఏమో నాకు మాత్రం అజ్ఞాతమైన పోలిక ఏదోస్ఫురిస్తుంది. కళ్ళలోనే అయ్యుంటుంది. అంతస్తులువేరు కావచ్చు, అంతరాత్మలు ఒకటి కాకూడదనలేముకదా దశరధుడు తలుపు మూల చెప్పులు విప్పాడు. వెళ్ళి తను ఎప్పుడూ కూర్చునే స్థలంలో కూర్చుంటూ

"అమ్మా, బాగున్నారా? అనడిగాడు.

"ఆ." అంటూ చూశాను అప్పుడు.

మనసు కలచినట్లు అయింది. అతడి మొహంలో బాగా మార్పు కనిపిస్తోంది. కళ్ళు లోపలికి పోయి గుంటలు ఏర్పడ్డాయి. లోపలికి పోయిన కళ్ళు చితికి నీరు కారుతున్నట్లున్నాయి. మొహం నిండా ముడతలు, గీతలు. దళసరి అద్దాలతో ఎగుడు దిగుడుగా ఉన్న కళ్ళజోడు. చేతిలో చింకిగా ఉన్న గొడుగు.

విప్పిన చెప్పులకి లెక్కపెట్టలేనన్ని అతుకులు. మాసిన పంచ. మాసి వదులుగా ఉన్న చొక్కా.

బక్కచిక్కిన శరీరం. ఒకప్పటి అందమైన కట్టడం తాలూకు శిధిలంలాగున్నాడు.

ఇదివరకు బాగానే ఉండేవాడు, నేను ఈ ఊరికి కొత్తగా వచ్చిన రోజుల్లో.

ం ం ం ం

"రా. బాగున్నావా?" అంటూ ఆయన ఎవరినో పలకరిస్తున్నారు

"ఎవరు వచ్చారో!" అనుకుంటున్నాను కర్టెన్ వెనక నిలబడి.

"ఇటురా ప్రభా. దశరథుడు వచ్చాడు." అంటూ నన్ను పిలిచారాయన.

ఎవరొచ్చారో! ఆఫీసువాళ్ళో అయినవాళ్ళో అయిఉంటారనుకుంటూ బిడియ పడుతూ వెళ్ళాను. చూడగానే

"ఇతనా!" అనిపించింది.

నుంచుని ఉన్నాడు. పంచె, షర్టు, చదువూ, ఉద్యోగం లేని క్రిందతరగతి మనిషని చెప్పేస్తున్నాయి.

"కూర్చో." అన్నారాయన నన్ను.

చిరాకువేసింది. కూర్చుని ఏంచెయ్యాను!

"నమస్కారమమ్మా. మిమ్మ చూద్దామనే వచ్చాను తల్లీ. ఏం రూపం! చక్కగాఉన్నావు తల్లీ. బాబుకి తగ్గట్టున్నావు. ఈడూజోడూ బాగుంది. ఆ ముఖమే చెప్తోంది సుగుణాలరాశివని!" అన్నాడు, నాకు దగ్గరగావచ్చి పరీక్షగా చూస్తూ.

అప్రయత్నంగా నవ్వు వచ్చింది. ఆయన నావేపు చూసి నవ్వారు.

"కూర్చో అమ్మా. బాబుపక్కన కూర్చో. నాముందర సిగ్గుపడకుతల్లీ" అన్నాడు మళ్ళీ.

సోఫాలో ఆయన పక్కన కూచున్నాను.

"అతడిమాట వింటున్నానేమిటి?" అనిపించింది.

"పనిలోకి వెడుతున్నావా?" అనడిగారాయన దశరథుణ్ణి.

"అదేగదు బాబూ ఇప్పుడొచ్చిన చిక్కు...



గొప్పకష్టం వచ్చిపడిపోయింది బాబూ. ఏం చెప్పుకోనూ. ఆ ఫెర్గూసన్ గాడు నా మీద కత్తిగట్టాడు. కోపం పెట్టుకున్నాడు."

"ఎందుకూ ? ఏమైంది ?" ప్రశ్నించారాయన.

"ఎందుకేటి బాబూ! ఆడు లండన్ నించి వొచ్చాడు గాసీ-బురదలో విత్తనాలు గుచ్చేసి పైన మట్టి ఇల్లించేశాడు. లోని విత్తనాలన్నీ కుళ్ళిపోయినాయి. మొక్క మొలవ లేదు. నేను అప్పుడే అన్నాను. నువ్వు పెద్దోడివే.... ఫెర్గూసన్.... లండన్ నుంచి వొచ్చావే కానీ నీకు, సిల్ట్ యు నో నథింగ్ అన్నాను. నెల తిరిగింది. కాగితం చేతికి వచ్చింది. ఉద్యోగం ఊడిపోయింది. నా చేత కాగితం మీద సంతకం పెట్టించినాడు. ప్రమోషన్ యిప్పిస్తున్నానన్నాడు. నాకు తెలీకపోయింది.రిజైన్ లెటర్ రాసి సంతకం పెట్టించాడు. ఇంకేం చేస్తాను బాబూ!" అన్నాడు.

"మరి యిప్పుడేం చేస్తున్నావ్? ఎలా గడుస్తోంది?" ఆదుర్దాగా అడిగారు ఆయన

దశరధుడు చేతులు నలుపుకుంటున్నాడు!

"ఏం చేస్తాను బాబూ. పెద్దోడు సత్యం పనిలో కెడుతున్నాడు. పశువుల్ని మేపటం, కడగడం.... రోజుకి రెండు యిస్తారు బాబూ.

అది భార్య అణ్ది వాగ్గేసింది. కూచుంటే గతవదు కదా బాబూ. పిల్లలకి ట్యూషన్ చెపుతున్నాను. అక్షరాలు చెబుతాను. అంకెలు చెబుతాను. డాక్టరు గారు వాళ్ళ బాబుని నా దగ్గర కూచోబెట్టి ఈ పంచెల చాపు ఇచ్చారు బాబూ. ఏదో మీ దయ వల్ల...."

"నా దయేమిటి మధ్యలో!" ఆయన సిగ్గు పడుతూ అన్నారు.

"అమ్మమ్మా, ఎంత మాట ! అట్లాగనకండి బాబూ. అంతా మీదయే. మీ నాన్న గారు మహారాజు. ప్రాణాలు చేతపట్టుకుని రంగం వొదిలి పారిపోయి వస్తే ఆ మహారాజే కదూ మాకు అన్నం పెట్టి మా కుటుంబం నిలబెట్టారు. నాకు ఉద్యోగం వేయించారు దొరతో చెప్పి. నా కూతుర్ని పనితో పెట్టుకున్నారు. దానికి యిచ్చిన అన్నం కూరలూ మా యింటిల్లిపాదిమి తినేవాళ్ళం. మీ ఉప్పు తిని పెరిగిందే బాబూ ఈ శరీరం అన్నాడు వడలిపోయిన "జబ్బల్ని చూసుకుంటూ.

నాకు నవ్వు వచ్చింది. కని పెట్టినట్టున్నాడు అతను కూడా నవ్వుతూ.

"యిప్పుడిట్టాగున్నాను కాని తల్లీ, వయసులో ఉండేప్పుడు బాగుండే వోణ్ణమ్మా. మా వోళ్ళంతా నన్నూ, నా వేషాన్నీ చూసి నువ్వు దొరల యింట్లో పుట్టాల్సినోడివిరా అనే వారు. అంతా దొరల తిండే బ్రెడ్డు, బటరు... చికెన్....

"టీ తాగుతావా ?" అనడిగారు దశరథుడి వాక్ప్రవాహాన్ని ఆపుతూ ఆయన.

"ఏదో మీ దయ. మీరిస్తే తాగనా. రంగంలో వుండగా అలవాటయిందమ్మా చాయ్. అది పడకపోతే ప్రాణం నిలవదు తల్లీ. పూటకి తిండి లేకపోయినా అది పడిపోవాల."

"అక్కడ.... అదే రంగూన్‌లో ఏం చేసే వాడివి?" అనడిగాను.

మనిషి నిటారుగా అయ్యాడు.


"గొప్ప ఉద్యోగం తల్లీ. అప్పుడిట్లా ఉండేవాడినా. బట్టలెప్పుడూ నలగకుండా మల్లె పువ్వుల్లా వుండేవి. వీధిలో నడుస్తుంటే, అడోళ్ళంతా నాకేసి చూసేనారు. యింత పనితో కెడితే ఏ ఓడ అయినా సరే మన దగ్గర ఆగాల్సిందే. యిట్లా దుర్భిణీలో చూసేవాడిని. వాడు కెప్టెనయినాసరే, మరెవడైనా సరే నీ పేరేమిటి ? ఏ సరుకుంది? ఎంత వుంది? పెన్నించటం. రాసెయ్యటం. సరంగు పని చేసేవోణ్ణి. బాంబార్డుమెంటు అయింది, వచ్చేశాను. అప్పటి నుంచి సుకం లేదు తల్లీ. యిక్కడ ఫారంలో పనికి కుదిరాను. ముగ్గురు పిల్లలు. కొడుక్కి పెళ్ళి చేశాను. కోడలొదిలేసింది. కూతురికి పెళ్ళి చేస్తే దాన్ని అల్లుడొదిలేశాడు. అంత బరువూ నా మీదే. కూతురికి రెండువేలు ఖర్చు చేసి పెళ్ళి చేశాను తల్లీ. నాగరం, జతకుప్పెలూ, చేయించాను. వాడిమొహమ్మంత తాగుతాడు. నాగరం, జతకుప్పెలు అమ్ముకుని తాగేసి పెళ్ళాన్ని పుట్టింటికి తోలేశాడు. ముందరనుంచే ఉంకో గుంటని ఉంచాడు."

"కోడ లెందుకు రాదూ ?"

"వీడు దాన్ని సినిమాకి తీసికెళ్ళలేదంట, పూలు కొని పెట్టలేదంట. మరి సత్యంని మద్దెమద్దెలో కూచో బెట్టేస్తారు? జీతం దొరకదు, తిండి తింటామా, దాని షోకులకే యిస్తామా? వంటచేస్తూనే సగం కూర తినేస్తుందమ్మా. మా అమ్మాయి దెబ్బలాడితే ఏ వేప్పీ అనలేదని సత్యాన్ని నువ్వు మొగాడివికాదు. నీకు పెళ్ళాం అవసరంలేదు అని జగడా చేసి పుట్టింటికెళ్ళిపోయింది. మారుమనువాడుతుందంట. ఈ సంగతులన్నీ ఎవరికి చెప్పుకోనమ్మా. బాబుగారికి మేమంటే గొప్ప అభిమానం తల్లీ. చిన్నప్పుడు ఎత్తుకున్నాను. ఆడించినాను. అమ్మ ఏంచదువుకున్నారు బాబూ!"

"మెట్రిక్ పాసయింది."

బాగుంది. చదువుకున్నతల్లి." యిల్లు కళకళలాడిపోతూంది. యియ్యాలేపు అందరూ చదువుకొని ఉండాలమ్మా. మీకు ప్రెజెంటు



తెద్దామనుకున్నాను, రాధాకృష్ణులపటం. బల్లమీదెట్టి మరిచి పోయాను. జ్ఞాపకశక్తి తగ్గిపోతోందిబాబూ. పెద్దాడినైపోతున్నాను!"

"సరేలే.నువ్వుబహుమతులేమీతీసుకురాకు." అన్నారాయన.

"లచ్చనంగా పెళ్ళి చేసుకున్నారు. పేదోడినైతేమాత్రం, ఉత్తచేతుల్తోవస్తానా బాబూ ! ఈ పారి గుర్తుపెట్టుకొని తెస్తాను. మీరు పుచ్చుకోవాలి." అన్నాడు. టీతో బాటు, కారంపూస, లడ్డు యిచ్చాను. ప్లేటు అందుకొంటూ

"దీర్ఘసుమంగళీభవ!".. అని దీవించాడు.

ఆయన చెప్పారు. దశరథుడు డయిరీ ఫామ్స్‌లోపనిచేసేవాడుట. నెలకి ఐదారు వందల దాకా సంపాదించేవాడుట మేస్త్రీ పని. కొడుకు, కూతురు వీళ్ళింట్లో పనిచేశారుట, చిన్నపుడు పిల్లల్ని ఎత్తుకోవటం, ఆడించటం, చెట్లకి నీళ్ళ పెట్టడం. ఆఫీసుకి భోజనం కారియరు తీసికెళ్ళటం మొదలయినపనులు. భార్యని మాత్రం పనికి వెళ్ళనిచ్చేవాడు కాదుట.

"పెళ్ళి మిఠాయితిన్నాను. బాగుందమ్మా. బాబూ, మీరు పెళ్ళిచేసుకునివచ్చారు. మరి కొత్త పంచ యిప్పించరా ? నిన్ను ఆశీర్వదిస్తున్నాను. నీకు యివాల్టినుంచి సరిగా నెలనాడు ప్రమోషన్‌వస్తుంది. అందరూ నీకింద ఉంటారు. ఎవరయినా నీ మాట వినాల్సిందే. నువ్వు మళ్ళీ ఏడాది ఈ రోజుకి కారు కొంటావు. మీరు వైభోగంగా ఉంటారు. నూరేళ్ళకి కలకాలం మీరు చిలకాగోరింకల్లాగ ఉంటారు. మళ్ళీ ఈ రోజుకి అమ్మ కొడుకుని ఎత్తుకుంటుంది. మీకేం భయంలేదు. అన్నీ మీ ఆవిడే చూసుకుంటుంది కాలు కింద పెట్టనీదు. " అన్నాడు.

ఊరికి కొత్తగా వచ్చాను, బితుకు బితుకుగా ఉంది, ఎవరెవరోవచ్చి చూసి వెళ్లారు కానీ యింతహామీ ఎవరూ యివ్వలేదు. దశరథుడు ఎప్పటినుంచో తెలిసినమనిషిలా, బంధువులా అనిపించాడు.

ఆయన బీరువాతెరిచి ఒక కొత్తపంచె తీసి యిచ్చారు, పెళ్లిలో చాలా వచ్చాయి, ఆయన పంచకట్టుకోరు. యివ్వనా అనడిగారు, యివ్వమన్నాను, యిచ్చారు,

"నాకు తెలుసు నువ్వు యిస్తావని, యిది నా హక్కు బాబూ. నిన్ను ఆడించాను, నన్ను ఒక్కక్షణం ఒదిలేవాడివికాదు. రోజూ

బెలూన్‌లుకొని పగలగొట్టేవాడివి. మీ నాయన నిన్ను కారులో తిప్పటానికి తీసికెడుతుంటే నన్నుకూడా ఎక్కమనేవాడివి మీనాన్నగారు కూడా "ఎక్కవోయ్ దశరధుడూ, నీకు వాహనయోగ ముంది" అనేవారు ఆ రోజులు మళ్ళీరావు బాబూ, మీ అమ్మగారు నేను రాగానే కూచోమని ప్లేటు నిండా పూరీలు కూర పెట్టి ఇచ్చేవోరు, తినేదాకా వదిలే వోరు గాదు బాబూ. గొప్ప మనసున్నతల్లి నీ అత్తగారు వెళ్లొస్తానమ్మా. వస్తుంటాన్లే, బెంగెట్టుకోకు. బాబు! నీ కేంలోటుచెయ్యరు."

ఆ చిన్నకళ్లలో ఒక మెరుపు. అప్పటికి ఆరోగ్యంగానే ఉన్నాడు అరవైఏళ్ళున్నా పొట్టిగా దృఢంగా ఉంటాడు. చిన్నకళ్లు... కొంచెంలోపలికి....నీలిరంగులో! ...చూపుల్లో మాటల్లో చురుకు, కొంటెతనం. ఒకపక్క తను గొప్పవాడినంటూనే ఉంటాడు. ఇంట్లో ఏమీలేవంటాడు. మాటలతోటి బోల్తాకొట్టిస్తాడు. మంచివాడో, ఖట్టాజో, అవకాశవాదో, ఆత్మీయుడో తేలదు మనకి. ఉన్నంత సేపు వినోదం కలిగిస్తాడు. వెళ్లగానే అనిపిస్తుంది నాలుగు కబుర్లు చెప్పి తనకి కావలిసింది రాబట్టుకుంటాడని. తరచూవస్తూవుండేవాడు. ఈసారివచ్చిచాలారోజులయింది ఇపుడిట్లాగు న్నాడు, జాలివేసింది, కాలంతెచ్చేమార్పు. పాలరాతిభవనాలు వెలిసిపోతాయి. నవనవ లాడే చెట్లు పుష్పించి ఫలించి రాలిపోతాయి.

"ఇంకెన్నాళ్ళో బ్రతకడు పాపం!" అని పించింది, ఈ కాలంలో నెల నెల సంపాదించు కుంటుంటేనే గడవటం కష్టంగాఉంది, ఎట్లా బతుకుతున్నారో పనిపాటా లేకుండా అని పించింది, ఎప్పుడో రెండూ, మూడూ ఇవ్వటం తప్ప మేము చేస్తున్నసాయమేమీ లేదు.

ం ం ం ం

"అంతా బాగున్నారా" అనడిగాను.

"ఆఁ మీదయవల్ల...." అన్నాడు జేబులో కాగితాలమధ్య వెతుకుతూ.


చూస్తూ నుంచున్నాను.

"ఆ మద్దిన మారెండోవోడు వెంకట్‌కిఉద్యోగం అయిందని చెప్పాను గదూ. వాడికి పెళ్ళి చేస్తున్నాము. ఇదిగో యిన్విటేసన్. మీరు రావాలమ్మా బాబుగార్ని కూడా లాక్కురావాల ఆ పిల్ల మాకు కావలసిందాయే. నా బావమరిది కూతురు. ఐదోక్లాసు చదివింది. కట్నం రెండువేలు. ట్రాన్సిస్టర్, వాచీ యిస్తామన్నారు. సూటు పెడతారు పెళ్ళికొడుక్కి. అమ్మాయికి పదితులాల బంగారం ఉంది. జతకు ప్పేలు, నాగరం, మెళ్ళో గొలుసు. పిల్ల లచ్మి. గొప్ప సంబంధం తల్లీ. మాబావమరిది కార్ఖానాలో పని చేస్తున్నాడు. మేం బీదోళ్ళమయిపోయినా మని రాకపోకలు లేవు యిన్నాళ్లూ. యిప్పుడీడు మెట్రిక్ పాసయి పోయాడు. ఉద్యోగస్తుడయ్యాడు. నా బావమరిది పిల్లనిస్తానని కబురెట్టాడు. నేనువొద్దుగాక వొద్దు అన్నాను. నాభార్య కళ్ళనీళ్ళెట్టుకుని ఏడ్చింది అన్న కూతుర్ని చేసుకుంటానని. పిల్ల నల్లగా ఉంటుందనుకో. కానీ కళైన మొహం తల్లీ. బుద్ధిమంతురాలు, అంతా మా వెంకట్ అదృష్టం. మేం బీదోళ్ళమని రావటం మానకు తల్లి. నీ ఆశీర్వాదం కావాలి" అన్నాడు.

కార్డు అందుకుని చూశాను. అట్లాగేలే అన్నాను. లోపలికి వెళ్ళి కార్డు దాచిపెట్టి ఐదు రూపాయలు తెచ్చి యిచ్చాను, పెళ్ళికి వెడతామో లేదోఅని.

"ఒక పాతచీర యిచ్చెయ్ తల్లి.. నువ్వు కట్టి విడిచింది. మా యావిడ మరీమరీ అడిగింది. నీచేత్తో చీరయిచ్చి చాలారోజులైంది. ఏదో నీదయా ధర్మం వల్ల యిలా గడిచిపోతోంది" అన్నాడు.

నవ్వు వచ్చింది. దయాధర్మం వల్ల గడిచే రోజులాయివి! రెండు వేలు ఖర్చు చేసి పెళ్ళి చేస్తున్నాడట. పార్టీ యిస్తాడట, నా పాత చీర కావాల్సివచ్చింది. యింట్లో తినటానికి కట్టడానికి ఉన్నాలేకపోయినా పెళ్ళికి ఆర్భాటం



తప్పదు మనలో. ఆఁ నిజంగా పార్టీ యిస్తాదేమిటి! ....

కాలింగ్‌బెల్ చప్పుడువిని అనుకున్నాను దశరధుడేమోనని.

తలుపు తీశాను. నిజమే నేను అనుకున్నది, దశరధుడు నిలబడి ఉన్నాడు

'రా...రా....' అంటూ లోపలికి తప్పుకున్నాను.

లోపలికి వచ్చి తలుపేశాడు. చెప్పులు విప్పి, గొడుగు మూలన పెట్టాడు

అట్లాగే నిలబడి పోయాడు.

అప్పుడు చూశాను. కళ్ళలోంచి నీళ్ళు జల జలా రాలుతున్నాయి.

మొహంలో జీవకళలేదు. విగ్రహం ఏడుస్తున్నట్లుగా ఉంది.

కంగారు పడిపోయాను.

"ఏమైంది! ఏమైంది!" అన్నాను.

తుండు కొసతో కళ్లుతుడుచుకున్నాడు. 'మా వెంకట్ చచ్చిపోయాడమ్మా' అన్నాడు. షాక్ తిన్నాను. ఏమనాలో, ఏమడగాలో తెలీటంలేదు. పెళ్ళయి ఆర్నెల్లయింది కాబోలు. కోడలు కాపరానికి వచ్చిందని చెప్పాడు.

"అదేమిటి! పెళ్ళయింది...

"అవునమ్మా అన్నీ అయిపోయాయి. వాడికి నూరేళ్లు నిండి పోయాయి." అంటూ అక్కడే కూర్చుండి పోయాడు.

'అట్టాకూర్చో తల్లీ. వినుకో అంతా చెప్తాను. ఈగుండెలో భారం దింపు కుంటాను. ఇంత కష్టం ఎవరికీ వద్దు తల్లి. నాశత్రువుకికూడా వద్దు"

కళ్ళజోడు తీసి జేబులో పెట్టుకున్నాడు. నేను కుర్చీలో కూర్చున్నాను.

"పెళ్ళి అయిందా. పదితులాల బంగారం పిల్లకి బెట్టారు. వాడికి సూటు, రిస్టువాచీ ట్రాన్సిస్టరు..."

"ఔను మంచి సంబంధం. పెళ్ళి బాగా జరిగింది" అన్నాను ఏమయిందో తరువాత సంగతి వినాలని నాకు ఆదుర్దాగా ఉంది.

"ఔనుగదా తల్లి. ఆరునెలలు దివ్యంగా గడిచాయి. మరి కంపెనీవాడి కేంవచ్చిందో ఈడి ఉద్యోగం ఊడబీకేశాడు పందిరిపైకి

పోకిన తీగని పీకెయ్యటానికి వాళ్ళకి చేతులెట్లా
వొచ్చినాయో! వీడితోబాటు యింకోనలుగురిని
తీసేశారు. ఆళ్ళకేంతొప్పి. ఎద్దు పుండుబాధ
కాకికి తెలుస్తుందా తల్లీ. వాళ్ళకి డబ్బుబాగా
మూలుగుతోంది నువ్వు తింటే వాడికేం, చస్తే
వాడికేం. వాడి బతుకు దర్జాగా గడిచిపోతోంది.
పాలసీ అంటారు. ప్రాఫిటులేదంటారు. దొంగ
కొడుకులు. ఏదైతేనేం తల్లి, మా నోళ్ళలో
దుమ్ము పడిపోయింది. సరేనా వాడికి ఉద్యో
గం లేదు. వాడుయింట్లోనే కూకోవటం. యింట్లో
కూరలేదు నారలేదు. చాయ్‌చుక్కలు కూడా
కరువై పోయాయి. నేను చూస్తే ముసలాడినై
పోయాను. అప్పటికీ ట్యూషన్ చెప్పుతూనే
ఉన్నానమ్మా. యిద్దరు పిల్లలు. యిరవై రూపా
యలు వస్తాయి. ధరలు చూస్తే అట్లాగ.
నా భార్యకి మాయదారిరోగం. దగ్గు దాని
ప్రాణం తీస్తోంది.

"సరే ఏమైంది?"

"ఏమౌతుంది తల్లి, రోజూ ఇంట్లో తిట్టుకో
టాలు, ఏడ్పులూ. కోడలుపిల్ల చదువుకున్నది
కదా. దానికిచీరలుకావాలి. సినిమాకి వెళ్లాలి. చేపలు
కావాలి. చేపలేకపోతే ముద్దఎత్తదు. మానాన్న
కట్నం యివ్వలేదా? ఆ డబ్బంతా ఏమైంది.
అంటుంది. మానాన్న దిక్కుమాలిన
సంబంధం చేశాడు అంటుంది. "దేవుడా
నన్నెత్తుకపో" అని ఏడుస్తుంది నాభార్య.

వాడు, నా కొడుకు యింటిగడప దాటడు.
నలుగురిలోకివెళ్లనంటాడు, యింకో నౌకరీ
వెతకమంటే ఏం లేదంటాడు. సత్యం—నా
పెద్ద కొడుకు కాలిమీద గొడ్డలివేసుకున్నాడు.
హాస్పిటల్లో ఉన్నాడు. అదేసుఖం, యింట్లో
రోజూగొడవలే. మీరిట్లాగొడవచేస్తే ఈమాత్రలు
తిని చనస్తాని బెదిరించాను. నా భార్యకి
నిద్రపట్టడానికి ఆ మాత్రలు యిచ్చాడు
డాక్టరు బాబు.


రెండురోజులు బాగానేగడిచింది. ఎవరూ
నోరు విప్పలేదు....ఉన్న గంజినీళ్ళు తాగాము.
కంట్రాక్టుపని అవుతోందని తెలిసింది.
సూపరెన్టెంట్‌సాబ్‌ని వెళ్ళి అడిగి వచ్చాను
ఖాళీలున్నాయేమోనని, నెలరోజులు పోయాక
రమ్మన్నాడు. రోజులు భారంగా
గడుస్తున్నాయమ్మా, తెల్లారే పొద్దు రాక
పోతుందాఅని ఓపిక పట్టానమ్మా. యింత
జావ, పచ్చిమిరపకాయ ఉల్లిగడ్డకూడాలేదు.
ఉంటే కోడలికివ్వాలి. పోనీ ఉద్యోగమిస్తారు
వెంకట్‌కి, కంట్రాక్టరుకి లంచం పెడదామను
కుని తాకట్టుకి గొలుసిమ్మని కోడల్ని
అడిగాను, ఆ యమ్మ కాళికై పోయింది,
యియ్యనుగాక యియ్యను అంది. యిదికూడా
మీకిస్తే నాకుదిక్కేమిటి అంది. యిది కూడా
మింగేస్తారంది,

"నాకు ఉద్యోగం వస్తుందికదా!" అన్నాడు
వెంకట్

"అంత నమ్మకం ఉంటే అప్పుతెచ్చుకోండి.
తీర్చుకోండి. తిండికేగతిలేనివాళ్ళని మాఅయ్యకి
తెలీదు. నాగొంతు కోశాడు." అని శోకం
పెట్టింది.

ఆణ్ణి తనతో వాళ్ళయ్య దగ్గరికి ఎల్లిపోయి
రమ్మంది.

నాతల్లినీ, తండ్రినీ ఒగ్గెయ్యనని వీడు. ఉద్యో
గంపోయి మావ ఇంటికివెళ్ళ నన్నాడు. ఆ తల్లి
అలిగి పడుకుంది. నాకూతురు ఎక్కడ నించో
బియ్యం తెచ్చి అన్నం వండింది. మేమంతా
జావతాగాం. కంచంలో అన్నంపెట్టి మిరిచ్చిన
ఊరగాయ ముక్కేసి కోడల్ని పిలిచింది మా
యావిడ. అన్నీఉంటే మేమూ బాగా చూసు
కుందుమమ్మా. రంగంలో ఉన్నప్పుడు రోజూ
కోడికూర తిన్నవాణ్ణి. నాభార్య ఒక్కరోజూ
వంటచేసి ఎరగదు, మాకూ పనిమనిషిఉండేది.
ఏంచేస్తాం తల్లీ ఓడలు బళ్ళుఅవుతాయి. ఇది
మూర్ఖురాలు. సత్యంకానలేదు. పిండి వంటలూ
పలారాలు కావాలంటుంది. మొగుడికి ఉద్యోగం
పోయిందని తెలుసునాదానికి; నిలబడి పళ్ళాన్ని
కాలితో ఒక తన్ను తన్నింది. పళ్లెంబోర్లాపడి
అన్నం నేలమీద పడిపోయింది. మేం నలుగురం
చూస్తున్నాం తల్లీ, మూడురోజుల్నించి జావతో



పొట్ట నింపుకుంటున్నాం, ఆదికాలితో అన్నాన్ని
తన్నేసింది. వాడు, నాకొడుకు ఒక్కవూపులో
వెళ్ళి దాన్ని లెంపకాయ కొట్టేసినాడు.

"నీకు నేను అండి పెట్టలేను, పో వెళ్లి పో,
ఎక్కడికి పోతావో నీతండ్రి దగ్గరికి పోతావో
మగవాడి దగ్గరికి పోతావో" అని బయటికి
తోసేశాడు. వెనక్కి చూడకుండా వెళ్ళి
మక్కమీద పడిపోయాడు.

అగి [illegible] పోయింది. నా కూతురంత అద్దు
[illegible] పెట్టి తీసుకొని వెళ్ళి
[illegible]యింది.

"అది వెళ్ళి పోయిందిరా నాయనా...లే"
అని ఎంత లేపినా లేదాదు కామ. రోజంతా
అట్లాగేపడి ఉన్నాడు. రగులు కొంటున్న
కొయ్యలాగ.

తెల్లారింది నా కూతురెళ్ళి, బియ్యం దంచి
[illegible] తెచ్చింది. చాయ్ చేశాము.

తప్పుపట్టుకెళ్ళి వాణ్ణి లేపింది

"లేవరా వెంకటూ వేడివేడిగా తాగెయ్."
[illegible]టూ మీద చెయ్యేసింది. వేసిన చెయ్యిజిల్లు
[illegible] వెనక్కి లాక్కుంది.

"[illegible]యనోయ్... అనిఒక్కకేక.

అందరం పరుగెట్టాం....ఏముంది! ఆవొంట్లో
[illegible] పక్కన మాత్రల సీసాకాళీగా
వుంది,

నేను అందర్నీ బడిపిద్దా మనుకున్నాను,
నటించాను.

వాడు నిజంగానే చేసేశాడు,

పెళ్ళాన్ని పొమ్మన్నాక ఇంక జన్మెందుకు
అనుకున్నాడు తల్లీ.

తల్లినీ తండ్రినీకూడా గుర్తుంచుకోలేదు.
అందరితో సంబంధం తెంచేసుకున్నాడు. నాకు
కడుపుశోకం పెట్టేశాడు....దేవుడిట్లాగరాశాడు
తల్లీ, కళ్ళుతుడుచుకున్నాడు.

ఏమనటానికీ నోటమాటరాలేదు.

వినటమైతే కథలాగవినేశాను.

దేవుడురాసినరాత, నుదుట గీత అనుకుని
ఓదార్చు కుంటాం.

తండ్రికీ ఉద్యోగంలేక, కొడుకుకీ ఉద్యోగం
పోవటం వలన కదా ఇట్లాగ జరిగింది,
సుఖంగా సాగుతున్న సంసారం కష్టాలపాల
యింది.

ఆ పిల్లది మాత్రం తప్పనటం ఎట్లా? ఆ పిల్ల
అడిగిందీ, కాదందీ తిండి కోసమేకదా. ఇరవై
రూపాయలిద్దా మనుకున్నాను. కాని దానితో
వాళ్ళ సమస్య పరిష్కారంకాదు. వాళ్ళదరిద్రం
ఆకలీ తీరవు. వాళ్ళకి కావలసింది ఉద్యోగం.
దశరథుడికి ఐదు రూపాయలిచ్చి పంపాను. నా
దగ్గర ఉద్యోగాలు లేవుకదా ఇవ్వటానికి మరి!



ఆయన అడుగు జాడలలో
ఆంధ్రప్రదేశ్

అది అంత సులభతరంకాదు. ఎందుకంటే ఆయన లాంటి మహా మనిషి ఆయన ఒక్కరే. అయినా, మనకు వీలయినంతవరకు మనం చేస్తున్న కార్యక్రమాల మేరకు ఆయన సిద్ధాంతాలను పాటించడానికి ప్రయత్నం చేయవచ్చు.

ఆగస్టు 13 న ఈదుల్ ఫితర్ నాడు ముఖ్యమంత్రి హిందువులతో పాటుగా తనతోటి ముస్లిం సోదరులతో చిరస్మరణీయమైన ఈద్ మిలావ్‌లో పాల్గొన్నారు. ఆ విధంగా ఆంధ్రప్రదేశ్ మహాత్ముని అడుగుజాడలలో నడిచింది.

ఆంధ్రప్రదేశ్ సెప్టెంబర్ 23 న మళ్ళీ అదే విధంగా చేసి తన ప్రత్యేకతను నిలుపుకుంది. మరెక్కడాలేని విధంగా కేవలం ఒక్క హైదరాబాదులో మాత్రమే 10 లక్షలకుపైగా హిందూ ముస్లిం ప్రజలు కలిసి విగ్రహాల నిమజ్జనం నాడు గణేశ్ ఉత్సవాలను అపూర్వమైన రీతిలో జరుపుకున్నారు. ముఖ్యమంత్రి గంటల తరబడి ప్రయాసకు ఓర్చి మరీ ఆ సంతోషఘడియలలో పాలు పంచుకున్నారు. అటువంటి సంఘటన నభూతో నభవిష్యతి.

మనందరం భగవంతుని పిల్లలమని గాంధీజీ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మనం ఉడతాభక్తిగా ఆయన సూక్తులను నిజం చేస్తున్నాము.

ఈ సత్సంప్రదాయాన్ని పరిరక్షిద్దాం,

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధశాఖ,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఈ కథకు ఇదే ముగింపు!

పైడిపాల

దొరబాబు—

పేరుకే కాదు—

హుందాకీ – అందానికీ

ఆస్తికీ – అంతస్థుకీ

భాషకీ – వేషానికీ కూడా !

దొరబాబు రాజారావు గారి సుపుత్రుడు. పట్నంలో చదువుకుంటున్నాడు. సెలవలకని వచ్చాడు. తండ్రి ఆరోగ్యం బావుండలేదు. అంచేత పొలం పనులు చూసే బాధ్యత ఈసారి తను తీసుకున్నాడు. ఆతను గట్టు మీద నిల్చుంటే చాలు – సర్వం చక్కబెట్టుకుపోయే ఉద్ధారకుడు సుబ్బడున్నాడు. కోత చక చకా సాగుతోంది. ఆడా మగా కలిసి ముప్పై మందున్నారు. అలసట మర్చిపోడానికి పాటందుకున్నారు.

"కందిరీగ నడుము దానా
కంది పువ్వు సాయ దానా
సందెయేళ కలుసుకోనా ?—"

అంతా వంత పాడుతున్నారు గాని ఆ పిల్ల మాత్రం పొడ్డుం లేదు.

దొరబాబు వచ్చినప్పటి నుంచి చూస్తున్నాడు–

ఆ పిల్ల అరవిరిసిన అడవి మల్లెలా వుంది.

రస హృదయుడైన శిల్పి తీర్చి దిద్దిన బొమ్మలా వుంది.

అప్పుడే తొలకరించిన ప్రకృతిలా వుంది.

ఎవరో?— ఎవరో తెలుసుకోవాలనే ఉబలాటం.

వచ్చి రాగానే అడిగితే లోకువ అవుతాననే భయం దొరబాబు నోటిని కట్టేసింది. ఆ పిల్ల వరికోతలో చెయ్యి తిరిగింది మాత్రం కాదు. చూపుతో గుండెను కోసేస్తోంది. వంగి కోస్తున్నప్పటి వంపులు సొంపులు అతని కళ్ళను కలవర పెడుతున్నాయి. పది నిముషాలు ఓపిక పట్టాడు. ఆ పిల్ల పలుకు బంగారమయింది.

"ఏం సుబ్బడూ – ఈ కొత్త పిల్లకు పాటలు రావా?" దొరబాబు ధైర్యం చేసి కదలేగాదు.

"సదూకొంది బాబూ. ఈ పని పాటలు సరిగా అబ్బలేదు"

"పోనీ వచ్చిన సినిమా పాటలు పాడొచ్చుగా!" కదిలించాడు దొరబాబు.

"సినిమా పాటలు పాడుద్ది బాబూ– పక్కన మీలాంటి ఈరో వుంటే" సత్తెమ్మ మోటు హాస్యమాడింది, దొరబాబు ఆ పిల్లమీద మోజు పడుతున్నాడని పసికట్టి.

"ఛీ! పో. ఇలాంటి మాటలంటే నేను పన్లోకి రాను" ఆ పిల్లను సిగ్గు, కోపం– రెండూ ఆవహించాయి.

అప్పుడింక సంభాషణ పొడిగించటం మంచిదికాదనుకున్నాడు దొరబాబు.

"తెల్చి కోసెయ్యకండి. కిందికి కొయ్యండెహే" సుబ్బడు జనాన్ని హెచ్చరించాడు.

"నల్ల నల్లని కబ్బుతోన లగ్గో పిల్లా
తెల్ల తెల్లని సందమామ లగ్గో పిల్లా..."

ఈసారి సత్తెమ్మ పాట మొదలు పెట్టింది, మిగతా వాళ్ళు శ్రుతి కలిపారు. పాట హుషారెక్కే కొద్దీ ఒళ్ళు మరచి పన్జేస్తున్నారు జనం.

మధ్యాహ్నం భోజనాలకి లేచినప్పుడు దొరబాబు తనకి యింటి నుంచి వచ్చిన టిఫినూ– కాఫీ మిగిల్చి సత్తెమ్మ చేతికిచ్చాడు— ఆ చదువుకున్న పిల్లకి పెట్టమని. కాని ఆ పిల్ల కక్కుర్తి పడలేదు. అవి సత్తెమ్మకే దక్కాయి. సత్తెమ్మకి దొరబాబు చేష్టలర్థమయ్యాయి. సాయంత్రం వెళ్లిపోయే ముందు దొరబాబుతో



గుసగుసలాడింది.

"ఆ పిల్ల నా మేనగోళ్ళే. తమరు మనసు పడితే మచ్చిక సేత్తాను" అని. దొరబాబు మొదట నీళ్ల నమిలినా తర్వాత నోరు చప్పరించాడు, సత్తెమ్మ యిలాంటి "పుణ్య కార్యాలు" చెయ్యడానికి అలవాటుపడి పోయింది.

ఆ పిల్ల వివరాలు కనుక్కున్నాడు దొర బాబు.

పిల్ల పేరు శకుంతల.

శకుంతల తల్లినో పెదకాపు వుంచు కున్నాడు.

శకుంతల తండ్రి రిక్షా తొక్కే నాగరాజు.

తల్లి శకుంతల చిన్నప్పుడే చచ్చిపోయింది.

సత్తెమ్మ యింట్లోనే ఆ పిల్ల పెరిగి పెద్ద దయింది.

యింత వరకు ఏ తుమ్మెదకూ చిక్కని పువ్వు.

దొరబాబు ఆ రోజు సత్తెమ్మకి పది రూపాయలు అదనంగా ముట్టజెప్పాడు.

o o o o

ఎండ అది 'కారం' లా వుంది.

కళ్ళం ఎదురుగా కుర్చీ వేసుకుని కూర్చున్న దొరబాబు మకుటం లేని యువ రాజులా వున్నాడు.

కళ్ళంలో వరిమోపులు తెచ్చి వేస్తున్నారు, కుప్ప శ్రీమంతుడి భవనంలా చకచకా లేస్తోంది.

వాళ్ళలో మగాళ్ళ కంటె నేర్పుగా నిచ్చెన మీదుగా కుప్ప ఎక్కుతున్న ఆడవాళ్ళు వున్నారు, కాని ఆ పిల్ల యింత వరకూ మోపెత్తుకుని రాలేదు.

శకుంతల మోపు మొయ్యకపోతే పనికి నష్టంరాదు. కాని ఆ భంగిమలో శకుంతల "కుచంబులున్,తురుమలే నడుమల్లలనాడ.." నడిచిన వరూధినిలా ఉంటదూ?— అప్పుడు ఆ అందాలు చూడాలని దొరబాబు కోరిక.

కట్టేత జరుగుచున్న చోటికి పర్యవేక్షణకు వెళ్ళాడు. శకుంతల వరిమోపుల్ని మిగతా వాళ్ళకు ఎత్తుతోంది.

ఎవరూ లేని సమయం చూసి దొరబాబు అడిగాడు-

"నువ్వు మొయ్యలేవా ?"

"మరి మీ రెత్తుతారా ?" ఆ పిల్ల బుగ్గల్లో ముద్దమందారాలు విరబూసాయి.

"ఎత్తనా?-కానియ్. పని తొందరగాజరుగు తుంది" అతగాడి కొంటె చూపుల్లోకోటితుమ్మె నెల ఝుంకార ముంది. శకుంతల చీర చెంగు నెత్తి మీదకులాక్కొనిమో పెత్తుకొంది."కచ్చా" పోసుకొని నడుస్తున్న శకుంతల ప్రబంధ సుందరిలా వుంది, ఆమె పిక్కల సొగసుఅతని కళ్ళను కవ్విస్తోంది. అతి కష్టం మీద కుప్ప వరకు వెళ్ళింది. అక్కడ మరొక రందుకొని కుప్పమీదకి మోసు కెళ్ళారు.

ఆ తర్వాత వచ్చిన వాళ్ళందరికీ మోపు లెత్తడం దొరబాబు వంతయింది. అలవాటులేక పోయినా శకుంతలకోసం కష్టపడుతున్నాడు. కుప్ప ఎక్కడం చేతకాక మధ్యలో మోపు ఎవరో ఒకళ్ళకి ఎత్తి వచ్చేస్తోంది గనుక శకుం తల అందరికంటెఎక్కువ సార్లు మోపులకోసం వస్తోంది.

దొరబాబు అవకాశం వచ్చినపుడల్లా ఆమె కళ్ళ లోకి చూస్తున్నాడు. గుండెల వంకగుచ్చి గుచ్చి చూస్తున్నాడు. వేళ్ళు తాకాడు. శకుం తల మాట్లాడలేదు. తర్వాత ధైర్యం చేసిమోపు ఎత్తుతూ చెయ్యి నిమిరాడు.


"ఏమిటీ సరసం!" మృదువుగానే విడిపించు కొని వెళ్ళిపోయింది.

"ఫర్వాలేదు. పిట్టలైనులో వుంది" అను కొన్నాడు దొరబాబు. ఓ గంట గడిచింది. దొరబాబు ముంజేతులు గీరుకు పోయాయి. అతగాడి అవస్థ గమనించింది సత్తెమ్మ.

"మీకెందు కొచ్చిన సెమబాబూ?"

"పిల్లకి పని నేర్పు తున్నాను"

"ఆ !_గొప్పపనోడే చూతత్తా, గింజలన్నీ నేల పాలవుతున్నాయి" చెమటలు కక్కుతూ



వస్తున్న శకుంతల అందుకొంది.

"మొయ్యడం చేత గాక పోతేసరి"

"...లేపడి ఆ పని కూడా చేసేరు గనుక. ...ల్లు... "...రగారు హాస్పటల్ కి" విలపిగా ... శకుంతల.

"ముట్టసకుం...తుంది — ...యిష్ట కాదు, పని అవుల్పంది అంటూ వేగంగా వచ్చిన సుబ్బుడు ...రబాబుని చూసి "సినబాబూ- ఆ పిల్ల యెత్తుతుంది, మీరెళ్ళి నీడ ని కూర్చోండి" అన్నాడు చనువుగా.

"అవున్రా, కూలి నష్టమయినా ఫర్వా లేదు గాని, గింజలు నష్టమయితే కష్టం" నవ్వుతూ గద్దెక్కాడు దొరబాబు.

నిజానికి దొరబాబుకి మోపు లెత్తడం చేత కాదు. శకుంతలకి మొయ్యడం చేతకాదు. గింజలు రాలిపోతున్నాయి. కాని ఆ మాటనే ధైర్యం ఎవరికీ లేదు. ఆ మాటనకుండానే సమస్యని తేలికగా పరిష్కరించాడు సుబ్బుడు.

మధ్యాహ్నం అందరూ చెట్టునీడని భోం చేస్తుంటే కావాలని సత్తెమ్మ దొరబాబు కూర్చున్న మోటార్ షెడ్ దగ్గరికి_ శకుం తలతో చేరింది.

సత్తెమ్మా, ఈ పిల్ల చనువుకుందన్నావు కదా- ఏదీ ఈ అక్షరాలు చదవమను" అంటూ అదను చూసుకొని సిగరెట్టు పెట్టె నాలిక మీద బాల్ పాయింట్ పెన్ తో రాసిచ్చాడు.

"ఐ లవ్ యు"అని నాలుక కరుచుకుంది శకుంతల.

"అంటే అర్థం చెప్పు చూద్దాం" దొరబాబు సవాల్.

"ఛీ! నేను చెప్పను"

"సెప్పవే. మన సినబాబు దగ్గర సిగ్గేటి?"

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను"

"చూశావా, సత్తెమ్మా! మీ పిల్ల ఏమం టుందో?— నువ్వే మో నోట్లో వేలు పెట్టినా..." దొరబాబు మాటలు పూర్తి కాకుండానే సిగ్గుతో సీతాకోక చిలుకలా అక్కణ్ణుంచి తుర్రుమంది శకుంతల!

o o o o

గుడిలో దేవుళ్లుంటారు.

చెరలో ముద్దాయిలుంటారు.

కాని ఆ గుడిలో ముద్దాయిల నుంచడం రివాజు,

గొంతాలమ్మ గుళ్ళో దొరబాబూ. శకుం

తలా—

గుడికి తాళం వేశారు-తాళాల చెవులు గుడి పెద్దల చేతుల్లో వున్నాయి. దొరబాబు, శకుంతలా తప్పు చేస్తుండగా పట్టుబడ్డారు. గూడెం పెద్దలు సమావేశమై తీర్పుచెప్పారు. ముద్దాయిలకు"తప్పు"వేస్తారు. అంతవరకు వాళ్ళు గుళ్లో ఉండాల్సిందే.

ఈ వార్త ఊరంతా చిచ్చులా పాకింది. రాజారావుగారి చెవిన్ని కూడా పడింది. కాని ఎంత డబ్బు పలుకుబడి వున్నా ఇలాంటి విషయాల్లో గూడెం పెద్దల్ని కాదన లేడు.

ఆసక్తివున్న జనం గుడి దగ్గర కొచ్చిఊచల్లోంచి ఆ జంటనుచూస్తున్నారు. గుమిగూడిన జనంతో గుడి దగ్గర తిరునాళ్ళలా వుంది.

రాజారావుకి" ప్రిస్టేజి" అడ్డం వచ్చి అక్కడికి రాలేదు. అతగాడి బంధువులు మాత్రం వచ్చి కులపెద్దల్ని ప్రలోభ పెడుతున్నారు.

సాధారణంగా ఇలాంటి తప్పు జరిగినప్పుడు అబ్బాయి కిష్టమైతే ఆ కులంలో చేరి ఆమ్మాయిని పెళ్ళాడొచ్చు. లేదా అమ్మాయి తప్పు చెల్లించి కులాన్ని విడిచిపెట్టేసి వెళ్లి అబ్బాయిని పెళ్ళి చేసుకోవచ్చు. లేదా మరో అవకాశం కూడా వుంది. అబ్బాయి కులంపెద్దలు విధించిన జుర్మానా చెల్లించేసి ఈ (నిర్) బంధంనుంచి బయటపడొచ్చు. అతడు కట్టిన జుర్మానా సంఘానికే దక్కుతుందిగాని ఆ అమ్మాయికి పైసాకూడా రాదు. ఈ అవకాశాన్ని వినియోగించుకోమని దొరబాబుని ఆత్మీయులు వత్తిడి చేస్తున్నారు. కులం పెద్దలు పెళ్ళిచేసుకోవడమో, తప్పుకట్టడమో తేల్చుకోమని దొరబాబుని అడిగాడు.

శకుంతల దొరబాబు వాగ్దానాన్ని నిలబెట్టుకోమని ప్రాధేయపడింది.

మొదట్లో సత్తెమ్మ ఎంత ప్రోత్సహించినా దొరబాబు ఎన్ని ఎరలు చూపించినా శకుంతల దొరబాబుకి లొంగలేదు. చివరకు శకుంతల లేనిదే బ్రతకలేననీ, ఆమెను పెళ్లి చేసుకుంటాననీ ఒట్టు వేశాడు. శకుంతల అతని మాటలకు మైనంలా కరిగిపోయింది. కొన్నాళ్ల మైకం తప్ప ఈ లోకం వాళ్ళకి తెలియలేదు. పొలంలో వున్న "పాయింట్ షెడ్" ప్రేమకుటీరమైపోయింది. కథ కంచె దాటింది. గుట్టు రట్టయింది. శకుంతలచేత తిరస్కరింపబడ్డ గూడెంలో మగాళ్ల వలలేసి జంటగువ్వలను పట్టుకున్నారు.

దొరబాబు శకుంతల కన్నీళ్లు తుడిచాడు. చెవిలో గుసగుసలాడాడు. ఫలితంగా దొరబాబు కులం పెద్దలు విధించిన వెయ్యిరూపాయలు జుర్మానా ఆనందంగా చెల్లించి విడుదలైపోయాడు. కులం పెద్దలు రెండు కడవల కల్లుతో విందు చేసుకున్నారు. డబ్బుతో పాపం పరిహారమై పోయింది.

నెలలు గడిచాయి. శకుంతల ఎదురుచూస్తోంది-దొరబాబు రాకకోసం. దొరబాబు రాలేదు. "బాబు" మాత్రం రాబోతున్నాడు.

శకుంతల చెవుల్లో దొరబాబు గుసగుసలు వినిపిస్తున్నాయి—కోనసీమ కాబ్బరా కుల సవ్వడిలా....

"పిచ్చిదానా, నిన్ను విడిచిపెట్టి నేను ఉండగలనా?-ఇప్పుడే పెళ్ళంటే గుండెజబ్బుతో వున్న నాన్న "హరీ" అంటాడు. ఆ నింద ఇద్దరిమీద పడుతుంది. అంచేత ప్రస్తుతానికి తప్పుకట్టి బయటపడదాం. ఆనక ఉద్యోగం రాగానే నిన్ను తీసుకెళ్లి పెళ్లి చేసుకుంటాను. నన్ను నమ్మవూ?"

రెండోసారి అతని మాటల్ని నమ్మింది. ఇంకా నమ్ముతోంది-ఎదురు చూస్తోంది.


దొరబాబు జాడా, జాబూ లేదు—

శకుంతల మగశిశువును ప్రసవించింది.

దొరబాబు వచ్చి చూస్తాడని, తనని బిడ్డని తీసుకెళ్తాడనీ శకుంతల కళ్ళలో గంపెడాశ.

ఆ కులంలో మారుమనువు చేసుకోవడం తప్పుకాదుగనుక వేరే సంబంధం చేసుకోమని శకుంతలకి కావాల్సినవాళ్ళు సలహా ఇస్తున్నారు.

కుర్రాడున్నా తమకభ్యంతరం లేదని శకుంతల కావాల్సిన వాళ్ల ఇంటి చుట్టూ తిరుగుతున్నారు.



మరో బంగారు పిచికని చూసి పెడతానని సత్తెమ్మ పోరుతోంది జోరీగలా

శకుంతల ఎవరి మాటా వినడం లేదు. తన తనువు, మనసూ దొరబాబుకే అంకితం. అవి మరొకరికి అర్పించలేదు!

ఇంతలో శకుంతలకో వార్త తెలిసింది, దొరబాబు పట్నంలో ఆఫీసరు ఉద్యోగం చేస్తున్నాడని. అతని అడ్రసు సంపాదించి పసికందుని ముస్తాబు చేసి ఆనందంగా అక్కడికి ప్రయాణమయింది-సాగరాన్ని కలవడానికి ఉరకలేస్తున్న నదిలా....

వెళ్ళిన రెండు మూడు రోజులకి "దొరగారి" దర్శనమయింది. భార్యతో కారుమీద షికారెళ్ళడానికి సిద్ధంగా వున్న దొరబాబు శకుంతలని చూసి చీదరించుకున్నాడు. "మా పొలంలో పన్చేసే పిల్ల"అనిభార్యచేత రెండ్రూపాయలు "ముష్టి"వేయించాడు, కారు ముందుకు దూసుకుపోయింది. శకుంతల ప్రాణ్పడి పోయింది.

శకుంతల అప్పటికి అర్థం చేసుకొంది-తను గుర్తింపులేని ఊటపాయననీ, ఆకలి తీరాకా విసిరేసిన ఎంగిలి విస్తరాకుననీ- భద్రంగా దాచుకొనే వెండి కంచాన్ని కాదనీ!

పౌరాణిక కాలంలో శకుంతల భరతుడితో సహా దుష్యంతుడి దగ్గరకు వెళ్ళి మొరపెట్టుకొంటే! ఏనెట, నీవెట, సుతుడెట...?" అని అబద్ధం ఆడేశాడా మహారాజు. ఇప్పుడా మాట కూడా అనే తీరిక లేదీ మగమహారాజుకి. ఆ కాలంలోలా ఇప్పుడే ఆకాశవాణీ తనను ఆదుకోదు. ఆకాశవాణిని అడ్డం పెట్టి వ్యాసుడు శకుంతల కథని సుఖాంతం చేసి వుండకపోతే తనీ అపరదుష్యంతుడి మాయ మాటల్లో పడి వుండేది కాదేమో! కనీసం తన కథయినా తర్వాత వాళ్ళకి గుణపాఠం కావాలి.

ఇప్పుడెక్కడికి వెళ్ళాలి?-గూడానికి వెళ్ళి ఆ అవహేళనని భరించ గలదా? మరేం చెయ్యాలి? ఏది గమ్యం? ఎవరుదిక్కు? గమ్యంతెలీనిపాదాలు కదులుతున్నాయి.

మరో మూడ్రోజులకి శకుంతల అందరికీ కనిపించింది—

ఉబ్బి పోయిన శరీరంతో–

జలచరాలు పీక్కుతిన్న గాయాలతో–

భరించరాని దుర్గంధంతో–

ఊరితీయబడిన అందంలా—

మోసగించబడిన మానవతలా—

ఊరి పెద్ద కాలవలో తేలుతూ తేలుతూ...!

○ ○ ○ ○

కథ చదవడం పూర్తి కాగానే మిత్రుడు శాస్త్రి రెండు ఆరోపణలు చేశాడు- శాస్త్రి ఈ కథకి ప్రథమ శ్రోత.

ఒకటి పెద్దలు అలా జుర్మానా తీసుకొని దొరబాబుని విడిచిపెట్టెయ్యడం సబబుగా లేదని. రెండు-శకుంతల ఆత్మహత్య చేసుకోవడం (?) పిరికితనమనీ. అందువల్ల ముగింపు ఆశావహంగా లేదట !

చిత్తుప్రతే కదా - కథ రెండో సగం చింపి పడేశాను.

○ ○ ○ ○

సాధారణంగా ఇలాంటి తప్పు జరిగినప్పుడు అబ్బాయి కిష్టమైతే ఆ కులంలో చేరి అమ్మాయిని పెళ్ళాడొచ్చు! లేదా ఆ అమ్మాయి తప్పు చెల్లించి కులాన్ని విడిచి పెట్టేసి వెళ్ళి అబ్బాయిని పెళ్లి చేసుకోవచ్చు. అంతేగాని ఇంతకు ముందులా "తప్పు"కి కేవలం జుల్మానా కడితే విడిచి పెట్టే పద్ధతి లేదని స్పష్టం చేశారు కులం పెద్దలు.

వాళ్లిచ్చిన "ఛాయిస్" లో పెద్దగా ఆలోచించవలసింది, బుర్ర బద్దలు చేసుకోవలసిందీ ఏం కనిపించలేదు దొరబాబుకి. అమ్మాయిని తనతో తీసుకెళ్లి పెళ్లి చేసుకోవడానికి అంగీకరించాడు. అయితే వివాహ పద్ధతిమాత్రం తన నిర్ణయానికి విడిచిపెట్టాలని షరతు పెట్టాడు, పెద్దలు అతని మాటల కొడబడి శకుంతల తప్పు చేసినందుకు అయిదొందల జుల్మానా, రెండు కడవల కల్లు ఆమె కాబోయే భర్త దొరబాబు నుంచి స్వీకరించారు. ప్రేమికుల జంట గుడి నుంచి విడుదలయ్యారు. అయితే ఆ క్షణం నుంచి శకుంతల గూడెంలో వుండడానికి వీల్లేదు. ఆమెను కులం నుంచి బహిష్కరించారు. దొరబాబు శకుంతలని పొలంలోని "ప్రేమ కుటీరం" లో వుంచి పోషిస్తున్నాడు.

ఆమె అతని జీవితంలో అడుగు పెట్టిన వేళా విశేషమో - ఏమో తెలియదు కాని దొరబాబుకి పట్నంలో ఆఫీసరు ఉద్యోగ మొచ్చింది. తన వశమయ్యే ముందు తను వాగ్దానం చేసిన ప్రకారం శకుంతలని రిజిష్టర్ మారేజ్ చేసుకుని పట్నంలో కాపురం పెట్టాడు.

తననెంతో ప్రేమగా చూసుకొంటున్నాడని, తన కాపురం స్వర్గంలా వుందని శకుంతల అప్తులకి ఉత్తరాలు రాస్తోంది. అయిదారు నెలలు గడిచాయి. శకుంతలకి నెలతప్పింది.



ఈ సంతోషకరమైన వార్త తెలియగానే శకుంతల కిష్టమైన పిండివంటలు చేసింది సత్తెమ్మ, అవి తీసుకొని సత్తెమ్మ, నాగరాజు శకుంతలని చూడ్డానికి సంబరంగా పట్నం బయల్దేరారు. వాళ్ళు వెళ్లి తలుపు తోసేసరికి దొరబాబు, నలుగురైదుగురు స్నేహితులు దీనంగా కూర్చొని వున్నారు.

పక్కన శకుంతల –

కాలిపోయిన శరీరంతో –

వికృతంగా వున్న బొబ్బలతో. గాయాలలో

దుర్భరమైన కమురు కంపుతో...!

దొరబాబు మొహంలో నెత్తురు లేదు. 'రండి.... సమయానికి వచ్చారు, నా 'శకు' నన్ను ఒంటరిని చేసి వెళ్లి పోయింది.... ఇంక మాటలు పెగలడం లేదు,

సత్తెమ్మ శకుంతల శవం మీదపడి బావురుమంది,

"గాస్‌స్టవ్ వెలిగించబోతే చీర అంటుకొని ఒళ్ళుకాలిపోయింది. సమయానికి దొరబాబు యింటి దగ్గర లేడు" మిత్రులు చెప్పారు.

శకుంతల శవ దహనం జరిగిపోయింది తండ్రి సమక్షంలో.


ఆర్నెల్లు తిరక్కుండానే దొరబాబుకి రెండు లక్షల కట్నంతో వచ్చిన కుల వధువుతో అతి వైభవంగా వివాహం జరిగింది.

దొరబాబు ప్రతి యేడూ పేపర్లో 'శకుంతల దివ్య స్మృతి'ని మాత్రం ప్రకటిస్తున్నాడు... శకుంతల నిజంగా గాస్ స్టవ్ ప్రమాదంలోనే చనిపోయిందనే భావం తప్ప మరో అనుమానం ఎవరికీ రాకూడదని...!

○ ○ ○

తిరిగి రాసిన ఈ సగం వినిపించి శాస్త్రితో అన్నాను—

'నీకీ ముగింపు కూడా రుచించదని నాకు తెలుసు, కాని జరుగుతున్న ఈ కథకి యిదే ముగింపు. ఈ కథకి ఆశావహమైన మరో ముగింపు యిచ్చే మంచి కాలం కోసం ఎదురు చూద్దాం-ఆశిద్దాం' అన్నాను. *



సినిమాగా 'మాలపల్లి'

మహా రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణ సృష్టించిన మహత్తర నవల "మాలపల్లి"ని దృశ్య కావ్యంగా చూడాలని ఆశించిన వారి కోరిక ప్రఖ్యాత రంగస్థల నటుడు ఏ. ఆర్. కృష్ణ, ప్రముఖ కవి నగ్నముని చేసిన కృషి ఫలితంగా తీరింది. "మాలపల్లి" నాటక రూపాన్ని చూసినప్పుడు దీన్ని సినిమాగా తీస్తే యెంత అద్భుతంగా ఉంటుందో కదా అనిపించిన మాట నిజమే కానీ, ఆ కోరిక కూడా యింత త్వరగా ఫలిస్తుందనుకోలేదు తెలుగు వారు. బ్రిటిష్ ప్రభుత్వ హయాములో నిషేధించబడి, స్వాతంత్ర్యానంతరం నిషేధం తొలిగించబడిన ఆ నాటి సుప్రసిద్ధ నవల "మాలపల్లి", అచ్చయిన ప్రతి నవలనీ నిర్మాణార్థం పరిశీలిస్తున్న తెలుగు చలనచిత్ర నిర్మాతల దృష్టిని ఆకర్షించకపోవడం విచిత్రమే.

ఇన్నాళ్ళకు, అరుణోదయా ఫిలింస్ వారు ముందుకొచ్చి "మాలపల్లి"ని చిత్రంగా రూపొందిస్తున్నట్టు ప్రకటించారు. ఇందుకు నిర్మాతలు సోమరాజు, సత్యనారాయణల్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నాము. కమలాకర కామేశ్వరరావు దర్శకత్వం వహించడం కూడా ఈ బృందం ఉన్నవ వారి నవలకు యథాతథ రూపకల్పన కావించగలదనే ఆశాకిరణం కల్పిస్తోంది. కానీ ఇటీవలి కాలంలో "మాలపల్లి" నవల ఔన్నత్యాన్ని తమ నాటకం ద్వారా తెలుగు దేశానికి జ్ఞాపకం చేసిన ఆ ఇరువురి పేర్లూ (ఎ.ఆర్. కృష్ణ, నగ్నముని) ఈ చిత్ర నిర్మాణంతో ముడిపడి ఉండకపోవడం కొంత విచారాన్ని కలిగిస్తోందని చెప్పక తప్పదు. 1981 జనవరి నుంచి షూటింగు ప్రారంభం కానున్న "మాలపల్లి" ఆంధ్రదేశంలోని పల్లెపల్లెలోనూ ప్రదర్శించబడాలని కోరుకుందాము.

యుగధర్మం

నిర్మాత, దర్శకుడు విఠల్ ఆచార్య (బి. విఠలాచార్య కాదు) హైదరాబాదులో నిర్మిస్తున్న వర్ణచిత్రం "యుగధర్మం" షూటింగు పూర్తయింది. ఆచార్య పిక్చర్స్ పతాకంతో నిర్మించబడిన ఈ చిత్రానికి సంబంధించిన చివరి షెడ్యూలు సెప్టెంబర్ 31 వరకు హైదరాబాద్ సారథి స్టుడియోస్‌లో జరిగింది.

ఇంకొక 'ఇల్లాలు'

తాతినేని రామారావు దర్శకత్వంలో, అట్లూరి పూర్ణ చంద్రరావు సమర్పణలో నిర్మాత జి. బాబు నిర్మించనున్న ఈస్ట్‌మన్ కలర్ చిత్రానికి "ఇల్లాలు" అనే పేరు స్థిర పరిచారు. 1960 దశకంలో ఎల్.వి. ప్రసాద్‌గారు, సంజీవి దర్శకుడుగా, గీతాంజలి కథానాయికగా నిర్మించిన



'మొగుడు కావాలి'లో గాయత్రి, చిరంజీవి

"ఇల్లాలు" యింకా ప్రేక్షకుల స్మృతి పథం నుంచి పూర్తిగా చెరిగిపోయివుండదు తాతినేని రామారావు గారు కొత్త "ఇల్లాలు" ఎల్. వి. ప్రసాద్‌గారి చిత్రాన్ని మరి పిచేతటి మహత్తరంగా తయారవు తుందని ఆశిద్దాం. "ఇల్లాలు"లో శోభన్

'సంధ్యారాగం'లో ప్రభ





'ఆశాజ్యోతి'లో సుజాత.

బాబు, జయసుధ, శ్రీదేవి ప్రధానపాత్రలు పోషిస్తున్నారు.

'శుభోదయం' పాటల జోరు!

శ్రీరామ్ ఆర్ట్ పిక్చర్స్ పతాకంతో సి. హెచ్. నరసింహారావుగారు నిర్మించిన "శుభోదయం"లోని పాటలు శ్రోతల్ని బాగా ఆకట్టుకొన్నట్లు కనిపిస్తోంది. ఇటీవల జంట నగరాలలో గణపతి ఉత్సవాలు జరిగినప్పుడు ఎక్కడ విన్నా 'శుభోదయం' పాటలే వినిపించాయి. ముఖ్యంగా

"గంధము పూయరుగా" అనే పాట బాగా ప్రచారంలోకి వచ్చింది. కె. విశ్వనాథ్ దర్శకత్వంలో నిర్మించబడిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది.

సప్తపది

కె. విశ్వనాథ్‌కి హిందీ చిత్ర నిర్మాతలనుంచి అందుకున్న ఆహ్వానాలసంఖ్య అధికంగానే ఉన్నా ఆయన తెలుగుచిత్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోంది. జ్యోతి ఆర్ట్ క్రియేషన్స్ పతాకంతో భీమవరపు బుచ్చిరెడ్డి నిర్మిస్తున్న "సప్తపది" షూటింగ్ విశ్వనాథ్ దర్శకత్వంలో అక్టోబర్ నాలుగో వారంలో ప్రారంభమవుతోంది. రెండు నాయక పాత్రలకు కొత్త వారినే తీసుకోబోతున్నారు. కథానాయికగా కూడా కొత్త నటినే ఎన్నిక చేయనున్నట్టు తెలుస్తోంది.

నందనరావు పునఃప్రవేశం!

ఒకనాటి ప్రముఖ దర్శకుడు కె.వి నందనరావు మళ్ళీ ఒక చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. "తారక ప్రభు" సంస్థ నిర్మించే చిత్రంతో నందనరావు మళ్ళీ వెలుగులోకి రావడం విశేషం. చిత్రం పేరు 'జయ-సుధ'. దాసరి నారాయణ రావు కథ, మాటలు, స్క్రీన్ ప్లే రాస్తున్న ఈ చిత్రంలో జయసుధ, మురళీమోహన్, మోహన్‌బాబు మొదలైనవారు నటిస్తారు. 'తారకప్రభు' వంటి ప్రేక్షకాదరణపొందిన సంస్థ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం రావడమే నందనరావు భవిష్యత్తు నందనం కానున్నదని సూచిస్తోంది. వుయ్ విష్ హిమ్ ఆల్ ది బెస్ట్!

కొత్త పంపిణీ సంస్థ 'సాయి కృష్ణా ఫిలింస్'


"సాయి కృష్ణా ఫిలింస్" పేరుతో మరొక భారీ చలన చిత్ర పంపిణీ సంస్థ విజయవాడలో అక్టోబరు 8న ప్రారంభమైంది. అక్కినేని నాగేశ్వరరావుగారు, విజయవాడలోని గాంధీనగర్‌లో ఈ కొత్త సంస్థ ప్రధాన కార్యాలయానికి ప్రారంభోత్సవం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పి. చంద్రశేఖరరావు పూజ చేశారు. పూర్ణా పిక్చర్స్ ప్రయివేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జి. కామరాజుగారు సంస్థ వ్యాపార కార్యక్రమాలను ప్రారంభించారు.

సర్దార్ పాపారాయుడు, స్వయంవరం, ఎం. ఎల్. ఏ. ఏడుకొండలు, బొండోడు-గుండమ్మ, మేఘ సందేశం, (ఇవన్నీ దాసరి నారాయణరావు గారి దర్శకత్వంలో తయారవుతున్న చిత్రాలే) వంటి భారీ చిత్రాల పంపిణీతో ప్రారంభమవుతున్న సాయికృష్ణా ఫిలింస్ అనతి కాలంలోనే మూడు శత దినోత్సవాలూ ఆరు రజతోత్సవాలుగా వృద్ధి చెందాలని "జ్యోతి" ఆశిస్తోంది.

—దేవీదాసు

బహుమతి రు. 100

శ్రీశ్రీ నిర్వహిస్తున్న పదబంధ ప్రహేళిక



ఆధారాలు

అడ్డం:

1 [illegible] కు రేడియో

[illegible]

[illegible] అట్టు ముళ్ళం

[illegible]

8 చేతిది కత్తి

9 పత్రిక అయాచితం కాదు

11 డీలు పడితే తినుబండారం

13 వలయమున నది లేదు

15 సంసారంతో బందీ

16 తన క్రింది గుమాస్తాకు మహిళా కలెక్టరు
17, 21-అటూఇటూ ప్రవహించేవి
19 పిల్లలకు ఆట, పిల్లులకు ఎలుక
22 బంగారు తల్లి
23 ఈ యింట జగణం కందానికి అందం
25 తల లేని 20
26 కోడి
28 తల కట్టు
30 గజ్జరాలో సగం
31 మధురవాణి తగువు

5 తోటకూర శాకిని
7 విఘ్నాలు వినాయకునివి
8 ద్వీపం
10 దిగంబరుల కూటంలో జేబు దొంగలు
12 అడవం ఏనుగు 19
14 రుచి చూసేది
15 సుల్తానులు ప్రభువులు
17 వైరి యింద్రుడు
18 యిదే ఆధారం !
20 యివి 9
21 చూడు 17 అడ్డం
23 సాధారణంగా ఏకాంకం
24 చిహ్నం
27 వైదర్భ్యాది 29 నయమయి

నిలువు :

1 తెలుగులోతెలుగు 2 పొలాలకు బలం
3 ఇదివరలో నాలుగు విధాలు
4 ప్రతి ఒక్కరికీ

అక్టోబర్ 1980 ప్రహేళిక సమాధానాలు

అడ్డం : 1. ఆశ, 3. అల, 5 నాటకు, 6. దృగంతం, 8. చేను, 9. నికృష్టం 11. టాకీ, 13. తోడికో 15. విలుచు, 16. కర చాలనం 17. కొంపలు 19. డిబరా 22, గద 23 కలువ 25. డబ్బు 26. వినమ 28. గదబ 30. దుంఠి 31. రుక్కు. నిలువు : 1. ఆట 2 శకుని 3. అదృష్టం 4. లగం 5. నానుడి 7. తంటాలు 8. చేతో 10. కృష్ణాచార్యులు 12!, కీచు 14 క్రోకలు 15 వినండి 17 కొంగ 18 పదవి 20 బడబ 21 రాశ్ను 23 కమఠి 24 వగరు 27 నడుం 29 దక్కు

అక్టోబరు 1980 విజేతలు

1 నాని, ఆనందపురం 2 కె వి ఎన్ ఆచార్య, హైదరాబాద్ 3 బి. నీలకంఠరావు, ఖమ్మం 4 ఆర్ కమల, హసన్‌పర్తి 5 ఎన్ రామశాస్త్రి, వరంగల్ 6 ఎం వి కృష్ణమాచార్యులు, సింహాచలం 7 కె సుందరమ్మ, వాల్తేరు 8 మాదిరాజు శివప్రసాదరావు, హైదరాబాద్ 9 కె ఎ సింగరాచార్యులు, హైదరాబాద్

నిబంధనలు గమనించండి :

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి అక్టోబర్ 25 వ తేదీ లోపు మాకు చేరేట్టు పంపండి. తెల్లకాగితం మీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపే వారు వారి పూర్తి చిరునామా ఎంట్రీ పైనే రాసి పంపాలి. ఆల్ కరెక్టు ఎంట్రీకి రు. 100/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీలు వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడు తుంది. ఆల్ కరెక్ట్ ఎంట్రీ ఒకటి రాకపోతే బహుమతి సొమ్ము పై నెలబహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది: ఒక ఎంట్రీమీద ఇరువురి పేర్లుపుండకూడదు.

Edited & Published by V. Leelavathy Raghavaiah, at 1-8-4/1/1, Chikkadpalli, Hyderabad-20 & Printed by P. Ramakrishna at Raghava Printers, 1-8-4/1/1 Chikkadpalli, Hyderabad-500 020.

JYOTHI NOVEMBER ౮౦, R.S. ౩-౫౦ Regd No: M8669-HYD/SD



Sri Selvanayagi Printing Works, Madras-21